




www.navabhoomi.in | epaper.navabhoomi.in

RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 07 సోమవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 203

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# రమణీయం..కమనీయం

- కన్నుల పండువగా సీతారాముని కళ్యాణం
- భద్రాద్రికి పోటెత్తిన భక్తజనం
- మురిసి మెరిసిన మిథిలా ప్రాంగణం
- వేడుకకు సతీ సమేతంగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు
- నేడు శ్రీరామ పట్టాభిషేకం





భద్రాచలం ఏప్రిల్ 6 నవభూమి ప్రతినిధి:
ఆకాశమంత పందిరి, భూదేవంత మండపం,
సిరి కళ్యాణపు బొట్టును పెట్టి, మణి బాసికమును నుదుటున కట్టిన పెళ్లికూతురు సీతమ్మవారు. సంపంగి నూనెను కురులను దువ్వి,
సొంపుగా కస్తూరి నామము తీర్చిన పెళ్ళికొడుకు రాములోరు ఎదురెదురు కూర్చుండగా.
అర్చక స్వాముల వేద పరిమళాలతో సాగిన శ్రీ సీతారాముల కళ్యాణం జగత్ కళ్యాణం.
కళ్యాణ క్రతువు నయనానందకరం.
ఆధ్యాంతం ముగ్ధ మనోహరం.
భక్తుల శ్రీరామ నామస్మరణలతో మిథిలా ప్రాంగణం మురిసి మెరిసింది.
వేద భూమి భద్రగిరి పరవశించింది.
అశేష భక్తజనంతో పుణ్య నేల పులకరించింది.
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన అశేష భక్తజనంతో భద్రాచలం పోటెత్తింది.

**రమణీయం రాములోరి కళ్యాణం:**
వేద భూమి భద్రాచలం పుణ్యక్షేత్రంలో మిధుల ప్రాంగణంలో ఆదివారం జరిగిన శ్రీ సీతారాముల వారి తిరు కళ్యాణ మహోత్సవ వేడుక ఆధ్యాంతం భక్తులను కనువిందు చేసింది. తరతరాలుగా ప్రతి ఏటా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న విషయం విధితమే. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవంలో భాగంగా తొలుత ఉదయం రామాలయంలోని గర్భగుడిలో ధ్రువమూర్తులకు అర్చక స్వాములు కళ్యాణం జరిపారు. తదుపరి భాజా భజంత్రీల సవ్వడి, సన్నాయి మేళాల సందడి, భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని పల్లకిపై ఊరేగింపుగా మిథుల మండపం వద్దకు తీసుకువచ్చారు. సీతమ్మవారిని, రాములవారిని ఎదురెదురుగా కూర్చోబెట్టి అర్చక స్వాములు కళ్యాణ తంతును ప్రారంభించారు. తిరు కళ్యాణము కు సంకల్పం చేసి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం గావించారు. దర్భ తాడును సీతమ్మ వారి నడుముకు బిగించారు. రాములోరి కుడి చేతికి, సీతమ్మ వారి ఎడమ చేతికి రక్ష సూత్రాలు తొడిగారు. సువర్ణ యజ్ఞోపవీతాన్ని ధరింప చేశారు.ప్రవరణ, మోక్ష బంధన, యజ్ఞోపవేతం, వరపూజ, మధుపర్కం సూత్రం తదితర కార్యక్రమాలను అర్చక స్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ



# సామాన్యుడి ఇంట సన్నబియ్యంతో
# సీఎం భోజనం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- సారపాకలో ఓ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంటికి విచ్చేసిన సీఎం
- ఆ గ్రామస్తుడి ఇంట సహపంక్తి భోజనం
- పేదవాడి కళ్లల్లో ఆనందం చూశానంటూ ట్వీట్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు మండలంలో ఉన్న సారపాకలో పర్యటించారు. ఈ సందర్భంగా, ఆయన సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందిన ఒక వ్యక్తి ఇంటికి విచ్చేశారు. సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. వారి జీవన పరిస్థితులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.
ఈ అనుభవంపై సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో స్పందించారు. పేదవాడి ఇంట కంచంలో సన్నబియ్యం... కళ్లల్లో ఆనందం... స్వయంగా రుచిచూశానని భావోద్వేగభరితంగా వివరించారు. సారపాకలో... స్వయంగా లబ్ధిదారుల ఇంట

# కొత్త మతం వచ్చేసింది!


- ప్రపంచంలోనే కొత్త మతానికి యుఏఈలో ఆవిష్కారం
- అబూదాబీలో కొత్త మతం కోసం కేంద్రం ఏర్పాటు
- ముస్లింలు,యూదులు,క్రైస్తవులను కలిపే కొత్తమతం
- ఈ మతానికి 'ఇబ్రహీం ఏక్ ఫెయిత్'
- ఇది మతం కాదని, మతపరమైన ప్రాజెక్టు అంటున్న విశ్లేషకులు



**అబూదాబి-నవభూమిబ్యూరో**
ప్రపంచంలో కొత్త మతం వచ్చేస్తోంది.. దేవుడా ఇది నిజమేనా? చరిత్రను తిరగేస్తే, ప్రపంచంలోని అన్ని మతాలు వేర్వేరు సమయాల్లో.. వేర్వేరు వ్యక్తుల ద్వారా ప్రారంభించబడ్డాయి ప్రపంచంలో త్వరలోనే ఒక కొత్త మతం రాబోతోందని, దీని కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో ఒక కేంద్రాన్ని కూడా సిద్ధం చేశారని జోస్యం చెప్పారు. ఈ భవిష్యవాణిని భారతదేశానికి చెందిన ప్రముఖ ఇమామ్ డాక్టర్ ఇమామ్ ఉమైర్ ఇలియాసి వెల్లడించారు. కొత్త మతం ముస్లింలు, యూదులు, క్రైస్తవులను కలుపుతుందని ఆయన అన్నారు. అంతేకాదు, ఆ కొత్త మతానికి 'ఇబ్రహీం ఏక్ ఫెయిత్' అని పేరు కూడా పెట్టారు. అయితే, ఒక కొత్త మతం ఎలా ఏర్పడుతుంది? దీని కోసం ఏదైనా కేంద్రాన్ని ఏర్పాటు చేయవలసి ఉంటుందా? ముఖ్యంగా, ఒక కొత్త మతానికి గుర్తింపు ఎలా, ఎక్కడ లభిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఆఫ్రికన్ల వీసాల రద్దు.. ట్రంప్ మరో సంచలనం డాక్టర్ ఇమామ్ ఉమైర్ ఇలియాసి ఈ వాదనను ఊరికే చేయలేదు. గత ఏడాది కూడా ముస్లింలు అధికంగా ఉన్న అరబ్ దేశంలో 'అబ్రహం' అనే కొత్త మతం ఉనికిలోకి వచ్చిందని వార్తలు వచ్చాయి. ఇస్లాం, క్రైస్తవ , యూదు మతాల మధ్య ఉన్న సమానత్వాల కారణంగా వారి మధ్య దూరాన్ని తగ్గించడమే ఈ మతం లక్ష్యం. అయితే, ఇది కొత్త మతం కాదని, కేవలం ఒక మతపరమైన ప్రాజెక్ట్ అని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఇమామ్ ఉమైర్ ఇలియాసి కొత్త వాదనతో దీనిపై చర్చను లేవనెత్తారు. వాస్తవానికి, మనిషి పుట్టినప్పుడు ఏ మతం లేదు. కానీ

# అమెరికాతో మాట్లాడండి

- రొయ్యలకు సుంకం మినహాయించేలా చూడండి
- 27% దిగుమతి సుంకంతో ఆక్వాకు నష్టం
- ఆక్వా రైతాంగానికి అండగా నిలవాలి
- ఏపీ జీడీపీలో మత్స్యరంగం కీలకం
- కేంద్ర మంత్రి గోయల్‌కు సీఎం బాబు లేఖ



**అమరావతి-నవభూమి:** భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఉత్పత్తులపై 27% దిగుమతి సుంకం విధించిన అమెరికా ప్రభుత్వంతో వెంటనే చర్చలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రప్రభుత్వానికి సూచించారు. సుంకాల జాబితా నుంచి రొయ్యల ఉత్పత్తులను మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర జీడీపీలో మత్స్యరంగం కీలక భూమిక పోషిస్తోందని, అమెరికా సుంకాల కారణంగా ఆక్వా పరిశ్రమ నష్టపోతోందని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో రైతాంగానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. 'భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం 27% దిగుమతి

# ఏపీపై కేంద్రం నివేదిక

**అమరావతి-నవభూమి:** రాష్ట్ర పురోగతిపై కేంద్ర ప్రభుత్వం ఓ నివేదికను విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. అత్యధిక ఆర్థిక వృద్ధి రేటును నమోదు చేసింది. 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో ఏపీ.. మొత్తంగా 8.21 శాతం మేర వృద్ధి రేటును అందుకుంది. ఏపీ కంటే తమిళనాడు ముందంజలో ఉంది. 9.69 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఏపీలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్, వ్యవసాయ రంగాల్లో వృద్ధి రేటు కనిపించినట్లు కేంద్ర ప్రభుత్వం తన నివేదికలో పొందుపరిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో నిలుస్తోండటం, ప్రభుత్వం అనుసరిస్తోన్న పారిశ్రామిక విధానాలు, పరిపాలనలో పారదర్శకత.. వంటి చర్యలు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని పెంపొందడానికి దోహదం చేశాయి. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ అమలులో కూడా అగ్రగామిగా గుర్తింపు పొందింది ఏపీ. రాష్ట్రాన్ని.. దేశంలోనే నంబర్ వన్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవిశ్రాంతంగా కృషి చేస్తోండటం వల్లే ఏపీ అత్యధిక ఆర్థిక వృద్ధి రేటును నమోదు చేయగలిగింది. గత ఏడాది జూన్‌లో చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ఆర్థికరంగంపై దృష్టి పెట్టారు. రాష్ట్రం ఎదుర్కొంటోన్న కీలక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి సంభవించిన నష్టాల నుండి కోలుకోవడానికి తక్షణ చర్యలను తీసుకుంటోన్నారు. టీడీపీ- జనసేన- బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంస్కరణలు సానుకూల ఫలితాలను ఇస్తోన్నాయనడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఈ నివేదికే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. పారిశ్రామిక పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం మూడు కొత్త పారిశ్రామిక విధానాలను ప్రకటించింది.

## సీపీఎం జాతీయ ప్రధాన
# కార్యదర్శిగా ఎంఏ బేబీ



**తిరువనంతపురం-నవభూమి:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. ఆయనతో పాటు మొత్తం 18 మంది సభ్యులతో కూడిన కొత్త పొలిట్ బ్యూరోను సీపీఎం జాతీయ నాయకత్వం ఎన్నుకుంది. ఇందులో ఎనిమిది కొత్త ముఖాలకు చోటు లభించింది. కేరళ ముఖ్యమంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు పినరయి విజయన్‌కు పార్టీ పదవులు చేపట్టడానికి 75 సంవత్సరాల వయోపరిమితి నుండి మినహాయింపు లభించింది. తమిళనాడులోని మధురైలో సీపీఎం జాతీయ మహాసభలు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుందా కమ్యూనిస్ట్ దిగ్గజ పార్టీ. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీని నియమించింది. బేబీ పూర్తి పేరు- అలెగ్జాండర్ బేబీ. ఆయన స్వరాష్ట్రం కేరళ. రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం..! కొల్లంలో 1954 ఏప్రిల్ 5వ తేదీన జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పీఎం అలెగ్జాండర్, లిల్లీ అలెగ్జాండర్. ప్రాక్కులంలోని

## మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు
# అహ్మద్ బాషా అరెస్టు

- ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి
- టీడీపీ నేతపై దాడి సహా 6 కేసులు
- నేడు కడపకు తీసుకురానున్న పోలీసులు
- 2022లో అప్పటి టీడీపీ నేతపై దాడిలో
- నాన్‌బెయిలబుల్ కేసు నమోదు
- బాషాపై మరో ఐదు వేర్వేరు కేసులు



**కడప-నవభూమి:** వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ బాషాను కడప తాలూకా పోలీసులు ముంబైలో అరెస్టు చేశారు. 2022లో నగరంలోని వినాయకనగర్‌లో మినిస్టరు కాలనీ పేరిట అంజద్ బాషా కుటుంబ సభ్యులు లేఅవుట్ వేశారు. దీనికి అనుమతులు లేవని ఆరోపణలు వచ్చాయి. ఈ లేఅవుట్‌కు ఆనుకునే అప్పటి టీడీపీ నేత, ఇప్పుడు వైసీపీలో ఉన్న జమీల్‌కు స్థలం ఉంది. దీని విషయమై అహ్మద్‌బాషా జమీల్, అతడి వర్గంపై దాడి చేశారు. ఈ దాడిలో ముస్తాక్ అహ్మద్ అనే వ్యక్తికి కాళ్లు విరిగాయి. అహ్మద్‌బాషాపై కడప తాలూకా పోలీసుస్టేషన్‌లో నాన్ బెయిల్‌బుల్ కేసు (క్రైం నం.402/22) నమోదైంది. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది నిందితులుగా ఉన్నారు. ఇది కాకుండా ఆయనపై కడప చిన్నచౌకులో ఒకటి, టూ టౌన్‌లో మరో నాలుగు కేసులు ఉన్నాయి. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో వీరి జోలికి ఎవరూ పోలేదు. ఇక.. ఎన్నికల సమయంలో ఇప్పటి హోంమంత్రి అనిత, అచ్చెన్నాయుడుపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా బాషా పోస్టులు పెట్టారు. వీటిపైనా కేసు నమోదైంది. ఎన్నికలకు ముందు అహ్మద్ బాషా ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.మాధవిని, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని తీవ్ర పదజాలంతో దూషించారు. అప్పట్లో ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. దీనిపై కూడా కేసు నమోదైంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక అహ్మద్‌బాషా సైలెంట్ అయిపోయారు.
ఎక్కువ కాలం గల్ఫ్‌లో ఉంటూ హోటల్ బిజినెస్ చేస్తున్నారు. ఇంకోవైపు.. ఆయనపై చిన్నచౌకు పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. రంజాన్ పండక్కి కడపకు వచ్చిన ఆయన తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు ఐదురోజులుగా ముంబైలో ఉంటున్నారు. శనివారం రాత్రి

## పండగ వేళ..ముగ్గురు చిన్నారులు
# కృష్ణానదిలో గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం..మోదుముడిలో విషాదం



**అవనిగడ్డ-నవభూమిప్రతినిధి:** కృష్ణా జిల్లా: శ్రీరామ నవమి వేళ కృష్ణా జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ముగ్గురు చిన్నారులు కృష్ణా నదిలో దిగి గల్లంతైన ఘటన అవనిగడ్డ మండలం కొత్తపేట గ్రామంలో చోటు చేసుకుంది. పండగ సందర్భంగా మోదుముడి గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు స్నానాల కోసం కృష్ణ నదిలోకి దిగారు. మత్తి వర్ధన్(16), మత్తి కిరణ్(15), మత్తి దొరబాబు(15).. ఆదివారం

# కొలికపూడికి పరాభవం

- తిరువూరు టీడీపీ ఎమ్మెల్యేకు అవమానం
- కొలికిపూడిని చూసినా చూడనట్లు వెళ్లిన సీఎం
- ఎమ్మెల్యే పక్కనున్న వారికి సీఎం పలకరింపు




**నందిగామ-నవభూమిప్రతినిధి:** నియోజకవర్గంలో వరుస వివాదాలతో పార్టీకి తలనొప్పిగా మారిన తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు నందిగామ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో పరాభవం ఎదురైంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి తన వద్దకు రాగానే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి ఆయనకు నమస్కరించారు. అయితే చంద్రబాబు ఆయనను పట్టించుకోకుండా పక్కనున్న నేతను భుజం తట్టి పలకరించారు. అదే సమయంలో టీడీపీ మహిళా నేతలు అక్కడకు రావడంతో చంద్రబాబు వారితో ముచ్చటించారు. కొలికపూడి ముఖ్యమంత్రి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించినా ఆయన స్పందించలేదు. ఇతర నేతలు ముందుకు రావడంతో

# అమెరికాలో అగ్నిప్రమాదం.. క్షేమంగా బయటపడ్డ పది మంది విద్యార్థులు.. అంతా తెలుగువారే



**హైదరాబాద్-నవభూమి:** అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి పది మంది తెలుగు విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. శనివారం సాయంత్రం 6.20 గంటల సమయంలో బర్మింగ్‌హామ్‌లోని కెల్లామ్ స్ట్రీట్‌లో ఉన్న రెండు అపార్టుమెంటుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బిల్డింగ్ మొత్తానికి వ్యాపించడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అపార్టుమెంట్లలో ఉన్న పది మంది విద్యార్థులను రక్షించారు. వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో దవాఖానకు తరలించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితులంతా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులని పేర్కొన్నాయి. వారు అలబామా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నారని తెలిపాయి. అపార్టుమెంట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని వెల్లడించాయి. శనివారం సాయంత్రం 6.20 గంటలకు బిల్డింగ్‌లో మంటలు వ్యాపించాయని బాధితుల్లో ఒకరు ఇన్‌స్టా పోస్టు ద్వారా వెల్లడించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, వేగంగా అపార్టుమెంట్ మొత్తం వ్యాపించాయని తెలిపారు. అందరం వెనుక డోర్ నుంచి బయటకు వచ్చేశామని, కానీ ఒకరు మాత్రం పొగలు దట్టంగా అలముకోవడంతో అందులో చిక్కుకుపోయాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి నిలకడగానే ఉన్నదని అందులో తెలిపారు. అగ్నిప్రమాదం నుంచి తాము బయటపడటం చాలా గొప్పవిషయమని చెప్పారు.



## ఇంటి దిష్టి తొలగిస్తానంటే నమ్మింది.. నట్టేట మునిగింది



**హైదరాబాద్-నవభూమి:** ఇటీవల కాలంలో రకరకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. అమాయకులను టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ఈజీ మనీకి అలవాటుపడి ఫేక్ బాబులు, స్వామిజీల రూపంలో ప్రజల్ని దోచుకుంటున్నారు. జాతకాలు, విశ్వాసాలను ఆసరాగా చేసుకొని అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రజలు కూడా వారిని గుడ్డిగా నమ్మి నట్టేట మునుగుతున్నారు. పరిహారాల పేరుతో సర్వం పోగొట్టుకుంటున్నారు. తాజాగా.. హైదరాబాద్ నగరంలో ఓ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఇంటి దిష్టి పోగతానంటూ ఓ ఫేక్ స్వామిజీని ఓ అధ్యాపకురాలిని మోసం చేశాడు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ. 20 లక్షలతో ఉడాయించాడు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన ఓ మహిళ దిల్‌సుఖ్‌నగర్‌లోని జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తుంది. భర్త చనిపోవడం, కుటుంబ పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో తరుచూ ఆవేదన వ్యక్తం చేసేది. కాలేజీ ప్రిన్సిపల్ సూచనతో ఆమె ఎల్‌బీనగర్‌కు చెందిన ఓ శివస్వామిని ఆశ్రయించింది. ఆమె గురించి పూర్తి వివరాలు తెలుసుకున్న స్వామి ఓ రోజు ఆమె ఇంటికి వచ్చాడు. ఇంటి దోషం కారణంగా భర్త చనిపోయాడని మాయ మాటలు చెప్పాడు. పూజలు చేయకుంటే ఇంకా అనర్థాలు ఎదురయ్యే అవకాశం ఉందని భయపెట్టాడు. పూజల పేరుతో రూ. 1.70 లక్షలు వసూలు చేశాడు. కనకదుర్గ ఆలయంలో పూజల కోసం మరో 20 తులాల ఆభరణాలు లెక్చరర్ నుంచి తీసుకున్నాడు.

పూజలు చేస్తున్న క్రమంలోనే ఆలయ అర్చకుడు చనిపోయాడంటూ ఆమెను భయపెట్టాడు. అలా కాచిగూడలోని ఇంటిపత్రాలను సైతం కాజేశాడు. ఆ తర్వాత విషయం తెలుసుకున్న అధ్యాపకురాలి కుమార్తె.. తల్లిని తీసుకుని శివస్వామి వద్దకు వెళ్లి గొడవ చేసింది. దీంతో తీసుకున్న ఇంటిపత్రాలను తిరిగి ఇచ్చేశాడు. నగదు, 20 తులాల బంగారం మాత్రం ఇవ్వలేదు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎల్బీనగర్ పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాగా చదువుకున్న వారు కూడా ఇలాంటి ఫేక్ స్వామిజీ బుట్టలో పడటం కలవరపాటుకు గురి చేస్తుంది. అన్ని తెలిసి కూడా ఈజీగా మోసపోవటం ఆందోళనకు గురి చేస్తోంది.


## ఘోర ప్రమాదం.. సీతారాముల కల్యాణం జరుగుతుండగా..




**జనగామ-నవభూమి:** దేశవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్న వేళ జనగామ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పాలకుర్తి మండలం వల్మిడి సీతారాముల కల్యాణోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. ఇవాళ (ఆదివారం) శ్రీరామ నవమి సందర్భంగా వల్మిడి గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. గ్రామస్థులంతా బంధుమిత్రులను పిలుచుకుని వేడుకకు హాజరయ్యేందుకు సిద్ధం అయ్యారు. పుణ్యస్నానాలు ఆచరించి అంతా వేదిక వద్దకు చేరుకున్నారు. అంగరంగ వైభవంగా వేడుక మ్మొదలవ్వగా.. ఒక్కసారిగా గాలి దుమారం బీభత్సం సృష్టించింది. భారీ గాలులు భక్తులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. వేగంగా వీచిన గాలులకు కల్యాణ మండపం, భక్తులు కూర్చొన్న టెంట్లు కుప్పకూలాయి. ఈ ఘటనలో పలువురు భక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. గంటలకుంట గ్రామానికి చెందిన సంధ్యరాణి, చెన్నూరుకు చెందిన మనుశ్రీ, వసూరి మారమ్మ తలలపై టెంట్లకు సంబంధించిన ఇనుప రాడ్ల పడ్డాయి.

ఇనుల రాడ్లు పడడంతో బాధితుల తలలు పగిలి తీవ్ర రక్తస్రావం అయ్యింది. హుటాహుటిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మరికొందరు భక్తులకు సైతం గాయాలు అయ్యాయి. అయితే బాధితుల్లో వసురి మారమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పండగ వేళ ఇలాంటి ఘటన జరగడంతో వల్మిడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పోస్టల్ ఖాతాలో నెలకు రూ.2500 వేస్తారట..!



**హైదరాబాద్-నవభూమి:** మహిళా సమృద్ధి యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిరుపేద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున పోస్టాఫీసు ఖాతాలో జమ చేస్తుంది. ఇందుకోసం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతా ఉంటే చాలట..!! ఎలా మొదలైందో ? ఎక్కడ మొదలైందో ? తెలియదు కానీ.. ఈ ప్రచారం హైదరాబాద్ గల్లీల్లో కొద్ది రోజులుగా జోరుగా జరుగుతోంది. ఈ ప్రచారాన్ని నమ్మిన హైదరాబాద్ మహిళలు.. ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతా తెరిచేందుకు అబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసు(జీపీవో)కు కొద్దిరోజులుగా పోటెత్తుతున్నారు.

ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు వచ్చే వారి కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా, మార్చి 24 నుంచి శనివారం దాకా 12 రోజుల వ్యవధిలో 2500 మంది మహిళలు ఐపీపీబీ ఖాతాలు తెరిచారు. ఇది వరకు రోజుకు ఐదు లేదా ఆరు ఐపీపీబీ ఖాతాలు మాత్రమే తెరిచేవారమని, ఇప్పుడు ఆ సంఖ్య రోజుకు 200 దాటుతుందని పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు. అయితే, మహిళలకు నెలకు రూ.2,500 పథకంపై సంబంధిత అధికారులు ఎవరైనా స్పష్టమైన ప్రకటన చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వరంగల్‌లో 'సిటీ పోలీస్ యాక్ట్'.. నెల రోజులు కఠిన ఆంక్షలు..




**వరంగల్-నవభూమి:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఏప్రిల్ 6వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు వరంగల్‌లో "సిటీ పోలీస్ యాక్ట్" సెక్షన్ 30ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం (ఏప్రిల్ 05న) రోజు సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల రోజుల్లో ఏవైనా బహిరంగ కార్యక్రమాలు, ర్యాలీలు, సభలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం నేరంగా పరిగణించబడుతుందని పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు తప్పకుండా నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. మరోవైపు.. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని కూడా పోలీసులు బ్యాన్ చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మైకులు వాడాలంటే సంబంధిత ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే మైకులు వినియోగించే సమయం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమేనని పోలీసులు వెల్లడించారు. ఈ సమయం తర్వాత కూడా మైకులు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాదు.. హాస్పిటల్స్, స్కూల్స్, కాలేజీలు, ఇతర విద్యా సంస్థల 100 మీటర్ల పరిధిలో మైకులు, డీజేలు వాడకూడదని పోలీసులు స్పష్టం చేశారు. మే 5వ తేదీ వరకు సెక్షన్ 30 అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు నిబంధనలను గౌరవించి పోలీసులకు సహకరించాలని కోరారు. అన్ని మినహాయింపులు, అనుమతుల గురించి స్థానిక పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని నగర

## గాంధీలో స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌లో అత్యాధునిక స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ అందు బాటులోకి రానుంది. రూ.45 కోట్ల వ్యయంతో ఈ సెంటర్ ఏర్పాటు చేయనుం డగా.. నిర్మా ణం దాదాపు పూర్తయింది. ఈ నెలాఖరులో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామో దర రాజనర్సింహ ఈ సెంటర్‌ను ప్రారంభించ ‌నున్నారు. ఈ సెంటర్‌లో అత్యా ధునిక సౌకర్యాలు, కొత్త టెక్నాలజీతో ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తు న్నారు. ప్రస్తుతం గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో నిమ్స్ మాత్రమే ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్లకు కేంద్రంగా ఉంది. గాంధీ ఎస్ఓటీసీ అందుబాటులోకి వస్తే, రాష్ట్రంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్లకు ఒక ముఖ్యమైన కేంద్రం అవుతుంది. దీని ద్వారా పేద ప్రజలకు కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ట్రీట్‌మెంట్ అందుబాటులోకి వస్తుంది. ఇదివరకు ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ట్రీట్‌మెంట్ పేద ప్రజలకు అందుబాటులో లేదు. ఎస్ఓటీసీలో పేషెంట్లకు, డాక్టర్లకు మంచి సౌకర్యాలు ఉంటాయి. ఇది కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో ఉంటుంది. కిడ్నీ, లివర్, లంగ్స్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్లకు సంబంధించిన ఆపరేషన్ థియేటర్లు ఇక్కడ ఉన్నాయి. రెండు ఆర్థోపెడిక్, ఈఎన్టీ ఆపరేషన్ థియేటర్లు కూడా ఉన్నాయి. మూడు పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. డోనర్లు, రిసీవర్లకు వేర్వేరు ఆపరేషన్ థియేటర్లు ఉంటాయి. వాటికి ప్రత్యేక ఎంట్రీలు కూడా ఉంటాయి. ఆపరేషన్ థియేటర్ నుంచి ఆడిటోరియంలోకి 4కే వీడియో క్వాలిటీతో లైవ్ ప్రసారం చేసే ఏర్పాటు ఉంది. ఆడిటోరియంలో వన్ వే వీడియో, టు వే ఆడియో సౌకర్యం ఉంటుంది. వైద్య విద్యార్థులు ఆడిటోరియం నుంచి ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్లను లైవ్‌లో చూడవచ్చు. డౌట్లు ఉంటే ఆడియో ద్వారా డాక్టర్లను అడిగి తెలుసుకోవచ్చు. స్టెరిలైజేషన్ రూమ్, సప్లై రూమ్ కూడా ఉన్నాయి. ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌కు ప్రత్యేకంగా రెండు లిఫ్టులు ఉంటాయి. గాంధీ హాస్పిటల్‌లో ఎస్ఓటీసీ కట్టాలని 2017లో అనుకున్నారు. కానీ పనులు మొదలు కాలేదు. 2022 నుంచి ఎస్ఓటీసీ పనులు మొదలయ్యాయి. మొదట నాలుగు ఆపరేషన్ థియేటర్లే అనుకున్నారు. ఆ తర్వాత ఆర్థోపెడిక్, ఈఎన్టీ ఆపరేషన్ థియేటర్లను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో నిర్మాణ ఖర్చును రూ.35 కోట్ల నుంచి రూ.45 కోట్లకు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్గాన్ డొనేషన్‌ను ప్రోత్సహించడానికి చట్టంలో మార్పులు చేసింది. అవయవ దానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

# రమణీయం..కమనీయం

**(1వపేజీ తరువాయి)** భక్త రామదాసు వారు చేపించిన పచ్చల పతకం రాములోరికి, చింతాకు పతకం సీతమ్మవారికి, శ్రీరామ మాడ లక్ష్మణ స్వామి వారికి అలంకరింప చేశారు. కచ్చితంగా 12 గంటలకు పుణ్య ముహూర్తం అభిజిత్ లగ్నం సమీపించగానే వధూవరుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. జనక మహారాజు, దశరథ మహారాజు తరపున చేయించిన రెండు మంగళసూత్రాలతో పాటు, శ్రీ భక్త రామదాసు వారు సీతమ్మవారికి చేయించిన మరొక సూత్రం కలిపి మూడు సూత్రాలతో మాంగల్య ధారణ కార్యక్రమాన్ని అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా జరిపారు. తదుపరి వైష్ణవ సాంప్రదాయం ప్రకారం బంతులాట, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు జరిపారు. అష్టోత్తర హారతితో కళ్యాణ తంతును అర్చక స్వాములు ముగించారు. కళ్యాణం ఆధ్యాంతం అర్చక స్వాములు వేదమంత్రాలు గావించారు. కళ్యాణ విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. భక్తులు కళ్యాణాన్ని తిలకిస్తూ తన్మయానికి లోనయ్యారు. శ్రీరామ జయరామ అంటూ జయ జయ ధ్వనాలు చేశారు.

**ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు**

భద్రాచలంలో సాంప్రదాయబద్ధంగా ప్రతి ఏటా జరిగే శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు అందించడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు శ్రీ సీతారాముల వారి తిరు కళ్యాణ మహోత్సవ వేడుకకు హాజరయ్యారు. తొలుత రామాలయం సందర్శించి అక్కడ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మిదులా ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి సమర్పించారు. శ్రీ స్వామివారి కల్యాణంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ పౌర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కూనమనేని సాంబశివరావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు

**భద్రాద్రికి పోటెత్తిన భక్తులు:**

భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకకు దేశ నలుమూల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా సమీప ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలం తరలివచ్చారు. భక్తుల రాక కనుగుణంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు, అర్చక స్వాములు వేద పండితుల సహకారంతో వైదిక క్రతువును విజయవంతంగా జరిపారు. మిధులా ప్రాంగణంలో జరిగిన కళ్యాణ వేడుకకు భక్తులు భారీగా హాజరయ్యారు. భద్రాద్రి రామున్ని బారులు తీరి మరి భక్తులు దర్శించుకున్నారు. స్థానికులు భక్తులకు అన్నదానం, పానకం, ఇతర ఆహార పదార్థాలు అందజేస్తూ తమ భక్తి భావాన్ని చాటుకున్నారు

**శ్రీరామ పట్టాభిషేకానికి ఏర్పాట్లు:**

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మిధిలా ప్రాంగణంలో శ్రీరామ పట్టాభిషేకం వేడుక జరగనుంది. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ క్రమంలో అధికారులు హై అలర్ట్ అయ్యారు. శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు కూడా భక్తులు వేలాది సంఖ్యలో హాజరుకానున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈ వేడుకకు సంబంధించి వైదిక పరమైన ఏర్పాట్లను చేసింది

# కొత్త మతం వచ్చేసింది!

**(1వపేజీ తరువాయి)** నాగరికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రజల మత విశ్వాసాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే సనాతన, ఇస్లాం, క్రైస్తవం లేదా ప్రపంచంలోని ఇతర మతాలు వచ్చాయి. ఏదైనా మతం ఏర్పడటానికి, దాని గుర్తింపు కోసం అత్యంత ముఖ్యమైన అంశం ఆధ్యాత్మికత. అంటే, మీరు ఆధ్యాత్మికత ద్వారా ప్రజలను ఎలా ఏకం చేయగలరు. వారికి ఎలా పరోపకారం, మానవత్వం మార్గంలో నడవడానికి నేర్పించగలరు అనేది ముఖ్యం. కొత్త మతం ఎలా ఏర్పడుతుంది? చరిత్రను తిరగేస్తే, ప్రపంచంలోని అన్ని మతాలు వేర్వేరు సమయాల్లో.. వేర్వేరు వ్యక్తుల ద్వారా ప్రారంభించబడ్డాయి.

అది సనాతన ధర్మం కావచ్చు, ఇస్లాం కావచ్చు లేదా క్రైస్తవ మతం కావచ్చు. సనాతన ధర్మం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మతం, దీని ప్రారంభం తెలిసినంత వరకు 12 వేల సంవత్సరాల క్రితం నాటిది. అయితే, పౌరాణిక విశ్వాసాల ప్రకారం, ఈ మతం అంతకంటే చాలా పురాతనమైనది. ఇస్లాం, క్రైస్తవం వంటి మతాలను ప్రవక్త ముహమ్మద్, యేసుక్రీస్తు బోధించారు. అదేవిధంగా, గౌతమ బుద్ధుడు బౌద్ధమతానికి, మహావీరుడు జైనమతానికి పునాదులు వేశారు. వీరందరూ తమ ఆలోచనలతో ప్రజలను ప్రేరేపించారు. వారిని ఏకం చేశారు. అదేవిధంగా, ఏదైనా కొత్త మతం అభివృద్ధి చెందడానికి దాని విశ్వాసాలు, ఆలోచనలను చెప్పే వ్యక్తి ఉండాలి. ప్రజలు దానిని అనుసరించాలి. మతానికి గుర్తింపు ఎలా లభిస్తుంది? ఏదైనా మతానికి గుర్తింపు లభించడానికి ప్రజలు పాటించే, స్వీకరించే ఆలోచనలు చాలా ముఖ్యం. దీని కోసం ఏదో ఒక భాషలో సాహిత్యం ఉండాలి. ప్రజలు దానిని చదవాలి. దాని నుండి ప్రయోజనం పొందాలి. ఆ సాహిత్యంలో రాసిన విషయాలు సర్వత్రా ఆమోదయోగ్యంగా ఉండాలి.

## పండగ వేళ..ముగ్గురు చిన్నారులు కృష్ణానదిలో గల్లంతు

**(1వపేజీ తరువాయి)** మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే వారితోపాటు పెద్దలెవ్వరూ లేకపోవడం, వీరంతా ఈత కొట్టుకుంటూ నది లోపలికి వెళ్లడంతో మునిగిపోయారు. వీరి ముగ్గురికీ పెద్దగా ఈత రాకపోవడం, లోతును అంచనా వేయలేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చిన్నారుల అరుపులు విని స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. అయినా పరిస్థితి అప్పటికే చేయిదాటి పోయింది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు స్థానికులు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. స్థానికులు, గజ ఈతగాళ్ల సహాయంతో ముగ్గురు చిన్నారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, అతి కష్టం మీద మత్తి కిరణ్ మృతదేహం లభ్యమైంది. దీంతో పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు మిగతా ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. తమ కుమారులు నదిలో పడిపోడవంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారుల తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మరోవైపు గ్రామానికి చెందిన ముగ్గురు ఒకే రోజు గల్లంతు కావడంతో మోదుముడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కొలికపూడికి పరాభవం

**(1వపేజీ తరువాయి)** కొలికపూడి వెనక్కు వెళ్లిపోయి నిల్చుండిపోయారు. ఇతర ప్రజా ప్రతినిధులు, నేతలను పలకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కొలికపూడి విషయంలో ఇలా వ్యవహరించడంతో ఆయనపై ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామంతో కొలికపూడి ముభావంగా ఉండిపోయారు. తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయకత్వాన్ని సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుపై ఆ పార్టీ నేతలే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం కొలికపూడి తీరుపై ఆగ్రహంగా ఉంది.

## మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషా అరెస్టు

**(1వపేజీ తరువాయి)** గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ముంబై ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకుని అక్కడ సహారా పోలీసుస్టేషన్‌లో అప్పగించి కడప పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం అక్కడకు ఆయన్ను అదుపులోకి తీసుకుని బాంద్రా కోర్టులో హాజరుపరచింది. అక్కడి కోర్టు అనుమతితో సోమవారం కడపకు తీసుకురానున్నారు. ఇక్కడి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. ఈ విషయం తెలియడంతో టీడీపీ కార్యకర్తలు ఆదివారం కడపలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆర్.శ్రీనివాసరెడ్డిని నాడు బాషా తీవ్ర పదజాలంతో దూషించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'అయిపాయ్.. పాపం పండింది' అంటూ వైరల్ చేశారు.

## సామాన్యుడి ఇంట సన్నబియ్యంతో సీఎం భోజనం

**(1వపేజీ తరువాయి)** సహపంక్తి భోజనం చేసి పథకం అమలును స్వయంగా పరిశీలించానని వెల్లడించారు. అంతకు ముందు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ ఆయన స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

## అమెరికాతో మాట్లాడండి

**(1వపేజీ తరువాయి)** సుంకం విధించింది. ఈనెల 5 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. 2023-24లో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92న వాటాను కలిగి ఉన్నాయి. అమెరికాకు రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత్‌పై 27న దిగుమతి సుంకం విధించిన కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై 10% పన్ను మాత్రమే అమెరికా విధిస్తోంది. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ, వారికి అనుకూలంగా మారుతోంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77న కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ(సీవీడీ) భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలు కలుపుకొంటే ఈక్వెడార్‌కు, భారత్‌కు మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20న ఉంటుంది. ఈ కారణంగా అమెరికాకు వెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈ భారం పడుతోంది.

## సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

**(1వపేజీ తరువాయి)** ఎస్ఎన్ఎస్ హైస్కూల్‌లో చదువుకున్నారు. ఆ సమయంలోనే రాజకీయాలపై ఆసక్తిని ఏర్పడింది. వామపక్ష భావజాలానికి ఆకర్షితులయ్యారు. కేరళ కమ్యూనిస్టు సీనియర్ నేతల ప్రోత్సాహంతో క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆయన మంచి రచయిత కూడా. కొల్లంలోని ఎస్ఎన్ కళాశాలలో ప్రీడిగ్రీ విద్యను పూర్తి చేశారు. ఆ తరువాత పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదివారు. విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి సంఘాల్లో కీలక సభ్యుడిగా ఎదిగారు. ఆయన రాజకీయ జీవితాన్ని మలచడంలో విద్యార్థి, యువజన ఉద్యమాల్లో భాగస్వామ్యం.. ముఖ్య పాత్రను పోషించింది. రాశులకు అఖండ సంపదను ప్రసాదిస్తున్న సూర్య భగనువాడు" ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ.. రెండింటికీ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశారు ఎంఏ బేబీ. అనంతరం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1986 నుండి 1998 వరకు రాజ్యసభకు ప్రాతినిధ్యాన్ని వహించారు. 2006 నుండి 2016 వరకు కొల్లంలోని కుందర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 2006 నుండి 2011 వరకు కేరళ మంత్రివర్గంలో ప్రాథమిక విద్య, సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేశారు. 2012లో పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన కొల్లం నియోజకవర్గం నుండి పోటీ చేశారు గానీ గెలవలేదు. రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి ఎన్‌కే ప్రేమ్ చంద్రన్ చేతిలో ఓడిపోయారు.

## హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ బాలల నాటక ఉత్సవం..

**హైదరాబాద్-నవభూమి:** నాటకరంగంలో బాల బాలికల ప్రతిభను పెంపొందించేందుకు తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో.. ప్రముఖ నటనా శిక్షణ సంస్థ "నిశుంబితా స్కూల్ ఆఫ్ డ్రామా" హైదరాబాద్ లో మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ బాలల నాటక ఉత్సవాన్ని నిర్వహించబోతోంది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, ప్రముఖ నటుడు అనీష్ కురువిల్ల, డైరెక్టర్లు వినయ్ వర్మ, వెంకట్ గౌడ, రచయిత ఆకెళ్ళ శివ ప్రసాద్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో కోల్ కతా, భోపాల్, కేరళ ప్రాంతాల నుంచే కాకుండా నేపాల్, జపాన్ తదితర దేశాల్లోని కళాకారులు, నాటక బృందాలు సైతం పాల్గొంటున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ సోమవారం 07 ఏప్రిల్ 2025



# ఏఐతో 140 కోట్ల ఉద్యోగాలపై ప్రభావం..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ విలువ 2033 నాటికి 4.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ఇంచుమించు జర్మనీ ఆర్థిక వ్యవస్థ పరిమాణంతో సమానం. అయితే తాజాగా యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) తెలిపిన వివరాల ప్రకారం ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 140 కోట్ల (40 శాతం) ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడనుంది.ఇది తక్కువ ఖర్చుతో కూడిన శ్రమపై ఆధారపడిన దేశాలను అసమానంగా ప్రభావితం చేస్తుంది. ఈ ఏఐ అభివృద్ధిని ప్రపంచమంతటా సమానంగా పంచకోదు. ఈ అభివృద్ధి కొన్ని సంస్థలకో, లేదా అభివృద్ధి చెందిన దేశాల్లోనో కేంద్రీకృతం కావచ్చు. ప్రధానంగా అమెరికా, చైనాలు ఈ విషయంలో ముందుండి అసమానతలో మిగతా దేశాలకు హెచ్చరికగా నిలువవచ్చు.ప్రపంచ ఏఐ ఆర్ అండ్ డీ వ్యయంలో 40 శాతం కేవలం 100 సంస్థలు మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇది సాంకేతిక కేంద్రీకరణను చూపుతున్నది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా వంటి దిగ్గజాలు ఇప్పటికే ఆఫ్రికా ఖండ జీడీపీకి పోటీగా మార్కెట్ మూల ధనీకరణను కలిగి ఉన్నాయి. ఏఐ ఆధారిత ఆటోమేషన్ శ్రమ కంటే మూల ధనానికి అనుకూలంగా ఉంటుంది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల పోటీతత్వాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా ఆదాయ అసమానతలను పెంచుతుందని ఆ నివేదిక హెచ్చరించింది.

## ఏడుగురి ఉసురు తీసిన వైద్యుడు.. విచారణకు రంగం సిద్ధం



**భోపాల్-నవభూమి:** దేశంలో నకిలీ వైద్యులుగా చెలామణి అవుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అలాంటి వారి చేతిలో ప్రాణాలు పోగొట్టుకొంటున్న వారి సంఖ్య కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. ఇటీవల ఓ వ్యక్తి వైద్యుడిగా అవతారం ఎత్తాడు. ఆ క్రమంలో ఆ నకిలీ వైద్యుడు ఏడుగురి ఉసురు తీశాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో దామోహ్ జిల్లాలో చోటు చేసుకుంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. దామోహ్ నగరంలో మిషనరీ ఆసుపత్రిలో నకిలీ కార్డియాలజిస్ట్ రోగులకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టనుంది. అందుకోసం ఏప్రిల్ 7 నుంచి 9వ తేదీ మధ్య దామోస్ నగరంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుల బృందం పర్యటించనుంది. ఈ బృందానికి ఆ కమిషన్‌లోని సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వం వహించనున్నారు.

దామోస్‌లోని మిషనరీస్ ఆసుపత్రిలో గుండె సమస్యలతో పలువురు రోగులు చేరారు. వారికి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్ జాన్ కామ్ శస్త్ర చికిత్స నిర్వహించారు. అయితే వారు మరణించారు. ఈ నేపథ్యంలో జబల్పూర్‌కు చెందిన దీపక్ తివారీ.. ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్ ఎన్ జాన్ కామ్ అనే వైద్యుడు శస్త్ర చికిత్స నిర్వహించడం వల్ల ఏడుగురు మరణించారని ఫిర్యాదు చేశారు.అయితే సదరు వైద్యుడు.. తనకు అన్ని విదేశీ అర్హతలు ఉన్నాయని చెబుతున్నారంటూ ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ జరపనుంది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పష్టం చేసింది. మరోవైపు ఏప్రిల్ 7 నుంచి 9 వ తేదీ వరకు తమ బృందం దామోహ్‌లోనే ఉంటుందని.. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయాలనుకేవారు.. చేయ వచ్చని ప్రజలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ తన ఎక్స్ ఖాతా వేదికగా సూచించింది.

ఇంకోవైపు ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనిపై నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుధీర్ కొచ్చర్ స్పష్టం చేశారు. అదీకాక డాక్టర్ ఎన్ జాన్ కామ్ అనే పేరుతో చెలమణి అవుతున్న వ్యక్తి అసలు పేరు విక్రమాదిత్య యాదవ్ అని ఓ చర్చ సైతం స్థానికంగా కొనసాగుతోంది.

## చిన్న పిల్లలని కూడా చూడకుండా చెట్టుకు కట్టేసి..



**దావణగెరె-నవభూమి:**ఈ మధ్య కాలంలో ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని.. నేరాలకు పాల్పడ్డ వారిని శిక్షించటం బాగా పెరిగిపోయింది. తప్పు చేసిన వారిని పోలీసులకు అప్పగించకుండా.. శిక్షల పేరుతో దారుణంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా, దొంగతనంతో పాటు అసభ్యంగా ప్రవర్తించారన్న నెపంతో ఇద్దరు చిన్న పిల్లలను దారుణంగా శిక్షించారు. చెట్టుకు కట్టేసి కొట్టడమే కాకుండా.. వారి చడ్డీలలో ఎర్ర చీమల్ని వదిలారు. ఈ సంఘటన కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దావణగెరె జిల్లా, చన్నగిరి తాలూకా, ఆస్తపణహళ్లికి చెందిన ఓ బాలుడు 3 నెలల క్రితం దొంగతనానికి పాల్పడ్డాడు.

దర్శన్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం చేసి పారిపోయాడు. ఈ దొంగతనం చేయటంలో మరో బాలుడు సాయం చేశాడు. సాయంత్రానికి దొంగతనం చేసిన బాలుడు దొరికేశాడు. ఆ తర్వాత సాయం చేసిన బాలుడు కూడా దొరికాడు. నిందితులు ఇద్దర్నీ కూడా అక్కడి అడవుల్లోకి తీసుకెళ్లారు. చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టారు. వారి చడ్డీలలోకి ఎర్ర చీమల్ని వదిలి హింసించారు. దాన్నంతా వీడియో తీశారు. బాగా చిత్ర హింసలు పెట్టిన తర్వాత వదిలేశారు. 3 నెలల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. దెబ్బలు తిన్న ఓ బాలుడి తాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సుభాష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. లక్కీ, దర్శన్, పరసు, శివదర్శన్, హరీష్, పట్టి రాజు, భూని, సుధాన్‌ల కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. బాధితుడితో పాటు నిందితులు కూడా హక్కిపిక్కి జాతికి చెందిన వారే. వారంతా అడవిలోని మూలికలు అమ్మి జీవిస్తుంటారు. ఈ మధ్య కాలంలో హక్కిపిక్కి జాతికి చెందిన వారు తయారు చేసే ఆయుర్వేద హెయిర్ ఆయిల్ దేశ వ్యాప్తంగా ఫేమస్ అయింది. నిజం చెప్పాలంటే ఈ జాతికి ఆ హెయిర్ ఆయిల్ కారణంగా మంచి గుర్తింపు వచ్చింది. సాధారణంగా హక్కిపిక్కి జాతి వారు తమలో తాము ఎంతో సామరస్యంగా ఉంటారు. అత్యంత అరుదుగా ఇలాంటి ఘటనలు జరుగుతూ ఉంటాయి.

## ముస్కాన్ పేరు చెబితే చాలు.. ఆమె వెన్నులో వణుకు..



**ఉత్తర ప్రదేశ్-నవభూమి:**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మర్చంట్ నేవీ ఆఫీసర్ సౌరభ్ విషాదాంతం గురించి తెలిసే ఉంటుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ప్రియుడితో కలిసి సౌరభ్‌ను దారుణంగా చంపేసింది. 15 ముక్కలుగా కోసి, డ్రమ్‌లో పడేసి సిమెంట్‌తో కప్పేసింది. సౌరభ్‌ను చంపిన అతడి భార్య ముస్కాన్.. ఆమె ప్రియుడు ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఇక, ముస్కాన్ చాలా మంది భార్యలకు ఓ స్ఫూర్తిగా నిలిచింది. చాలా మంది ఆడవాళ్లు తమ భర్తలను ముస్కాన్ స్టైల్లో చంపేస్తామంటూ వార్నింగులు కూడా ఇచ్చారు. బ్లూ డ్రమ్ అంటే మగాళ్లకు ఒకరకమైన భయం ఏర్పడింది. కేవలం మగాళ్లకు మాత్రమే కాదు..కొంతమంది ఆడవాళ్లకు కూడా బ్లూ డ్రమ్ భయం పట్టుకుంది. ఓ భర్త తన భార్యను ముస్కాన్ స్టైల్లో చంపి.. డ్రమ్ములో పడేస్తానని భయపెట్టాడు. భార్యను ఎలా చంపాలనుకుంటున్నాడో.. ప్లాన్ మొత్తం ఆమెకే వివరించి చెప్పాడు. తరచుగా భార్యకు ముస్కాన్ వీడియోలు పంపి వార్నింగ్ ఇచ్చేవాడు. దీంతో ఆ భార్య వెన్నులో వణుకు మొదలైంది. భయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సౌమయా సలీమ్ అనే యువతికి 2023లో ఫైజల్ అనే వ్యక్తితో పెళ్లయింది. పెళ్లయిన నాటి నుంచే భర్త ఆమెను వేధించటం మొదలెట్టాడు. ప్రతీరోజు ఆమెపై దాడి చేసేవాడు.

# ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు సూపర్ మార్కెట్లకు అమెరికన్ల పరుగులు.. ఏమేం కొంటున్నారంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించారు. ఈనెల 2వ తేదీన ఏ ఏ దేశం నుంచి వచ్చే వస్తువులపై ఎంత సుంకాలు విధించనున్నారో విడుదల చేశారు. అయితే ఈ పెంచిన సుంకాలు త్వరలోనే అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలోనే ధరలు పెరిగే లోపే అవసరమైన వస్తువులు కొనుగోలు చేయాలని అమెరికన్లు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలోనే స్టోర్లు, సూపర్ మార్కెట్ల వద్ద భారీగా క్యూ లైన్లు ఏర్పడుతున్నాయి. ధరలు తక్కువగా ఉన్నప్పుడే పలు వస్తువులను కొనుగోలు చేయాలని అమెరికన్లు భావించడంతో సూపర్ మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.అయితే అమెరికన్లు కొనే వస్తువుల్లో బట్టలు, బూట్లు, ఫర్నీచర్, కాఫీ వంటి ముఖ్యమైన వస్తువులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ది బిజినెస్ స్టాండర్డ్ వెల్లడించింది. తర్వాత కొనుగోలు చేద్దాం అని వాయిదా వేసుకున్న వస్తువులను కూడా ట్రంప్ టారిఫ్ భయాల వల్ల ఇప్పటికిప్పుడే కొనుగోలు చేస్తున్నారు. అధిక ధరలు చెల్లించకుండా ఉండేందుకు అమెరికన్లు ఇప్పుడే కొంటున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా వెలుపల అసెంబుల్ అయిన ఆటోమొబైల్స్ కొనాలనుకునే వారు ఇప్పుడే కొనుగోలు చేస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**అమెరికన్లు కొంటున్న వస్తువులు ఇవే!**

**ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు**

అమెరికాకు తైవాన్, చైనా నుంచి ఈ ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు దిగుమతి అవుతాయి. అయితే తైవాన్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 32 శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపిన ట్రంప్.. చైనా నుంచి వచ్చే అయ్యే వాటిపై 52 శాతం సుంకాలు విధిస్తామని పేర్కొన్నారు. దీంతో అమెరికన్లు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్ల విడిభాగాలు ఎక్కువగా విదేశాలు, మరీ ముఖ్యంగా చైనా నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్నాయి.

దుస్తులు, బూట్లుఅమెరికన్లు ధరించే అనేక బ్రాండెడ్ బట్టలు విదేశాల నుంచి వస్తాయి. మరీ ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, వియత్నాం లాంటి దేశాల నుంచి అమెరికాకు దుస్తులు దిగుమతి అవుతాయి. దీంతో ఈ దేశాలన్నింటిపై ట్రంప్ సుంకాలు ప్రకటించడంతో.. అవి అమలులోకి రాకముందే ఎక్కువ దుస్తులు కొనుగోలు చేయాలని అమెరికన్లు నిర్ణయించుకుంటున్నట్లు తెలుస్తోంది. అమెరికన్లు జీన్స్, స్పోర్ట్స్ వేర్, వర్క్ వేర్‌లతో పాటు షూలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

**ఆటోమొబైల్స్**

కొత్త కార్లు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలని అనుకునే అమెరికన్లు ఇప్పటికిప్పుడు కొనుగోలు చేస్తున్నారు. అమెరికాకు దిగుమతి అయిన కార్లను కొనుగోలు చేయడానికి షోరూంలకు పరుగులు పెడుతున్నారు. సుంకాలు పెరిగిన తర్వాత ధరలు పెరుగుతాయని భావించి.. ఇప్పుడు కార్లు బుక్ చేయాలని భావిస్తున్నారు.

విదేశీ ఆహారాలు

విదేశాల నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు అక్కడి ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. కాఫీ, స్నాక్స్, మసాలా దినుసులు, ఇతర కిరాణా వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. సుంకాలు అమలులోకి వచ్చిన తర్వాత వీటి ధరలు పెరుగుతాయనే భయంతో ఇప్పుడే కొని నిల్వ చేసుకుంటున్నారు.


**జిమ్ అండ్ వెల్‌నెస్ పరికరాలు**

ట్రెడ్ మిల్స్, స్టేషనరీ బైక్‌లు, మసాజ్ ఛైర్స్, జిమ్ పరికరాలు వివిధ దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతూ ఉంటాయి. ఇలాంటి జిమ్ సంబంధిత వస్తువులు కావాల్సిన వారు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని అనుకుంటున్నారు.

**ఎలక్ట్రిక్ పరికరాలు**

రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్‌లు, డిష్‌వాషర్లు వంటి హోమ్ నీడ్స్‌ను కొనుగోలు చేయాలని అమెరికన్లు భావిస్తున్నారు. దీంతో ఆయా స్టోర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. చైనా, తైవాన్ నుంచి ఎక్కువగా ఎలక్ట్రిక్ వస్తువులు అమెరికాకు వస్తుండటంతో ధరలు పెరగకముందే కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. వీటితోపాటు భవన నిర్మాణ సామాగ్రి, పిల్లలకు సంబంధించిన ఉత్పత్తులైన డైపర్లు, బొమ్మలు, బట్టలు కొనుగోలు చేస్తున్నారు.


# నిశ్చితార్థమైన వారం రోజుల్లోనే ఐఏఎఫ్ పైలట్ మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత సైన్యంలో పనిచేసే ప్రతీ జవాన్.. దేశం, దేశ ప్రజలను కాపాడేందుకు తమ ప్రాణాలు విడిచేందుకు కూడా సిద్ధం అయి ఉంటారు. తమ ప్రాణాలను అడ్డు పెట్టి అయినా సరే.. ఒక్క ప్రాణాన్ని అయినా కాపాడాలని సైనికులు అహర్నిషలు కృషి చేస్తూ ఉంటారు. అయితే ఆ సైనికుల కుటుంబాలు మాత్రం ఒకవైపు దేశం కోసం ప్రాణాలు విడిచారనే గర్వం.. మరోవైపు.. తమ బిడ్డ ఇక లేడనే వార్తను దిగమింగుకోలేక కన్నీటి సంద్రంలో మునిగిపోతారు. ఇక సైనికుల భార్య, పిల్లలు జీవితాంతం వారు చూపించిన ధైర్యసాహ సాలను గుర్తు చేసుకుని బతుకుతూ ఉంటారు. ఇటీవల గుజరాత్‌లో భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్ కూలిన సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన సిద్ధార్థ్ యాదవ్ అనే పైలట్ కథ తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. ఆయనకు వారం రోజుల క్రితమే ఎంగేజ్‌మెంట్ కాగా.. అంతలోనే ప్రాణాలు విడవడంతో.. ఆయనకు కాబోయే భార్య గుండెలు అవిసేలా ఏడ్చారు.ఇక ఆయన పార్థీవ దేహాన్ని ఉంచిన పేటికపై సిద్ధార్థ్ యాదవ్‌కు కాబోయే భార్య సానియా గుండెలు పగిలేలా ఏడ్చింది. తన భర్త ముఖాన్ని చూపించాలని కోరింది. తాను ఆయన ముఖాన్ని ఇంకోసారి చూడాలని అనుకుంటున్నానని అక్కడ ఉన్న ఎయిర్ ఫోర్స్ అధికారులను వేడుకుంటున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా కంటతడి పెడుతున్నారు. “బేబీ నువ్వు నన్ను తీసుకెళ్లడానికి రాలేదు, నువ్వు నాకు మాట ఇచ్చావు” అంటూ సానియా ఏడవడం చూసి అక్కడ ఉన్నవారంతా కన్నీరు పెట్టారు.

గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి ఐఏఎఫ్ జాగ్వార్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఒక పైలట్ ప్రాణాలు కోల్పోగా.. మరో పైలట్ గాయాలతో బయటపడ్డారు. 2016లో నేషనల్ డిఫెన్స్ అకాడెమీ పరీక్ష-ఎన్‌డీఏలో ఉత్తీర్ణత సాధించి భారత వైమానిక దళంలో చేరిన సిద్ధార్థ్ యాదవ్(28) అనే పైలట్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు మార్చి 23వ తేదీన నిశ్చితార్థం జరగ్గా.. ఇటీవల జరిగిన ప్రమాదంలో ప్రాణాలు విడిచారు. ట్రైనింగ్‌లో ఉండగా.. ఐఏఎఫ్ జాగ్వార్ ఫైటర్ జెట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. జామ్‌నగర్ జిల్లాలోని సువార్ద గ్రామానికి చేరుకునే సమయానికి ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన పైలట్ సిద్ధార్థ్ యాదవ్.. ఆ ఫైటర్ జెట్ ఇళ్ల మధ్య కూలిపోతే.. భారీగా ప్రాణ నష్టం జరుగుతుందని భావించి.. తనతో పాటు ఉన్న కో-పైలట్‌ను కిందకు దించేసి.. జనసాంద్రత లేని ప్రాంతం వైపు జెట్‌ను నడిపించారు.అయితే ఆ ఫైటర్ జెట్‌ను సురక్షితంగా ల్యాండ్ చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఆ ఫైటర్ జెట్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటనపై సిద్ధార్థ్ యాదవ్ అక్కడికక్కడే అమరడయ్యాడు. బుధవారం రాత్రి జామ్‌నగర్ సమీపంలోని వైమానిక దళం స్టేషన్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఆ ఫైటర్ జెట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. కొన్ని నిమిషాల్లోనే కూలిపోవడంతో హర్యానాలోని రేవారీ జిల్లాకు చెందిన ఫ్లైట్ లెఫ్టినెంట్ సిద్ధార్థ్ యాదవ్ ప్రాణాలు కోల్పోయారు. సుశీల్-నీలం యాదవ్‌లకు ఒక్కగానొక్క కుమారుడైన సిద్ధార్థ్ యాదవ్ అమరుడు కావడంతో ఆ తల్లిదండ్రులు తట్టుకోలేక పోతున్నారు. ఫైటర్ పైలట్‌గా ట్రైనింగ్ పూర్తి చేసి 2016లో ఎన్డీఏ పరీక్షలో పాస్ అయిన తర్వాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరిన సిద్ధార్థ్ యాదవ్.. రెండేళ్ల క్రితమే ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా ప్రమోషన్ పొందారు. రేవారిలోని భల్కి-మజ్రా గ్రామానికి చెందిన సిద్ధార్థ కుటుంబం.. నవంబర్ 2వ తేదీన జరగాల్సిన పెళ్లి కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవలే ఎంగేజ్‌మెంట్ కోసం ఇంటికి వచ్చిన సిద్ధార్థ.. సెలవులు పూర్తి కావడంతో తిరిగి విధుల్లో చేరాడు. కానీ ఇంతలోనే విషాదం చోటుచేసుకోవడంతో ఆయన కుటుంబం, బంధువులంతా కన్నీరు మున్నీరుగా విలపించారు.

# నెలకు రూ.8.30 లక్షల జీతం వచ్చినా సరిపోవట్లేదు..



**న్యూఢిల్లీ-నవభూమి:**సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు అంటే రూ.లక్షల్లో జీతాలు ఉంటాయి. నెలకు ఆరంకెల జీతం అందుకునేవారు చాలా మంది ఉంటారు. ఇక ఇతర చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు నెలకు రూ.10 వేలు, రూ.15వేలు కూడా సంపాదిస్తున్నారు. వచ్చిన జీతంలో ఖర్చులను అదుపు చేసుకునేవారు హాయిగా సంసారం అనే బండిని నెట్టుకొస్తూ ఉంటారు. ఇక లేని పోని జల్సాలు, ఖర్చులు చేసే వారికి నెలకు ఎంత జీతం వచ్చినా అది ఎక్కడికీ సరిపోదు. పైగా అప్పులు కూడా చేసి.. ఆగం అవుతూ ఉంటారు. ఇప్పుడు చెప్పబోయే టెకీ సంగతి కూడా అలాంటిదే. నెలకు రూ.8 లక్షలకుపైగా జీతం వచ్చినా.. తనకు ఇంకా అప్పులే అవుతున్నాయని చెబుతున్నాడు. తన జీతం కంటే నెల వారీ ఖర్చులు అధికంగా ఉన్నాయని చెప్పడంతో నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు.ఆస్ ఓరా జైన్ అనే యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉంటున్నాడు. అయితే తనకు వస్తున్న జీతంతో బెంగళూరు నగరంలో నివసించటం అసాధ్యంగా మారిందని పేర్కొన్నాడు. అతడికి తక్కువ జీతమేమీ కాదు. తనకు ఏడాదికి రూ.1.80 కోట్ల జీతం వస్తుందని.. ఆస్ ఓరా జైన్ తెలిపాడు. ప్రస్తుతం ఒక మంచి కంపెనీలో ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హోదాలో పనిచేస్తున్నట్లు వెల్లడించాడు. ట్యాక్స్‌లు, ఇతర కటింగ్‌లు అన్నీ పోనూ నెలకు రూ.8.30 లక్షల జీతం తన అకౌంట్‌లోకి వస్తుందని తన లింక్డ్ ఇన్ అకౌంట్‌లో వెల్లడించాడు. తనకు నెలకు రూ.8.30 లక్షల జీతం వస్తుండగా.. ఖర్చులు మాత్రం రూ.8.87లక్షలు అవుతున్నాయని.. దీంతో నెలకు రూ.50 వేలు అప్పు అవుతోందని వివరించాడు. ఈ క్రమంలోనే తనకు వచ్చిన జీతాన్ని నెలలో దేనికి ఎంత చొప్పున ఖర్చు చేస్తున్నాడో మొత్తం వివరిస్తూ పోస్ట్ పెట్టాడు.

**ఆస్ ఓరా జైన్ నెల ఖర్చులు**


బెంగళూరు నగరంలోని ఇందిరా నగర్‌లో ఇంటి అద్దె రూ.1.50 లక్షలు
బీఎండబ్ల్యూ, బెంజ్ కార్లకు నెలకు ఈఎంఐలు రూ.80 వేలు
ల్యాండ్రీ, ఇతర ఖర్చులు రూ.15 వేలు
జొమాటో, స్విగ్గీ ఆర్డర్లు రూ.70 వేలు
5 స్టార్ హోటళ్లలో ఫుడ్, కాక్ టైల్స్ కోసం రూ.1.20 లక్షలు
గోవా, దుబాయ్ వీక్లీ ట్రిప్స్ ఖర్చు రూ.1 లక్ష
బ్రాండెడ్ వైట్ టీషర్ట్స్ రూ.10 వేలు
ఆర్గానిక్ వైన్స్ రూ.50 వేలు
జిమ్ ట్రైనింగ్ ఖర్చులు రూ.12 వేలు
స్టాక్ మార్కెట్లు, క్రిప్టో పెట్టుబడులు రూ. 1 లక్ష

తనకు నెలకు రూ.8.30 లక్షల జీతం వస్తుండగా.. ఖర్చులు మాత్రం రూ.8.87 లక్షలు ఖర్చు అవుతోందని.. తన జీతం బతకడాటానికే సరిపోతోందని.. బెంగళూరు నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులపై ఆస్ ఓరా జైన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే ఈ పోస్ట్‌పై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మరికొందరు సెటైర్లు వేస్తున్నారు. బెంగళూరు నగరంలో నెలకు కేవలం రూ.30 వేలు జీతం వచ్చే వారు కూడా బతుకుతున్నారని పేర్కొన్నారు. నిన్ను ఎక్కువ ఖర్చు చేయమని ఎవరూ అడగడం లేదు కదా అంటూ కామెంట్లు పెడుతున్నారు.చాలా మంది వారికి నెలకు వచ్చే జీతంలో ఆనందంగా జీవిస్తారని.. అందరూ లగ్జరీ జీవితాన్ని కోరుకోరని చెబుతున్నారు. ఏడాదికి దాదాపు రూ.2 కోట్ల జీతం వచ్చినా చాలడం లేదని పోస్టు పెట్టడంపై చాలా మంది హేళన చేస్తున్నారు. మరీ ఇంత ఓవర్ యాక్షన్ పనికిరాదంటూ మరికొందరు నెటిజన్లు మండిపడుతున్నారు. బయటి ఫుడ్ తగ్గిస్తే చాలని కొందరు హితవు పలుకుతుండగా.. మరికొందరేమో ప్రతీ నెల బ్రాండెడ్ బట్టలు కొనడం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. ఇక ప్రతీ వారం ట్రిప్‌కు కచ్చితంగా వెళ్లాల్సిన అవసరం ఏంటని నిలదీస్తున్నారు. ఖర్చుల్లో అన్నీ అనవసరం అయివే ఉన్నాయని.. వాటిని తగ్గించుకుంటే చాలని సూచిస్తున్నారు.

## కాబోయే భర్తతో కలిసి అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు వెళ్లిన మహిళ.. రోలర్ కోస్టర్ ప్రమాదంలో మృతి

**న్యూఢిల్లీ-నవభూమి:**త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్న మహిళ, కాబోయే భర్తతో కలిసి అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు వెళ్లింది. వారిద్దరూ కలిసి రోలర్ కోస్టర్ ఎక్కారు. అక్కడ జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ మహిళ మరణించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. చాణక్యపురిలో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్న 24 ఏళ్ల ప్రియాంక ఒక ప్రైవేట్ టెలికాం కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నది. 2023 జనవరిలో నజఫ్‌గఢ్‌కు చెందిన నిఖిల్‌తో ఆమెకు నిశ్చితార్థం జరిగింది. అయితే ఆర్థికంగా స్థిరపడేందుకు ఈ జంట పెళ్లిని వాయిదా వేశారు. 2026 ఫిబ్రవరిలో వివాహం చేసుకోవాలని నిర్ణయించారు.కాగా, ఏప్రిల్ 3న ప్రియాంక తన కాబోయే భర్త నిఖిల్‌తో కలిసి ఢిల్లీ శివారులోని ఫన్ ఎన్ ఫుడ్ వాటర్ పార్క్‌కు వెళ్లింది. వీరిద్దరూ కలిసి రోలర్ కోస్టర్ ఎక్కారు. అయితే అది ఎత్తులో ఉండగా ప్రియాంక కూర్చొన్న చోట పట్టుకునే రాడ్ విరిగిపోయింది. దీంతో రోలర్ కోస్టర్ పైనుంచి ఆమె కిందపడింది. తీవ్రంగా గాయపడిన ప్రియాంకను నిఖిల్ వెంటనే హాస్పిటల్‌కు తరలించాడు. అయితే చికిత్స పొందుతూ ఆమె మరణించింది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ హాస్పిటల్‌కు చేరుకున్నారు. ప్రియాంక మృతదేహాన్ని పరిశీలించారు. మెడికల్ రిపోర్ట్‌లను సేకరించారు. పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాన్ని ఆమె కుటుంబానికి అప్పగించారు. అమ్యూజ్‌మెంట్ పార్క్ యాజమాన్యం నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోజుకు 258 కంపెనీలు మూత




**న్యూఢిల్లీ-నవభూమి:** చెప్పే మాటలకూ చేసే చేతలకూ సంబంధం లేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే పలుమా ర్లు నిరూపించుకొన్నది. ఉద్యోగాలిస్తామ న్న హామీలకు భిన్నంగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే చర్యలు చేపట్టింది. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికొదిలేసి.. ఉన్న కంపెనీలకు తాళాలు పడే పరిస్థితిని తీసుకువచ్చింది. కొత్త పరిశ్రమల ఏర్పాటు లేదు. ప్రభుత్వరంగ సంస్థల్ని (పీఎస్‌యూ) అగ్గువ సగ్గువకు అమ్మకానికి పెట్టింది. ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటనలకే పరిమితం చేసింది. మోదీ పదకొండేండ్లపాలనలో దేశంలో పారిశ్రామికరంగం అతలాకుతలమైంది. ‘మేకిన్ ఇండియా’ నినాదం, కంపెనీలు, పీఎస్‌యూలు, ఉద్యోగాలకు సంబంధించి అడిగిన పలు ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ ‘గ్రోక్’ సంచలనమైన వివరాలను వెల్లడించింది. బీజేపీ ప్రభుత్వ డొల్ల విధానాలను గణాంకాలతో సహా బయటపెట్టింది.

నెరవేరని ‘మేకిన్ ఇండియా’ లక్ష్యం

అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో మోదీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ‘మేకిన్ ఇండియా’ నినాదం కాస్తా ‘జోకిన్ ఇండియా’గా మారింది. ఎప్పటి నుంచో దేశానికే వన్నె తెచ్చిన పరిశ్రమలెన్నో నేడు అవసానదశకు చేరుకున్నాయి. ‘మేకిన్ ఇండియా’ స్కీమ్ లక్ష్యాలను చేరుకొన్నదా? అనే ప్రశ్న ను అడగ్గా.. లేదంటూ గణాంకాలతో సహా ‘గ్రోక్’ వివరించింది. 2022నాటికి జీడీపీలో తయారీరంగం వాటాను 25శాతానికి పెం చాలని మేకిన్ ఇండియాలో లక్ష్యంగా పెట్టుకోగా, 15.9 శాతానికే పరిమితమైనట్టు వివరించింది. 2022నాటికి తయారీ రంగంలో 10 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామంటూ ‘మేకిన్ ఇండియా’ లక్ష్యంగా నిర్ణయించగా.. ఆరేండ్లలో తయారీ రంగంలో 1.57 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు ‘గ్రోక్’ కుండబద్దలు కొట్టింది. సీఎంఐఈ, పీఎల్‌ఎఫ్ఎస్ డాటా ప్రకారం.. బీజేపీహయాంలో 5 కోట్ల మంది ఉద్యోగాలు పోగొట్టుకొన్నట్టు వివరించింది. ఎఫ్‌డీఐ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయాల్లోనూ ‘మేకిన్ ఇండియా’ లక్ష్యాలను బీజేపీ ప్రభుత్వం చేరుకోలేదన్న గ్రోక్.. ఒక విధంగా ఇదో వైఫల్య స్కీమ్‌గా అభివర్ణించింది.

**బజారున పడ్డ కార్మికులు**

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోని మోదీ.. కనీసం ప్రైవేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు మూత పడకుండా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేంద్రంలో 2014 నుంచి 2024 మార్చి 31 నాటికి 9,31,644 రిజిస్టర్డ్ కంపెనీలు మూతపడినట్టు ‘గ్రోక్’ వెల్లడించింది. ఫలితంగా కోట్లాదిమంది కార్మికులు, ఉద్యోగులు బజారునపడ్డారని ఆందోళన వ్యక్తం చేసింది. డాటాఫుల్ నివేదికను అనుసరించి గ్రోక్ చెప్పిన వివరాల ప్రకారం.. మూతపడిన రిజిస్టర్డ్ కంపెనీలలో అత్యధికం సేవలరంగానివే. సర్వీస్ సెక్టార్‌లో 28%, తయారీ రంగంలో 24%, ట్రేడింగ్‌లో 11%, నిర్మాణరంగంలో 10 కంపెనీలు మూతపడ్డాయి. ఇతర రంగాల్లో మరో 27% వరకు ఉన్నాయి. ఇక, కరోనా కాలంలో లాక్‌డౌన్ కారణంగా కంపెనీలు మూతపడటంతో తీవ్రంగా నష్టపోయిన కంపెనీల ఉద్దీపనకు రూ.16 లక్షల కోట్ల ఆర్థిక సాయం అందించడానికి నిధి ఏర్పాటు చేస్తామని మోదీ ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

**ప్రభుత్వరంగంపై చావుదెబ్బ**

‘ప్రభుత్వరంగ సంస్థలను నడపించాల్సిన అవసరం, అవశ్యకత ఎంత మాత్రమూ లేదు. అది అసంభవం కూడా’ పీఎస్‌యూల అంశంపై 2021 జూన్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన వెబ్‌నార్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలివి. తన వ్యాఖ్యలకు అనుగుణంగానే ప్రభుత్వ రంగ సంస్థలను (పీఎస్‌యూ)తెగనమ్మడం, సంస్థల్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడంలో మోదీ ప్రభుత్వం కొత్త రికార్డులను సృష్టించింది. 2014 నుంచి 2024 మధ్యలో మొత్తం 179 పీఎస్‌యూలను విక్రయించడం లేదా పెట్టుబడులను ఉపసంహరించడం ద్వారా కేంద్రం రూ. 4.48 లక్షల కోట్లను ఆర్జించినట్టు ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ‘గ్రోక్’ సమాధానమిచ్చింది. 1991 నుంచి ఇప్పటివరకూ జరిగిన పీఎస్‌యూల విక్రయాల్లో 72 శాతం మోదీ హయాంలోనే జరిగినట్టు గ్రోక్ తేల్చి చెప్పింది. ఎయిరిండియా, బీపీసీఎల్, ఎస్బీఐ, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ తదితర పీఎస్‌యూలను మొత్తంగా లేదా కొంత మేర వాటాను బీజేపీ ప్రభు త్వం అమ్మకానికి పెట్టినట్టు వివరించింది.


## మూడోసారీ పోలీసుల విచారణకు హాజరు కాని కునాల్ కమ్రా

**ముంబయి-నవభూమి:** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాండ్అప్ కమేడియన్ కునాల్ కమ్రా మూడోసారి కూడా పోలీసుల విచారణకు హాజరు కాలేదు. శనివారం తమ ఎదుట హాజరు కావాలంటూ ముంబయి పోలీసులు ఇచ్చిన సమన్లను విస్మరించారు. ప్రస్తుతం ఆయన తమిళనాడులో ఉంటున్నారు. ఈ నెల ఏడో తేదీ వరకు ఆయనను అరెస్టు చేయకూడదని ఆదేశిస్తూ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. తొలుత పోలీసులు ముంబయిలోని ఆయన నివాసానికి వెళ్లి సమన్లు అందజేయడానికి ప్రయత్నించారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో వాట్సప్ ద్వారా పంపించారు.

## రాజకీయ నాయకులుగా ఎదిగేందుకు ఫెలోషిప్



**న్యూఢిల్లీ-నవభూమి:**కొత్త తరం రాజకీయనాయకులను తయారుచేసే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరుతో ఒక ఫెలోషిప్ ప్రొగ్రాం ప్రారంభించింది. వివిధ వృత్తిపరమైన నేపథ్యాల నుంచి వచ్చిన 50 మంది నిపుణులను ప్రతిభావంతులైన ప్యానెల్ ఓ ప్రత్యేకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. వారికి రాహుల్ గాంధీ, శశిథరూర్, అజయ్ మాకెన్ వంటి ప్రముఖులు మెంటార్స్‌గా వ్యవహరిస్తారని ఏఐసీసీ తెలిపింది. ఆధునిక, ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని పేర్కొంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఏఐసీసీ నేతలు ప్రవీణ్ చక్రవర్తి, కొప్పుల రాజు ఈ ఫెలోషిప్ వివరాలను వెల్లడించారు. ఫెలోషిప్ దరఖాస్తుకు విద్యార్హతలేమీ అవసరం లేదని, కానీ అభ్యర్థులకు ఏదో ఒక వృత్తిలో 10 ఏళ్ల అనుభవం ఉండాలని ఆయన పేర్కొన్నారు.



## జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం తిరకాసు

త్రిభాషా సూత్రం ఇప్పుడు మళ్లీ ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పి.ఎమ్.శ్రీ ఒప్పందంపై సంతకం పెట్టకపోవడం, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించడం, అసలు 'జాతీయ విద్యావిధానం%-%2020'ని తిరస్కరించడంతో కేంద్రం తమిళనాడుకు ఇవ్వవలసిన విద్యారంగ నిధులు రెండువేల కోట్ల రూపాయిలు నిలిపివేసింది. దీంతో ఇది పెద్ద చర్చగా మారింది. కేంద్రం ఒక విద్యా విధానాన్ని రూపొందించి, దానిని రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు జరపాలని నిర్బంధించడం, అమలు చేయకపోతే నిధులు ఆపివేస్తామనడం అన్యాయమైన విషయం. ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదు. రాజ్యాంగకర్తలు విద్యను రాష్ట్ర జాబితాలో పెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ఉమ్మడి జాబితాలోకి మార్చింది. తిరిగి విద్యను రాష్ట్ర జాబితాకు మార్చాలనే డిమాండు ముందుకు వస్తున్న తరుణంలో కేంద్ర విద్యావిధానాన్ని ప్రతి రాష్ట్రం విధిగా అమలు జరపాలని నిర్బంధం చేయడం ప్రస్తుత చర్చకు కారణం అయింది.

%కేంద్ర ప్రభుత్వం జూలై 29, 2020న 'జాతీయ విద్యా విధానం%-%2020' (ఎన్.ఇ.పి%-%2020) పేరున ఒక విధాన పత్రాన్ని ప్రకటించింది. దీనిని ఏ దశలో కూడా పార్లమెంటులో చర్చకు పెట్టలేదు. అటువంటప్పుడు వివిధ రాష్ట్రాల చట్టసభల్లో చర్చకు పెట్టడం అనే సమస్యే తలెత్తదు. దీనిని జాతీయ విద్యా విధానం అనడం కంటే కేంద్ర ప్రభుత్వ విద్యా విధానం అనడం సబబుగా ఉంటుంది. ఈ విద్యా విధానంలో చాలా సమస్యలున్నాయి. ఎ) ఇది విద్యా వ్యాపారాన్ని రద్దు చేయలేదు సరికదా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధులు నిరాకరిస్తూ, ప్రతి విశ్వవిద్యాలయం తనకు అవసరమైన నిధులను తానే సమకూర్చుకోవాలని చెప్తుంది. ఇది ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫీజుల పెంపుదలకు, పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య నిరాకరణకు కారణమవుతున్నది. ఈ మధ్య విడుదల అయిన యు.జి.సి ముసాయిదా విధానంలో విశ్వవిద్యాలయాల్లో పదోన్నతులు కోరే అభ్యర్థులు విశ్వవిద్యాలయాలకు నిధులు సమకూర్చే ప్రాజెక్టులను చేపట్టాలని, పదోన్నతి కల్పించడంలో వివిధ రూపాల్లో వారు సమకూర్చగల నిధులు ఒక ప్రధాన అంశంగా ఉంటాయని ప్రతిపాదించిన విషయం విదితమే. బి) ఈ విధానం విద్యారంగ విషయాలపై అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కేంద్రీకరిస్తుంది. పాఠశాల పాఠ్యపుస్తకాలను సొంతంగా రాసుకునే హక్కు కూడా రాష్ట్రాలకు లేదు. వాటిని కేంద్రమే రూపొందిస్తుంది, రాష్ట్రాలు ఉపయోగించుకోవాలి. ఈ కేంద్ర విద్యా విధానం ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, చివరికి పరిశోధనలు (నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా) కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. ముందుగా సూచించిన యు.జి.సి సర్క్యులర్ 'రాష్ట్రాలు స్థాపించి నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకంలో' రాష్ట్ర ప్రభుత్వాలకు పాత్రలేని విధానాన్ని ప్రతిపాదించింది. అయితే ఈ విషయం కొత్తది కాదు. ఇది ఎన్.ఇ.పి%-%2020లో ఉంది. సి) ఈ విద్యావిధానం సామాజిక న్యాయానికి పాతర వేసింది. 66 పేజీల విధాన పత్రంలో 'సామాజిక న్యాయం' అన్న పదబంధంగాని, రిజర్వేషన్లు అనే పదంగాని కనిపించదు. మరల యు.జి.సి సర్క్యులర్‌లోనే రిజర్వేషన్లు నీరుగార్చడానికి సాక్ష్యాలు కనిపిస్తాయి. యు.జి.సి సర్క్యులర్‌లో ఎస్సీ, ఎస్టీ, నాన్ క్రీమీలేయర్ బీసీ, ఇ.బి.సి, అంగవైకల్యం ఉన్న వారికి నిర్దిష్ట శాతాల్లో రిజర్వేషన్ ఇస్తున్నట్లు పేర్కొనలేదు. 5శాతం మార్కులు వెసులుబాటు మాత్రం ప్రతిపాదించారు. డి) ఈ విద్యా విధానం 'భారత జ్ఞాన వ్యవస్థ' పేరుతో కాషాయీకరణకు, చరిత్ర వక్రీకరణకు, కాలం చెల్లిన భావాల వ్యాప్తికి, చివరికి భూత వైద్యానికి ప్రాతిపదికలు ఏర్పాటు చేసింది. ఇ) ఎన్.ఇ.పి%-%2020 పాలక పార్టీ వ్యక్తులు వారికి ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేకపోయినా ప్రొఫెసర్‌లు కావడానికి దారులు వేసింది. ఈ విషయానికి కూడా మనం జాతీయ విద్యావిధానం పత్రం చదవవలసిన అవసరం లేదు. యు.జి.సి సర్క్యులర్‌లోనే 'ఎటువంటి విద్యా సంబంధమైన అర్హతలు లేని వారికి' వారి 'ఇతర సమర్థతలను' దృష్టిలో ఉంచుకుని 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్'గా విశ్వవిద్యాలయాలు నియమించవచ్చని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాల్లో పాలక పార్టీ వ్యక్తుల (ప్రస్తుతం బి.జె.పిబీ ఆర్.ఎస్.ఎస్) చొరబాటుకు ఇది రాజమార్గం. మరి ఇది ఒక్క తమిళనాడు సమస్య ఎలా అవుతుంది. ఈ సమస్యలతో పాటు భాషా విధానం కూడా ప్రధానంగా ఉంది.భాషా విధానం దీర్ఘకాలంగా మన దేశంలో ఒక సమస్యగా ఉంది. 'వైవిధ్యంలో ఐక్యత' అనే భావం ఔన్నత్యం చూడలేకపోవడం, ఏకత్వం ద్వారానే ఐక్యత సాధ్యమవుతుందని అనుకోవడం వల్ల సమస్య వస్తున్నది. దేశ ప్రజలందరూ హిందీ నేర్చుకుంటే దేశ ప్రజల ఐక్యత, ప్రాదేశిక సమగ్రత సాధ్యం అవుతాయనే భావన ఆనాటి కాంగ్రెస్‌లో కూడా ఉన్నది. కమ్యూనిస్టులు ఈ భావనకు గురి కాలేదు కాని, కొన్ని రకాల సోషలిస్టులు కూడా ఈ భావజాలానికి నీరు పోశారు. అనేక చర్చల తరువాత 'భారత రాజ్యాంగ పరిషత్' హిందీని అఖిల భారత అధికార భాషగా గుర్తించి, 1965 వరకు ఆంగ్లం కూడా అధికార భాషగా కొనసాగించవచ్చని పేర్కొంది. సహజంగానే 1965లో ఈ సమస్య మళ్లీ ముందుకొచ్చింది. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం తీవ్రంగా పెరిగింది. ఇతర దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కూడా గొంతు కలిపారు. కేంద్రం వెనక్కి తగ్గింది. అధికార భాష అనే సమస్యతో పాటు మరి రెండు సమస్యలున్నాయి ఒకటి బోధనా మాధ్యమం, రెండవది భాషల బోధన. బోధనా మాధ్యమం విషయానికి వస్తే కొఠారీ కమీషన్, '1986 నాటి జాతీయ విద్యా విధానం' మాతృభాషా మాధ్యమాన్నే అత్యున్నత స్థాయి వరకు సిఫారసు చేశాయి. 2010 ఏప్రిల్ 1 నుంచి అమలులో ఉన్న 'బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం%-%2009' ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో 8వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్నే నిర్దేశిస్తున్నది. 'జాతీయ విద్యా విధానం 2020' మాత్రం 5వ తరగతి వరకు మాత్రమే మాతృభాషా మాధ్యమాన్ని సిఫారసు చేసి, 'వీలయితే 8వ తరగతి వరకు' అనే మాట చేర్చింది.కొఠారీ కమిషన్, ఇంకా 1986లో వచ్చిన జాతీయ విద్యావిధానం కూడా త్రిభాషా విధానాన్నే సిఫారసు చేశాయి. కొన్ని ప్రధానమైన, ఆపైన ప్రమాదకరమైన వెసులుబాట్లతో మోడీ 2.0 కాలంలో వచ్చిన 'జాతీయ విద్యావిధానం-2020' కూడా త్రిభాషా విధానాన్ని ప్రతిపాదించింది. ఈ త్రిభాషా విధానంలో మాతృభాష కాని ఆంగ్లం కాని తప్పనిసరి కాదు! తాము తమిళ్, ఆంగ్లం విద్యార్థులకందిస్తామని, మూడవ భాష (హిందీ, సంస్కృతం, ఇంకా దేనినీ) తప్పనిసరి చేయమని తమిళనాడు తెగేసి చెప్పింది. ఎన్.ఇ.పి-2020లో కనీసం రెండు దేశీయ భాషలు నేర్చుకోవాలని ఉంది గాని, అందులో ఒకటి వాడుకలో లేని సంస్కృతం కూడా కావచ్చు.

# మన ఊపిరిని మనమే కాపాడుకుందాం..





మన రోజువారీ జీవితంలో గాలి ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. ఆక్సిజన్‌తో కూడిన స్వచ్ఛమైన గాలి లేకుండా మన శరీర కార్యకలాపాలు కొనసాగడం అసాధ్యం. అయితే మనం పీల్చే గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. పారిశ్రామికీకరణ, వాహనాల పెరుగుదల, పంట వ్యర్థాల తగులబెట్టడం, ధూళి కణాలు, జీవనశైలిలో మార్పులు కలుషిత గాలికి కారణమవుతున్నాయి. గాలి కాలుష్యం అంటే మనం పీల్చే గాలిలో ప్రమాదకరమైన దుమ్ము, పొగ, రసాయనాలు కలిసిపోయి ఆరోగ్యానికి హానికరంగా మారడం. ఇవి మనుషుల పనులు లేదా ప్రకృతి వల్ల ఏర్పడవచ్చు. ఇవి ఊపిరితిత్తుల లోతుల్లోకి ప్రవేశించి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనారోగ్యాలను కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గాలిలో కనిపించే హానికర ద్రవ్య పదార్థాల్లో పిఎమ్2.5 (2.5 మైక్రోమీటర్ల కంటే చిన్న సూక్ష్మ కణాలు), పిఎమ్10 (10 మైక్రోమీటర్ల లోపు ఉండే కణాలు), ఎన్ ఓ 2 (నైట్రజన్ డై ఆక్సైడ్), ఎస్ ఓ 2 (సల్ఫర్ డై ఆక్సైడ్), సి ఓ (కార్బన్ మోనో ఆక్సైడ్), ఓ 3 (ఓజోన్) వంటివి ప్రధానంగా ఉంటాయి. వాహనాల నుంచి వచ్చే పొగ, బొగ్గుతో నడిచే విద్యుత్ కేంద్రాలు, కర్మాగారాలు, ఇళ్ల నిర్మాణాలు, పంటల వ్యర్థాలను తగులబెట్టడం వంటివి గాలి కాలుష్యానికి ప్రధాన కారణాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, ప్రపంచ జనాభాలో 90 శాతం మందికి పైగా ప్రజలు ప్రమాదకర స్థాయిలో గాలిని పీలుస్తున్నారు. చాలా నగరాల్లో పిఎమ్2.5 స్థాయి సగటుగా 40 మైక్రోగ్రాముల వరకు ఉంటోంది. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శక పరిమితి కేవలం 5 మైక్రోగ్రాములే. భారతదేశంలో సెంట్రల్ పాల్యూషన్ కంట్రోల్ బోర్డు విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఎక్యూఐ) తరచూ ప్రమాదకర స్థాయిని తాకుతోంది. 2024 జనవరిలో ఢిల్లీలో ఎక్యూఐ 410గా, హైదరాబాద్‌లో 240గా నమోదైంది.

ఐక్యూఎయిర్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ, ఫరీదాబాద్, గాజియాబాద్, నోయిడా, గురుగ్రాం, లక్నో, ముజఫ్ఫర్‌పూర్, పట్నా, భోపాల్, జోధ్‌పూర్, కోట నగరాలు ఉన్నాయి. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి పట్టణాల్లో ఎక్యూఐ తరచూ 150%-%250 మధ్యగా నమోదవుతోంది. తెలంగాణ స్టేట్ పాల్యూషన్ కంట్రోల్ బోర్డు గణాంకాల ప్రకారం, వరంగల్, రామగుండం, కాజీపేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో సల్ఫర్, నైట్రోజన్ ఆధారిత వాయువులు, ధూళి కణాల మోతాదులు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన పరిమితుల్ని మించాయి.

గాలి నాణ్యత అంచనా వేసేందుకు ఎక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) అనే సూచికను ఉపయోగిస్తారు. ఇది గాలిలోని కలుషిత పదార్థాల మోతాదుల ఆధారంగా ఒక విలువను నిర్ధారిస్తుంది. భారతదేశ ఎక్యూఐ ప్రమాణాల ప్రకారం 0 నుంచి 50 వరకు గాలి శుభ్రమైనదిగా, 51 నుంచి 100 వరకు సంతృప్తికరమైనదిగా, 101 నుంచి 200 వరకు మోస్తరుగా కలుషితమైనదిగా, 201 నుంచి 300 వరకు ప్రమాదకరమైన స్థాయిగా, 301 నుంచి 400 వరకు అత్యంత ప్రమాదకరమైన స్థాయిగా, 401 నుంచి 500 వరకు అత్యంత తీవ్రమైన హానికర స్థాయిగా పరిగణించబడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం గాలి కాలుష్యం వలన ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 70 లక్షల మంది మరణిస్తున్నారు. భారత్‌లో ప్రతి 8 మరణాల్లో ఒకటి గాలి కాలుష్యం వల్లనే జరుగుతోంది. భారత సగటు పిఎమ్2.5 స్థాయి 53.3 '%స్త్ర/ఎట% కాగా, డబ్ల్యూహెచ్ఓ పరిమితి 5 '%స్త్ర/ఎట% మాత్రమే. ఢిల్లీలో 2023లో 130 రోజులకిపైగా ఎక్యూఐ 400 మించిందిగా నమోదైంది. హైదరాబాద్‌లో వేసవికాలంలో పిఎమ్10 స్థాయిలు 120 '%స్త్ర/ఎట% మించాయి. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి పట్టణాల్లో సగటు ఎక్యూఐ 160%-%200 మధ్య ఉంది. పిఎమ్2.5 స్థాయి 10 '%స్త్ర/ఎట% నుంచి 25 '%స్త్ర/ఎ%టకి పెరిగితే జనాభాలో మరణాల రేటు 8%-%10% వరకు పెరుగుతుందని డబ్ల్యూహెచ్ఓ నివేదిక చెబుతోంది.


ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) లెక్కించేందుకు గణిత సూత్రాలు ఉపయోగిస్తారు. ఉదాహరణకు, పిఎమ్2.5 స్థాయి 85 '%స్త్ర/ఎట% అయితే, ఎక్యూఐ సుమారుగా 121%-%130 మధ్యగా ఉంటుంది, ఇది సెన్సిటివ్ గ్రూప్స్ కి ప్రమాదకరం అనే స్థాయికి చెందుతుంది. హైదరాబాద్ నగరంలో పిఎమ్2.5 సగటు స్థాయి 122 '%స్త్ర/ఎ%టగా నమోదవుతోంది. ఇది డబ్ల్యూహెచ్ఓ పరిమితికి 20 రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం ఉన్న నగరాల్లో సగటు జీవితకాలం దాదాపు 5.85 సంవత్సరాలు తగ్గిపోతుందని హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం సూచిస్తోంది. పాల్యూషన్ మూలాల్లో పారిశ్రామిక ఉద్గారాలు, వాహనాల పొగ, నిర్మాణ వ్యర్థాలు ప్రధానంగా ఉన్నాయి. ఉదాహరణకు ఒక సిమెంట్ పరిశ్రమ నుంచి విడుదలయ్యే పిఎమ్10 దుమ్ము మోతాదు 500 %ఎస్త్ర/చీఎ%టగా ఉండగా, అనుమతించదగిన పరిమితి కేవలం 100 %ఎస్త్ర/చీఎట% మాత్రమే. నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ డై ఆక్సైడ్లు కూడా ఇలానే ఎక్కువగా ఉంటున్నాయి.

లాన్సెట్ నివేదిక ప్రకారం, భారత్‌లో గాలి కాలుష్యం వల్ల ప్రతి సంవత్సరం సుమారు 17 లక్షల మంది మరణిస్తున్నారు. ఇది మొత్తం జనాభాలో 0.12 శాతం. యూనిసెఫ్ నివేదిక ప్రకారం, పిఎమ్2.5 స్థాయి 50 '%స్త్ర/ఎట% మించితే పిల్లల ఐక్యూ సగటున 4%-%8 పాయింట్లు తగ్గవచ్చు. భారత్‌లో 15 కోట్ల మంది పిల్లలు అధిక కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో జీవిస్తున్నారని అంచనా. డబ్ల్యూహెచ్ఓ అధ్యయనాల ప్రకారం ప్రతి 10 '%స్త్ర/ఎట% పిఎమ్2.5 పెరిగితే ఆస్తమా, దీర్ఘకాలిక శ్వాసకోశ ఆవరణ సంబంధ వ్యాధి (సి ఓ పి డి), గుండెపోటు, స్ట్రోక్ వంటి వ్యాధుల ముప్పు 3%-%6% పెరుగుతుంది. గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు అనేక సాంకేతిక, సామాజిక పరిష్కారాలు ఉన్నాయి. పరిశ్రమలలో ఎలెక్ట్రోస్టాటిక్ అవక్షేపకాలు (ఎలెక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్), స్క్రబ్బర్లు, బగ్ ఫిల్టర్లు వంటి అధునాతన ఫిల్టర్ సాంకేతికతలు ఉపయోగించి పొగను శుద్ధి చేయవచ్చు. వాహనాల వల్ల వచ్చే కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాలు (ఈ వి ఎస్), సార్వత్రిక రవాణా వాడకం (బస్సులు, మెట్రో రైళ్లు) ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టకుండా వాటిని కంపోస్ట్ చేయడం, బయోచార్ మార్గాలు అవలంబించాలి. పెద్ద నగరాల్లో గాలి శుద్ధి టవర్లు (జాతీయ రాజధానిలో "స్మాగ్ టవర్"లు) అమలులోకి తీసుకురావాలి. ప్రతి ఇంటి వద్ద చెట్లను నాటి వాటిని సంరక్షించడంలో పాల్గొనాలి. ఒక పెద్ద వృక్షం సగటున ఏడాదికి 100 కేజీల వరకు హానికర వాయువులను గ్రహించి, 20 కేజీల వరకు ఆక్సిజన్ విడుదల చేస్తుంది.పజల ఆరోగ్య వ్యయం పెరుగుతోంది. ఊపిరితిత్తుల క్యాన్సర్, అలెర్జీలు, మెదడు అభివృద్ధిలో లోపాలు వంటి సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే పారిశ్రామిక నియంత్రణ, శుద్ధి వ్యవస్థల ఏర్పాటు, హరిత వాహనాల ప్రోత్సాహం, మురికివాడల శుభ్రపరిచే చర్యలు, మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలి. ఇది ప్రభుత్వ బాధ్యతతోపాటు ప్రతి పౌరుడి బాధ్యత కూడా. మన ఊపిరిని మనమే కాపాడుకుందాం.

**-మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి డైలీ**
**మహబూబాబాద్, తెలంగాణ రాష్ట్రం**

# స్టాలిన్ నిర్ణయం చారిత్రాత్మకం








కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని రూపొందించి ప్రపంచానికి అందించిన జర్మన్ తత్వవేత్త కార్ల్‌మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో ప్రతిష్టించనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ గత గురువారం శాసనసభలో ప్రకటించడం హర్షణీయం. ఆవిధంగా ఆయన చేసిన ప్రకటన సమతా సమాజ ఆకాంక్షకు ప్రతిబింబించింది అనిచెప్పవచ్చు. హేతువాదానికి ప్రతీకగా నిలిచిన ద్రవిడ నేల తమిళనాడు రాష్ట్ర రాజధానిచెన్నైలో కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని ప్రతిష్టించనుండడం నిజంగా గర్వించదగ్గ విషయం. నేడుదేశంలోని ప్రజలలో అసమానతలు సృష్టిస్తూ అసహనానికి గురిచేస్తున్న ప్రజా వ్యతిరేకరాజకీయాలను సమూలంగా నేలమాలిగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమిళనేలలో ద్రవిడ ఉద్యమం మరియు కమ్యూనిస్ట్ ఉద్యమాలు సమాంతరంగా ముందుకుకొనసాగుతూనే ఉన్నాయి. అందువలన సమష్టి పోరాటాల ద్వారా ఉద్యమిస్తే సమానత్వంసిద్ధించి సమసమాజం వికసిస్తుంది అని చెప్పవచ్చు. ఈ తరుణంలో ఎం.కె.స్టాలిన్ ద్రవిడసిద్ధాంతంతో పాటు మార్క్సిస్ట్ సిద్ధాంతానికి ఎనలేని ప్రాధాన్యతని కల్పిస్తూ ఆ దిశగా ముందుకు సాగడం ప్రశంసనీయం."ప్రపంచ చరిత్ర గతిని మార్చిన కొద్ది మంది వ్యక్తులలో కార్ల్ మార్క్స్ ప్రముఖమేటివ్యక్తిగా ఉన్నారు. ఆయన అందించిన సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా విప్లవాలకు దారితీశాయి. ప్రపంచం ఇప్పటివరకు ఆయన సిద్ధాంతాల ఆధారంగా అనేక మార్పులకుపునాదిగా నిలిచాయి. ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీ లేదు,బానిస సంకెళ్లు అనే గొప్ప నినాదాన్ని కార్ల్ మార్క్స్ అందించి ప్రపంచకార్మికులందరికీ ఉద్బోధ చేసి బాసటగా నిలిచారు. ఆయన గొప్ప విజనరీ కలతాత్వికుడు. కార్మికులు గెలవడానికి ఒక ప్రపంచం ఉంది అనే విశ్వాసాన్ని కూడా ఆయనకలిగించడంలో సఫలమ య్యారు" అని ఎం.కె.స్టాలిన్ అసెంబ్లీ సాక్షిగా కార్ల్ మార్క్స్ చేసినకృషిని ప్రశంసించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఈ విధంగా ఆయన అసెంబ్లీలో కార్ల్ మార్క్స్ కృషిని ప్రశంసించడం ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోయింది అని చెప్పవచ్చు.భారతదేశంలో గతంలో రాజకీయాలు ఎలా ఉన్నప్పటికిని, సామాజిక - రాజకీయపరిస్థితులు ఏమాత్రం మారనప్పటికిని భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో దేశం ఆయాసామాజిక - రాజకీయ మార్పులకు ఆలంబనగా నిలిచి అందరికీ ఆదర్శ నమూనాగాఉద్ధరించబడనుంది' అని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రత్యేకంగా కార్ల్ మార్క్స్‌ను ఉటంకిస్తూపేర్కొనడాన్ని సునిశితంగా గమనించవచ్చు. 'భారతదేశం గురించి ఎవరూ రాయనిసమయంలో దేశం గురించి విషయ విస్తృతంగా సరైన రీతిలో కార్ల్ మార్క్స్ గ్రంథస్థంచేశారు. కార్ల్ మార్క్స్ మరియు ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టోను 1931లో పెరియార్ (ఇ.వి.రామసామి) ప్రత్యేకంగా తమిళంలోకి అనువదించి ప్రచురించారు' అనిస్టాలిన్ ఈ సందర్భంగా గుర్తు చేయడం గమనార్హం.కార్ల్ మార్క్స్ జీవించి ఉన్న కాలంలోనే ప్రఖ్యాత లేబర్ ఉద్యమం ఓ శతాబ్దంపాటు కొనసాగడాన్ని గమనించవచ్చు. వంద సంవత్సరాల క్రితం ట్రేడ్ యూనియన్‌ఉద్యమం బాగా అభివృద్ధి చెందిన చెన్నై నగరంలో కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్‌విగ్రహాన్ని తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా నేడు ప్రతిష్టించబూనడం అన్నివిధాలుగా సముచితంగా ఉంటుంది అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అందువలన ఈ క్రమంలోనే ఈ ద్రవిడ నమూనా తమిళనాడు ప్రభుత్వం 'కష్టజీవులతత్వవేత్త కార్ల్ మార్క్స్ తాత్వికతను సమున్నతంగా గౌరవించాలి' అనే దానికి అత్యధికప్రాధాన్యాన్ని కల్పించడం శుభపరిణామం. అంతిమంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని చెన్నైలో ప్రతిష్టించే విధంగాసముచిత నిర్ణయాన్ని తీసుకొని ఆ దిశగా ముందుకు సాగడం తమిళ రాజకీయాలలో చారిత్రాత్మకంగా నిలిచిపోనుంది అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఏది ఏమైననూ 'చెన్నైలోప్రతిష్టింపబోయే ఈ కార్ల్ మార్క్స్ విగ్రహం దోపిడి వ్యవస్థను నిలువరించేలా ప్రజా పోరాటాలకుక్రాంతదర్శిలా నిలిచిపోనుంది' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

**- జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్: 94933 19690**

## మడి కట్టుకోవడం అంటే ఏమిటో తెలుసా

భక్తి



'మడి' అనే పదం తమిళం )లో 'పవిత్రత' లేదా 'శుచిత్వం' అని అర్థం. మడి కట్టుకుని ఉండటం అంటే, శారీరకంగా, మానసికంగా శుద్ధిగా ఉండటం కోసం కొన్ని నియమాలను పాటించడం. ఇది సాధారణంగా పూజలు, వంట లేదా ఇతర పవిత్ర కార్యక్రమాల సమయంలో జరుగుతుంది. మడి కట్టుకోవడంలో శుభ్రమైన బట్టలు ధరించడం, స్నానం చేయడం, బయటి స్పర్శ నుండి దూరంగా ఉండటం వంటివి ఉంటాయి. ఈ సమయంలో ఒకరు ఇతరులను తాకకుండా, శుచిగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటారు.

మడి బట్టలు అంటే ఏమిటి..

మడి బట్టలు అంటే పూజలు లేదా పవిత్ర కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే శుభ్రమైన, కొత్తగా కడిగిన లేదా తడిగా ఉన్న దుస్తులు. ఇవి సాధారణంగా పత్తి బట్టలు అయి ఉంటాయి. పురుషులకు ధోతీ, ఉత్తరీయం (పై భాగం కప్పే గుడ్డ), స్త్రీలకు చీర లేదా సాంప్రదాయ దుస్తులు. ఈ బట్టలు ఎవరూ తాకని, పరిశుద్ధమైన స్థితిలో ఉండాలి. కొన్ని సందర్భాల్లో, స్నానం చేసిన వెంటనే తడి బట్టలను ధరించడం కూడా మడి ఆచారంలో భాగం, ఎందుకంటే తడి బట్టలు శుచిత్వాన్ని సూచిస్తాయని నమ్ముతారు.

ఇంట్లో ఉన్నప్పుడు ఎందుకు మడి కట్టుకుంటారు..

ఇంట్లో మడి కట్టుకోవడం సాధారణంగా పూజలు, హోమాలు, శ్రద్ధ కార్యక్రమాలు, లేదా దేవుడికి నైవేద్యం సిద్ధం చేసే సమయంలో జరుగుతుంది. ఈ సమయంలో శరీరం, మనస్సు, వాతావరణం పవిత్రంగా ఉండాలని భావిస్తారు. ఉదాహరణకు, వంట చేసేటప్పుడు మడి కట్టుకోవడం వల్ల ఆహారం శుద్ధిగా, దైవానికి సమర్పించడానికి తగినట్లుగా ఉంటుందని నమ్ముతారు. ఇంట్లో ఈ ఆచారం పాటించడం వల్ల దైనందిన జీవితంలో శుచిత్వం, క్రమశిక్షణను కాపాడుకోవచ్చని భావిస్తారు.

దీని అసలు కథ ఏమిటి..

మడి ఆచారం వేద కాలం నుండి ఉన్న శుచి-అశుచి సంప్రదాయాలకు సంబంధించినది. హిందూ ధర్మ శాస్త్రాల్లో, ముఖ్యంగా మనుస్మృతి, ఆపస్తంభ సూత్రాల వంటి గ్రంథాల్లో, పూజలు, యజ్ఞాల సమయంలో శుద్ధతను కాపాడటం గురించి వివరించబడింది. బ్రాహ్మణ సమాజంలో ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తుంది, ఎందుకంటే వారు వేద పఠనం, యజ్ఞాలు, దైవ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారు. పురాతన కాలంలో, శుచిత్వం అనేది ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతికి సంబంధించినదిగా భావించబడేది. ఉదాహరణకు, ఒకరు స్నానం చేయకుండా లేదా శుభ్రంగా లేకుండా పూజలో పాల్గొంటే, అది దేవుడికి అగౌరవంగా భావిస్తాం.

కాలక్రమంలో, ఈ ఆచారం దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణ కుటుంబాల్లో ఒక సంస్కృతిగా మారింది. తమిళనాడులోని శ్రీవైష్ణవ సంప్రదాయంలో, శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో దేవుడికి నైవేద్యం సిద్ధం చేసే సమయంలో మడి ఆచారం కఠినంగా పాటించబడుతుంది. ఇది కేవలం శుచిత్వం కోసం మాత్రమే కాదు, దైవ సాన్నిధ్యాన్ని గౌరవించడం కోసం కూడా ఉద్దేశించబడింది. ఈ ఆచారం వెనుక ఉన్న భావన ఏమిటంటే, శరీరం ఒక ఆలయంలాంటిది, దానిని శుద్ధిగా ఉంచడం వలన దైవానికి సమర్పణ చేయడం సాధ్యమవుతుంది.

మడి కట్టుకోవడం అనేది శుచిత్వం, ఆధ్యాత్మిక శాంతి, దైవ భక్తిని కాపాడే సంప్రదాయం. మడి బట్టలు ఈ పవిత్రతను సూచిస్తాయి, ఇంట్లో దీనిని పాటించడం దైనందిన జీవితంలో క్రమశిక్షణను నిర్వహిస్తుంది. దీని మూలాలు వేద కాలం నుండి వచ్చినప్పటికీ, ఇది ఇప్పటికీ ఆచరణలో ఉండటం హిందూ సంస్కృతి విలువలను చూపిస్తుంది.

## బంగారు ఆభరణాల మెరుపులకు.

మహిళలు సాధారణంగా గొలుసులు, గాజులు, దిద్దులు, ఉంగరాలు లాంటి బంగారు ఆభరణాలు ధరిస్తూ ఉంటారు. వీటి మీద చెమట, దుమ్ము చేరడం వల్ల అవి మెరుపును కోల్పోయి నల్లబడుతుంటాయి. ఈ ఆభరణాలను కొత్తవాటిలా మెరిపించడానికి ఇంట్లోనే శుభ్రం చేసే విధానాలను చాలానే ఉన్నాయి. అలాంటి కొన్ని చిట్కాలు

బంగారు ఆభరణాల మెరుపులకు.

మీ కోసం...ఒక గిన్నెలో ఒక గ్లాసు వేడి నీళ్లు పోసి, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఇందులో నల్లగా మారిన బంగారు ఆభరణాలను ఉంచి అరగంట సేపు నానబెట్టాలి. తరవాత మెత్తని స్పాంజితో రుద్ది మంచినీళ్లతో కడిగితే నగలు కొత్తవాటిలా మెరుస్తాయి.

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి ఒక చెంచా పసుపు, ఒక చెంచా సర్ఫ్ వేసి అయిదు నిమిషాలు వేడి చేసి దించాలి. ఇందులో బంగారు ఆభరణాలు ఉంచి పది నిమిషాలు నాననివ్వాలి. తరవాత వాటిని పాత టూత్‌బ్రష్‌తో సున్నితంగా రుద్ది నీళ్లతో కడిగితే మురికి పూర్తిగా వదిలిపోతుంది.

ఒక గిన్నెలో రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు పోసి అందులో కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ లేదా వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో నగలు ఉంచి పావుగంటసేపు నానబెట్టాలి. తరవాత వేళ్లతో రుద్దుతూ నీళ్లతో శుభ్రం చేస్తే వాటిమీద పేరుకున్న మురికి తొలగిపోతుంది.

ఒక పాత టూత్‌బ్రష్ మీద కొద్దిగా టూత్‌పేస్టు వేసి దానితో ఆభరణాలను మెల్లగా తోమాలి.

# మన చుట్టూ చూస్తే అవకాశాలెన్నో!





తరచి చూస్తే మన చుట్టూ అనేక అవకాశాలు ఉంటాయి. వాటిని అందిపుచ్చుకుంటే.. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించటమే కాదు.. ఇతరులకు సాయం చేయటానికి వీలవుతుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దీపాలి ముర్రా కథ కూడా ఇదే.. దీపాలి తన చుట్టూ పక్కల ఉచితంగా దొరికే సబాయి గడ్డితో పర్యావరణహితమైన గృహఅలంకారాలను చేసి విక్రయించటం ప్రారంభించింది. తనలాంటి అనేక మంది గిరిజన మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తోంది. దీపాలి ప్రస్థానం ఆమె మాటల్లోనే...

"నేను పదోతరగతి వరకు చదువుకున్నాను. నాకు చిన్నతనంలోనే వివాహమైంది. నా భర్త తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసేవాడు. గట్ల మీద సబాయి గడ్డిని పండించేవాడు. సబాయి గడ్డి చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా ఈ గడ్డితో తాళ్లను పేనుతారు. నా భర్త చేసే వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం మా కుటుంబానికి సరిపోయేది కాదు. దాంతో నేను కూడా ఏదో ఒక పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించకపోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి. కానీ ఆ డబ్బులు సరిపోయేవి కావు. ఆ సమయంలో– నా కోసమే అన్నట్లుగా– యునెస్కో సంస్థ స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి– ఒక వర్క్‌షాపను నిర్వహించింది. ఈ వర్క్‌షాపలో సబాయి గడ్డిని ఉపయోగించి రకరకాల గృహాలంకరణ వస్తువులను తయారు చేయడం నేర్పించారు. జ్యూవెలరీ బాక్స్‌లు, బుట్టలు, హ్యాంగింగ్ ప్లాంటర్లు, వాల్ మౌంటెడ్ సాల్వర్లు, ఫ్లవర్ వాజ్‌లు, పళ్లాలు వంటివి తయారుచేయటం ఎలాగో నేర్పించారు. వాటిపై అందమైన పువ్వులు, పక్షులు, జంతువుల బొమ్మలు కుట్టడం నేర్పారు.

రకరకాలు...

ఈ ప్రకృతిలో ప్రతి వస్తువు మనకు పనికి వస్తుంది. మనం వాటిని గుర్తించి ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించాలంతే! సబాయి గడ్డి చూడటానికి గరుకుగా ఉన్నా– దానితో రకరకాల వస్తువులు తయారుచేయవచ్చు. మా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు వేటిని ఇష్టపడతారో గమనించి– ఆ వస్తువులు తయారుచేయటం మొదలుపెట్టా. ఈ ప్రయాణ ప్రారంభంలోనే– ఎదురయిన తొలి సవాల్– తగినంత సబాయి గడ్డి దొరకకపోవటం. మా పొలంలో పండిన గడ్డి– ఎక్కువ వస్తువులకు సరిపోయేది కాదు. దాంతో ఇతరుల నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చేది. గడ్డితో పాటుగా సహజసిద్ధమైన రంగులను కూడా కొని తయారు చేసిన వస్తువులపై బొమ్మలు వేసేదాన్ని. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సబాయి గడ్డితో చేసే వస్తువుల తయారీకి చాలా ఎక్కువ సమయం పడుతుంది. ఉదాహరణకు ఒక అందమైన బుట్ట అల్లాలంటే 40 గంటల దాకా పడుతుంది. దాంతో నేను ఎదగాలంటే ఎక్కువ మంది పనివారు అవసరమవుతారని అర్థమయింది. ఆ లోపులో నేను తయారుచేసిన వస్తువులకు గిరాకీ పెరిగింది. దాంతో మా గ్రామంలోనే ఉన్న కొద్ది మంది మహిళలకు ఉపాధి కల్పించాను. ప్రస్తుతం నా దగ్గర 50 మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరందరూ నెలకు 600 దాకా రకరకాల వస్తువులు తయారుచేస్తూ ఉంటారు. వీటిని దేశంలో వివిధ నగరాల్లో జరిగే కళాప్రదర్శనలలో ఉంచుతాము. గత ఏడాది కొపెన్‌హెగెన్‌లో జరిగిన ఒక ఉత్సవంలో కూడా పాల్గొన్నాం.

ఒకప్పుడు నెలకు 1500 సంపాదించటానికి కష్టపడిన నేను ప్రస్తుతం ఏడాదికి కొన్ని లక్షలు సంపాదిస్తున్నా! దీనికి ప్రధానమైన ముడివస్తువు గడ్డే! అనేక ప్రాంతాల్లో ఉచితంగా దొరికే ఈ గడ్డితో అందరూ వస్తువులు తయారుచేయవచ్చు. సంపాదించుకోవచ్చు. దీనికి నేనే ఉదాహరణ. నా ఉదాహరణ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నా!".

నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించకపోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి.

# గింజ గింజపై రామ వందనం



**గింజ గింజపై రామ వందనం రామయ్య పెండ్లికి ఊరంతా పెద్దలే. సీతమ్మ కల్యాణానికి వాడంతా విడిదిల్లే! తోరణాలు కట్టేవారొకరు. చలువ పందిళ్లు వేసేవాళ్లు మరొకరు. ఉత్సవమూర్తులను అలంకరించేవాళ్లు వేరొకరు. ఇలా ప్రతి ఒక్కరూ రామకార్యానికి ఉడతా భక్తిగా తోడ్పడుతుంటారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన చెలువాది మల్లివిష్ణువందన కూడా ఈ కోవకే చెందుతారు.**

రామయ్య పెండ్లికి ఊరంతా పెద్దలే. సీతమ్మ కల్యాణానికి వాడంతా విడిదిల్లే! తోరణాలు కట్టేవారొకరు. చలువ పందిళ్లు వేసేవాళ్లు మరొకరు. ఉత్సవమూర్తులను అలంకరించేవాళ్లు వేరొకరు. ఇలా ప్రతి ఒక్కరూ రామకార్యానికి ఉడతా భక్తిగా తోడ్పడుతుంటారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన చెలువాది మల్లివిష్ణువందన కూడా ఈ కోవకే చెందుతారు. బియ్యం గింజలపై రామనామాన్ని లిఖించి.. కల్యాణ తలంబ్రాలు చదివిస్తున్నారు. రామ నామాంకితమైన తలంబ్రాలను శ్రీరామనవమి సందర్భంగా వివిధ ఆలయాలకు పంపుతూ తన భక్తిని వినూత్నంగా చాటుకుంటున్నారు.

చందానగర్‌లో ఉంటున్న విష్ణువందన పదో తరగతి వరకు చదువుకున్నారు. గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చిన్నప్పటి



నుంచి ఆమెకు రాముడంటే వల్లమాలిన భక్తి. శ్రీరామునిపై తనకున్న అచంచలమైన భక్తిని చాటుకోవాలని ఎప్పుడూ పరితపిస్తూ ఉంటారు. మొదట్లో కొండాపూర్‌లో ఉన్న రామాలయానికి పూలదండలు అల్లి నిత్యం తీసుకెళ్లి పూజల్లో పాల్గొనేవారు. తన భక్తికి మరింత ప్రత్యేకత జోడించాలని భావించారామె. ఈ క్రమంలో ఒంటిమిట్ట రామాలయంలో రామ నామం జపిస్తూ తలంబ్రాలు తయారు చేస్తారని తన భర్త ద్వారా తెలుసుకున్నారు. ఆ స్ఫూర్తితో బియ్యం గింజలపై రామనామం లిఖిస్తూ తలంబ్రాలు తయారుచేయడం మొదలుపెట్టారు. 2016లో మొదటిసారి 1,11,111 గింజలపై 'శ్రీరామ' నామాన్ని రాసి తలంబ్రాలు తయారుచేశారు.

వాటిని పలు రామాలయాల్లో జరిగే కల్యాణోత్సవానికి సమర్పించారు. తొమ్మిదేండ్లుగా ఈ క్రతువును కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 128 రామాలయాలకు సభక్తికంగా ఆమె తలంబ్రాలను సమర్పించారు. విష్ణువందన ఈ ఏడాది 1,75,000 గింజలపై రామనామం రాసి, వాటిని 60కి పైగా రామాలయాలకు పంపించారు. భద్రాచలంతోపాటు తుంగతుర్తి, జగిత్యాల, భువనగిరి, వరంగల్, నల్లకుంట, బీరంగూడ, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న రామాలయాలతోపాటు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, పశ్చిమ్‌బెంగాల్ రాష్ట్రాల్లోని రామాలయాలకూ ఈ తలంబ్రాలను పంపించారు. శ్రీరామనవమికి ఎనిమిది నెలల ముందుగానే ఆమె ఈ మహత్కార్యాన్ని ప్రారంభిస్తారు. నిత్యం రామనామాన్ని స్మరిసూ బియ్యంపై 'శ్రీరామ' అని రాస్తూ.. సత్కాలక్షేపం చేస్తారు. భవిష్యత్తులో శ్రీరామనవమికి 108 ఆలయాలకు రామ నామాంకితమైన తలంబ్రాలను పంపడమే తన లక్ష్యం అంటున్న విష్ణువందన భక్తి తత్పరతకు మనమూ వందనం సమర్పించుకుందాం!



# అందాల రాముడు.. అందరికీ దేవుడు





రాముడు దేవుడు కాదు.. మనిషి. రాముడు మనిషి కాదు.. దేవుడు. కాదు.. రాముడు మనిషిగా పుట్టి దేవుడయ్యాడు.. కాదుకాదు.. దేవుడే మనిషిగా పుట్టి రాముడయ్యాడు.. వాల్మీకి రాస్తుండగా రామాయణం జరిగిందా? వాల్మీకి రాశాక రామాయణం జరిగిందా? లేక జరిగిపోయిన కథను వాల్మీకి రాశాడా? ఈ వాదనలు, ఈ ప్రశ్నలు ఈనాటివి కావు. యుగాల నాటివి. అసలు 'రామాయణం జరగలేదు.. అది వాల్మీకి అనే ఓ పెద్దాయన రాసిన కథ మాత్రమే..' అనే వాళ్లు కూడా ఉన్నారు. అలాగే.. అయోధ్య నుంచి శ్రీలంక వరకూ రామ పాదముద్రలను చారిత్రక ఆధారాలుగా చూపించే ఆధ్యాత్మిక పరిశోధకులు కూడా ఉన్నారు. సంకుచిత మనసుతో ఆలోచిస్తే ఇది అర్థమయ్యేది కాదు.

అఖండ భరతావనిపై రామాయణం ప్రభావం మాత్రం అసామాన్యం. అసలు భారతీయ వైవాహిక, కుటుంబ వ్యవస్థలు ప్రపంచానికే తలమానికంగా నిలిచాయంటే కారణం రామాయణం. కొడుకు ఎలా ఉండాలి? రాముడిలా ఉండాలి. అన్న ఎలా ఉండాలి? రాముడిలా ఉండాలి. భర్త ఎలా ఉండాలి? రాముడిలా ఉండాలి. వీరుడెలా ఉండాలి? రాముడిలా ఉండాలి. దేవుడెలా ఉండాలి? రాముడిలా ఉండాలి. అసలు మనిషి ఎలా ఉండాలి? రాముడిలా ఉండాలి. అలాగే కూతురెలా ఉండాలంటే సీతమ్మలా ఉండాలి.. కోడలెలా ఉండాలంటే సీతమ్మలా ఉండాలి.. భార్య ఎలా ఉండాలంటే సీతమ్మలా ఉండాలి. ఇలా అన్ని బంధాలకూ ఆదర్శంగా నిలిచారు సీతారాములు. సంస్కృతిపైనే కాదు, సాంస్కృతికంగా కూడా దేశంపై చెరగని ముద్ర వేశారు.

### సాంస్కృతిక రాముడు

రామ నామానికీ.. రామభక్తికీ.. ఏదో తెలియని శక్తి ఉన్నదని చరిత్ర చెబుతున్నది. 72 మేళకర్త రాగాలను, తద్వారా ఎన్నో కృతులను సంగీత ప్రపంచానికి రామ ప్రసాదంగా సమర్పించారు త్యాగరాజస్వామి. 'పలికెడిది భాగవతమట.. పలికించెడివాడు రామభద్రుండట' అని భాగవత రచనకు ముందే అసలు విషయాన్ని వ్యక్తపరిచారు పోతనామాత్యుడు. ఇక భజన సంకీర్తనా సంస్కృతిని సమస్త మానవాళికీ రామభక్తితో అందించిన కంచర్ల గోపన్న.. 'రామదాసు'గా వినుతికెక్కాడు. సాంస్కృతిక పరంగా రామభక్తి ప్రభావం దేశంపై, మరీ ముఖ్యంగా తెలుగు నేలపై ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు.

### సినిమా రాముడు

సకల కళల సమ్మేళనమైన సినిమాపైన కూడా రాముడి ముద్ర బలంగానే ఉంది. రామాయణం ప్రేరణగా వందల కథలు వెండితెరపై వెలిగాయి. ఆ మాటకొస్తే అచ్చంగా రామాయణాన్నే ఎన్నోసార్లు తీశారు. సాంకేతికంగా సినిమా ఎంత ఎదిగినా.. కథా గమనాల్లో ఎన్ని మార్పులు జరిగినా..



రామాయణ ప్రభావం మాత్రం నేటికీ సినిమాపై అలాగే ఉంది. ప్రస్తుతం వెండితెరపై హీరోయిజం, ఎలివేషన్స్ రాజ్యమేలుతున్నాయి. అభిమాన హీరోల సినిమాల్లో హీరోయిజం అదిరిపోవాలనీ, ఎలివేషన్లు ఓ స్థాయిలో ఉండాలని అభిమానులే కోరుకుంటున్నారు. అసలు ఈ హీరోయిజం ఎక్కడినుంచి పుట్టింది?.. అంటే.. రాముడి గురించి తెలుసుకోవడమే దానికి సమాధానం. విలన్ ఎంత శక్తిమంతుడైతే హీరోయిజం అంత ఎస్టాబ్లిష్ అవుతుందనే సూత్రం సినిమాకు తెలియజెప్పిందే రామాయణం. ఇక ఎలివేషన్స్.. ఈ ట్రెండ్‌కి త్రేతాయుగంలోనే నాంది పలికారు వాల్మీకి. 'మారీచ ఉవాచ', 'అంగద రాయబారం', 'హనుమంతుడి హితబోధ'.. రామాయణంలోని ఈ ఘట్టాలే అందుకు నిదర్శనాలు.

### ఆధ్యాత్మిక రాముడు

పురాణాల ప్రకారం ముక్కోటి దేవతలున్నా.. రాముడంటేనే ఎందుకో కోట్లాదిమందికి అలవిమాలిన ప్రేమ.. అనిర్వచనీయమైన భక్తి. ఈ భక్తి ఆచంద్రతారార్కం వర్ధిల్లుతూనే ఉంటుంది. నేడు శ్రీరామనవమి. తెలుగునేలంతా చలువ పందిళ్లే.. ఎటు చూసినా సీతారామ కల్యాణాలే. ఎక్కడ విన్నా మంగళవాయిద్యాలే. తీయని పానకం.. కమ్మటి వడపప్పు రామచంద్రమూర్తికి నైవేద్యంగా సమర్పించి, భక్తిపారవశ్యంతో జనం మైమరిచిపోయే శుభదినం నేడు. దేవుడి పెళ్లి అయ్యేదాకా, మనుషులు పెళ్లాడకూడదనే సంప్రదాయం తెలుగునేలపై ఇంకా ఉంది. అందుకే భద్రాద్రి రామయ్య కల్యాణం కోసం పెళ్లి కావాల్సిన జంటలు ఆశగా ఎదురు చూస్తుంటాయి. బహుశా రాములోరి పెళ్లి తెలంగాణ గడ్డపై జరిగినంత ఘనంగా మరెక్కడా జరగదేమో! ఈ శుభ ఘడియలు పదిలం చేసుకుందాం. కల్యాణ రాముడి కమనీయ గాథలు పదే పదే తలుచుకుందాం!!

### రాములోరి తాలూకా

రాముడు.. రామాయణం.. సినిమా.. ఈ అంశాల గురించి మాట్లాడుకునేటప్పుడు ఓ ఇద్దరి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వారిలో ఒకరు నటరత్న ఎన్టీరామారావు అయితే.. మరొకరు దర్శకుడు బాపు. శ్రీరాముడి అవతార ప్రారంభం నుంచి సమాప్తం వరకూ రాముడిగా నటించిన క్రెడిట్ ఎన్టీఆర్‌దైతే.. రామకథను సంపూర్ణంగా తెరపై ఆవిష్కరించిన ఘనత దర్శకుడు బాపుది. ఎన్టీఆర్ నటించిన 'సంపూర్ణ రామాయణం' (1958) సినిమా.. రామ జననం నుంచి పట్టాభిషేకం వరకూ ఉంటుంది. ఆ తర్వాత ఆయన 'లవకుశ' (1963) చేశారు. ఆ సినిమా రామావతార సమాప్తం వరకూ ఉంటుంది. ఆ విధంగా వెండితెరపై ఎన్టీఆర్ రామావతారాన్ని పూర్తిచేశారు. ఇక బాపు విషయానికి వస్తే.. ఆయన తీసిన 'సీతా కల్యాణం' (1976) కథ.. సీతారాముల కల్యాణం వరకు ఉంటుంది. ఆయనే తీసిన 'సంపూర్ణ రామాయణం' (1972).. శ్రీరామ పట్టాభిషేకం వరకూ ఉంటుంది. అలాగే.. బాపు చివరి సినిమా 'శ్రీరామరాజ్యం' (2011) రామావతార సమాప్తం వరకు కొనసాగుతుంది. ఆ విధంగా బాపు వెండితెరపై రామాయణ కావ్యాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించారు. రామాయణ పాత్రల కల్పిత కథతో నిర్మాతలు పొట్లూరి వెంకటనారాయణరావు, ఎస్‌బీకే ఉమామహేశ్వరరావు 'శ్రీరామాంజనేయ యుద్ధం' అనే సినిమా తీశారు. ఆ సినిమాకు దర్శకుడు బాపు అయితే.. రాముడు ఎన్టీఆర్. మొత్తంగా ఎక్కువసార్లు రాముడిగా నటించి రామారావు.. ఎక్కువసార్లు రామాయణాన్ని తెరకెక్కించి బాపు.. ఇద్దరూ రాములోరి తాలూకాగా మిగిలిపోయారు.

మరీ ముఖ్యంగా రామారావుకి రాముడికీ ఏదో అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది. ఎన్టీఆర్ రాముడిగా చేసిన 'లవకుశ'లో లక్ష్మణుడిగా నటించిన కాంతారావు.. ఆ తర్వాత 'వీరాంజనేయ' (1968) చిత్రంతో రాముడిగా మారారు. అలాగే.. అదే 'లవకుశ'లో శత్రుఘ్నుడిగా నటించిన శోభన్‌బాబు బాపు 'సంపూర్ణ రామాయణం'లో రాముడిగా నటించారు. ఎన్టీఆర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సీతారామ కళ్యాణం' (1961) సినిమాతో హరనాథ్ రాముడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత ఆయనే 'శ్రీరామకథ' (1969) సినిమాలో రాముడిగా నటించారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణ 'శ్రీరామరాజ్యం' సినిమాలో రాముడిగా నటిస్తే.. మనవడు జూనియర్ ఎన్టీఆర్.. పిల్లలతో గుణశేఖర్ తెరకెక్కించిన 'రామాయణం' సినిమాలో రాముడిగా మెరిశారు. ఆ విధంగా రాముడిగా నటించి, మెప్పించిన దాదాపు అందరితో కూడా.. అటు వృత్తిపరంగా, ఇటు వ్యక్తిగతంగా రామారావుకు అనుబంధం ఉండటం విశేషం. అంతేకాదు, ఒకే కుటుంబంలో తాత, తనయుడు, మనవడు.. ఇలా మూడు తరాలు శ్రీరాముడిగా నటించిన ఘనత భారత సినీ చరిత్రలో ఒక్క ఎన్టీఆర్ కుటుంబానికే దక్కింది. ఇక బాపు అయితే.. రామాయణం ప్రేరణగా సాంఘిక చిత్రాలను కూడా తీసేశారు. మచ్చుకు.. ముత్యాలముగ్గు, గోరంతదీపం, కలియుగ రావణాసురుడు.. ఈ మూడు సినిమాలనూ చెప్పుకోవచ్చు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్ సోమవారం 07 ఏప్రిల్ 2025



## ఈ వారం మార్కెట్లు దబిడి దిబిడేనా?



న్యూఢిల్లీ-నవభూమి:భారత స్టాక్ మార్కెట్లు రేపటి వారం అత్యంత ఒడిదుడుకులతో ఉండే అవకాశం కనిపిస్తోంది. అమెరికా తెచ్చిన పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధం.. ప్రపంచ వాణిజ్యాన్ని, తద్వారా ఆయా దేశాల ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తుందని, దీనికి తోడు అమెరికా ఆర్థిక మాంద్య భయాలతో పెట్టుబడిదారులు భయపడుతున్నారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, వచ్చే వారం వడ్డీ రేటు నిర్ణయం వెలువడుతుండటం, ఈ వారంలో భారతదేశ పారిశ్రామిక, ఉత్పత్తి డేటా కూడా విడుదల కానుంది. అటు, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వస్తుండటం వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిర పోకడలను ఎదుర్కోవచ్చని ట్రేడ్ పండితులు లెక్కలు కడుతున్నారు. అమెరికా సుంకాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణంపై విస్తృత ప్రభావాలను పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.మరోవైపు, చైనా యొక్క మార్చి నెల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ డేటా గురువారం విడుదల కానుంది. యూకే డేటా శుక్రవారం విడుదల కానుంది. ఇక, ఏప్రిల్ 10న %ఙజు% ఫలితాలతో %ు4 ఖీ%25 ఇన్ కం సీజన్ ప్రారంభమవుతుంది. ఈ వారం అమెరికా, భారతదేశం నుండి వెలువడే మార్చి డేటాపై కూడా పెట్టుబడిదారులు దృష్టి సారిస్తారని చెబుతున్నారు.దీనికి తోడు ఈ వారం విదేశీ పెట్టుబడిదారుల వాణిజ్య కార్యకలాపాలు, రూపాయి-డాలర్ ధోరణి, క్రూడ్ ఆయిల్ ధరలను మార్కెట్లు ఆసక్తిగా పరిశీలిస్తాయని నిపుణులు తెలిపారు. ఈక్విటీ బెంచ్ మార్క్‌లు శుక్రవారం సర్వత్రా అమ్మకాల కారణంగా క్షీణించిన సంగతి తెలిసిందే. ఇక, వచ్చే వారం భారత మార్కెట్లు 4రోజులే పనిచేస్తాయి. ఈక్విటీ మార్కెట్లు గురువారం "శ్రీ మహావీర్ జయంతి" పండుగ సందర్భంగా సెలవు.




## డెలివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్!




న్యూఢిల్లీ-నవభూమి: సరుకు రవాణాలో అగ్రగామి సంస్థగా వెలుగొందడానికి డెలివరీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంట్లోభాగంగా తన పోటీ సంస్థయైన ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.1,407 కోట్లు. షేర్ల కొనుగోలు ద్వారా జరగనున్న ఈ ఒప్పందం వచ్చే ఆరు నెలల్లో పూర్తికానున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ఒప్పందానికి కంపెనీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు, కొనుగోలు అనంతరం ఈకామ్ సంస్థ యథావిధిగానే తన సేవలను కొనసాగించనున్నదని, అలాగే సబ్సిడరీగా కొనసాగుతుందని డెలివరీ ఎండీ, సీఈవో సైడ్ సాహిల్ బారు తెలిపారు. ఇరు సంస్థల క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్లు%ు% మౌలిక సదుపాయల కల్పన, టెక్నాలజీ, నెట్‌వర్క్, ఉద్యోగాలను నియమించుకోవడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

## రూ. 2720 తగ్గిన గోల్డ్ రేటు.. రూ. 9 వేలు పడిపోయిన వెండి.. 2 రోజుల్లోనే మ్యాజిక్!



న్యూఢిల్లీ-నవభూమి: ఇటీవలి కాలంలో బంగారం, వెండి రేట్లు వరుసగా పెరిగి.. ఆల్ టైమ్ గరిష్ట స్థాయిలకు ఎగబాకిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అంతర్జాతీయంగా అనిశ్చితి నేపథ్యంలో.. సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారంవైపు పెట్టుబడులు మళ్లగా రేట్లు అదే స్థాయిలో ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. దీంతో సామాన్యులు కొనాలంటే చుక్కలు కనిపించాయి. పెళ్లిళ్ల సీజన్‌లోనూ డిమాండ్ అంతంతమాత్రంగానే నమోదైంది. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా ఈ పసిడి, వెండి ధరలు భారీ స్థాయిలో కుప్పకూలాయి. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో.. 2 రోజుల వ్యవధిలో బంగారం, వెండి రేట్లు పడిపోవడం గమనార్హం. అంతర్జాతీయంగా కూడా భారీగా ధరల్లో పతనం కనిపించింది. లేటెస్ట్ రేట్లు ఎక్కడ ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.ఈ ఏడాదిలోనే దాదాపు 20 శాతం వరకు పెరిగిన బంగారం ధరలో.. ఇప్పుడు ఒక్కసారిగా కరెక్షన్ కనిపించింది. ముఖ్యంగా గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు (లాభాల స్వీకరణ) పాల్పడటంతో ధరలు దిగొచ్చాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా అంచనాలకు మించి అమెరికాలో ఉద్యోగాల కల్పన నమోదవడం కూడా డాలర్ పుంజుకునేందుకు దోహదం చేసే.. తద్వారా బంగారం రేట్లు దిగొచ్చేందుకు కారణమైందని తెలుస్తోంది.

ఇంటర్నేషనల్ మార్కెట్లో 2 రోజుల కిందట స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3168 డాలర్ల వద్ద ఆల్ టైమ్ హైని తాకింది. అయితే ఇప్పుడు అది 3038 డాలర్ల స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో 130 డాలర్లకుపైగా తగ్గింది. సిల్వర్ రేటు 34 డాలర్లకుపైగా ఉండగా.. ఇప్పుడు అది 29 డాలర్ల స్థాయికి దిగొచ్చింది.

**బంగారం ధరలు..**

ఇదే ప్రభావం దేశీయంగా కూడా కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే దేశీయంగా కూడా గోల్డ్ రేట్లు కదలాడుతుంటాయన్న సంగతి తెలిసిందే. దేశీయంగా తాజాగా ఏప్రిల్ 5న ఉదయం.. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పుత్తడి ధర రూ. 900 తగ్గడంతో 10 గ్రాములకు రూ. 83,100 కు దిగొచ్చింది. కిందటి రోజు రూ. 1600 తగ్గగా 2 రోజుల్లో రూ. 2500 పతనమైంది. మరోవైపు 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 980 పడిపోవడంతో తులం రూ. 90,660 కి పడిపోయింది. ఇది 2 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 2720 తగ్గడం విశేషం.

**వెండి ధరలు..**

ఇక్కడ మరో విశేషం ఏంటంటే.. బంగారానికి మించి వెండి ధరలు పతనమయ్యాయి. హైదరాబాద్‌లో చూస్తే ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 5000 పడిపోగా.. కేజీకి రూ. 1.03 లక్షలకు చేరింది. దీనికి ముందటి రోజు కూడా రూ. 4 వేలు పతనం కాగా.. 2 రోజుల్లోనే రూ. 9 వేలు దిగొచ్చిందని చెప్పొచ్చు. అంతకుముందు రోజు కూడా రూ. 2 వేలు తగ్గగా ఇది 3 రోజుల్లో రూ. 11 వేలు పతనమైంది. అంతర్జాతీయంగా అనిశ్చితి ఉన్నప్పటికీ.. ప్రాఫిట్ బుకింగ్, డాలర్ పుంజుకోవడం, అమెరికాలో ఉద్యోగాలు పెరగడం వంటివి బంగారం ధరల పతనానికి దారితీసిందని చెప్పొచ్చు.

## టాటా క్యాపిటల్ రూ.17,000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ-నవభూమి:టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ.. టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ఈ నెల 4న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ విధానంలో ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ దాదాపు 200 కోట్ల డాలర్లు (సుమారు రూ.17,000 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా టాటా క్యాపిటల్ విలువను 1,100 కోట్ల డాలర్లు (రూ.93,500 కోట్లు)గా లెక్కగట్టినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు కొంత మంది వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో తమ వాటాలను విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో టాటా క్యాపిటల్ వెల్లడించింది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది.ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 92.83 శాతం వాటా ఉంది.

## మీ ఆస్తి పత్రాలు పోగొట్టున్నారా? నో టెన్షన్.. ఇలా మీ సమస్యకు పరిష్కారం!




న్యూఢిల్లీ-నవభూమి: ఏదైనా స్థలం లేదా ఇల్లు కొనుగోలు చేసినప్పుడు తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను భద్రంగా దాచుకుంటారు. వాటి ద్వారానే తమకు హక్కు లభిస్తుంది. అయితే, ఆ రిజిస్ట్రేషన్ పత్రాలు పోగొట్టుకుంటే ఎలా అనే ప్రశ్న చాలా మందిలో ఉంటుంది. కొన్నిసార్లు ఎక్కడో పెట్టి మర్చిపోవడం, అనుకోని సంఘటనల్లో పోగొట్టుకోవడం జరుగుతుంది. అలాంటి సందర్భంలో ఆందోళన పడాల్సి వస్తుంది. అయితే, అలా పత్రాలు పోయినప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అధికారిక సర్టిఫైడ్ కాపీ (సీసీ)ని పొందవచ్చు. ఈ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్ డాక్యుమెంట్లతో సమానంగా గుర్తింపు ఉంటుంది.సాధారణంగా ఒరిజినల్ పత్రాలను జిరాక్స్ తీసుకుని పెట్టుకుంటారు. కానీ, ఆ నకలు పత్రాలకు అధికారికంగా ధ్రువీకరణ ఉండదు. ఆస్తులు విక్రయించినప్పుడు కొనుగోలుదారులు వాటిని నమ్మరు. ఏదైనా వివాదం తలెత్తినప్పుడు కోర్టులు సైతం ఆ నకలు పత్రాలను పరిగణనలోకి తీసుకోవచ్చు. మరోవైప.. ఒరిజినల్ పత్రాలు ఉన్నా సర్టిఫైడ్ కాపీలను మాత్రమే కోర్టులకు సమర్పించాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడే ప్రతి డాక్యుమెంటును స్కానింగ్ చేసి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్‌లో భద్రపరుస్తారు. దాని ద్వారా సర్టిఫైడ్ కాపీ కోసం దరఖాస్తు చేసుకుంటే వాటి నకలు పత్రాలను ఆ శాఖ ఆమోద ముద్రతో ఇస్తారు. దీంతో ఆ డాక్యుమెంట్లకు ఒరిజినల్ వాటితో సమానమైన గుర్తింపు వస్తుంది. చట్టబద్ధత కలుగుతుంది.

ఒరిజినల్ దస్తావేజులకు ప్రత్యామ్నాయంగా సర్టిఫైడ్ కాపీని ఎప్పుడైనా, ఎన్నిసార్లైనా పొందవచ్చు. మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పొందవచ్చు. మీ సేవలో అయితే రూ.510, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అయితే రూ.50 స్టాంప్ పేర్ జత చేయాలి. దరఖాస్తులో ఆస్తి దస్తావేజు నవంబర్, రిజిస్ట్రేషన్ సంవత్సరం, హద్దులు, విస్తీర్ణం వంటి వివరాలు ఇవ్వాలి. ప్రాపర్టీ వివరాలు సక్రమంగా లేకపోయినా డాక్యుమెంట్ నంబర్, రిజిస్ట్రేషన్ సంవత్సరం తప్పనిసరిగా ఉండాలి. దరఖాస్తు చేసిన 24 గంటల్లో అధికారికంగా ధ్రువీకరించిన సర్టిఫైడ్ కాపీ ఇస్తారు.అయితే, సర్టిఫైడ్ కాపీతో ఆస్తిని విక్రయించే అధికారు పూర్తిగా రాదు. మోసగాళ్లు సీసీ ద్వారా ఆస్తులను విక్రయించే ప్రమాదం ఉంటుంది. దీంతో పోలీసు ఎఫ్ఐఆర్ తప్పనిసరి చేశారు. ఒరిజినల్ దస్తావేజులు పోయిన వెంటనే మీ సేవా కేంద్ర ద్వారా ఆస్తి పత్రాలు ఎలా, ఎక్కడ పోయాయి, వంటి వివరాలను పోలీసు శాఖకు అందించాలి. నిర్ణీత ఫీ చెల్లించి తర్వాత గడువులోపు ఆ విషయంపై పోలీసులు విచారణ చేసి ధ్రువీకరిస్తారు. ఆ తర్వాత మీ సేవా ద్వారా పోలీసు ఎఫ్ఐఆర్ పత్రం ఇస్తారు. ఎఫ్ఐఆర్, సీసీ పత్రాలతో ఆస్తులను విక్రయించే హక్కు పొందుతారు. అయితే, 2008 నుంచి జరిగిన రిజిస్ట్రేషన్లకు మాత్రమే సర్టిఫైడ్ కాపీ లభిస్తుంది. అంతకు ముందు జరిగిన రిజిస్ట్రేషన్లకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే తీసుకోవాలి.


## రూ.50 వేలలోపే కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్.. బెస్ట్ ఫీచర్స్.. డ్రైవింగ్ లైసెన్స్ అక్కర్లేదటా!



న్యూఢిల్లీ-నవభూమి: ప్రస్తుతం మన దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు మంచి డిమాండ్ ఉంది. ఎలక్ట్రిక్ టూ-వీలర్ల విక్రయాలు భారీగానే జరుగుతున్నాయి. ఓలా, ఏథర్ వంటి కంపెనీల స్కూటర్ల ధరలు రూ.1 లక్ష పైనా ఉంటున్నాయి. అయితే, చాలా మంది బడ్జెట్ ధరలో ఉన్న ఎలక్ట్రిక్ స్కూటర్ల కోసం చూస్తున్నారు. అలాంటి వారిని ఆకర్షించేందుకు చాలా కంపెనీలు రూ.50 వేల రేంజ్‌లోనే ఎలక్ట్రిక్ స్కూటర్లను మార్కెట్లో అందుబాటులోకి తెచ్చాయి. అందులో ఒకటే జెలియో ఎలక్ట్రిక్ స్కూటర్ కంపెనీ. ఈ కంపెనీ రూ.50 వేల కన్నా తక్కువ ధరకే జెలియో లిటిల్ గ్రేసీ ఎలక్ట్రిక్ స్కూటర్ తీసుకొచ్చింది.జెలియో లిటిల్ అనేది ఒక స్టార్టప్ కంపెనీ. జెలియో లిటిల్ గ్రేసీ ఎలక్ట్రిక్ స్కూటర్‌ని ఇటీవలే మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధఱ రూ.49,500గా ఉంది. ఇది నాన్ ఆర్టీఓ ఎలక్ట్రిక్ స్కూటర్. అంటే ప్రత్యేక నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని కంపెనీ వర్గాలు తెలిపాయి. జెలియో లిటిల్ గ్రేసీ ఇ-స్కూటర్‌లో 3 వేరియంట్లు ఉన్నాయి. ప్రతి మోడల్ స్కూటర్‌లో 80 కేజీల 48/60 వీ బీఎల్‌డీసీ మోటారు ఉంటుంది. ఈ స్కూటర్ గరిష్ఠంగా 150 కిలోల బరువు మోయగలదు. అలాగే గంటకు గరిష్ఠంగా 25 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. లిటిల్ గ్రేసీకి ఛార్జ్‌కి 1.5 యూనిట్ల విద్యుత్ అవసరమవుతుందని కంపెనీ పేర్కొంది.ఇందులో 48 వోల్ట్/ 32 ఏహెచ్ లీడ్ యాసిడ్ బ్యాటరీ కలిగి ఉంది. ఈ స్కూటర్ 55-60 కిలో మీటర్ల రేంజ్‌లో వస్తుంది. ఇక 60 వోల్ట్ / 32 ఏహెచ్ లీడ్ యాసిడ్ బ్యాటరీ అయితే 70 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉంటుంది. ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ చేసేందుకు 7-9 గంటల సమయం పడుతుందని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్‌లో డిజిటల్ మీటర్, యూఎస్‌బీ పోర్ట్ కీలెస్ డ్రైవ్, యాంటీ థెఫ్ట్ అలారం సహా సెంట్రల్ లాకింగ్, రివర్స్ గేర్, పార్కింగ్ స్విచ్, ఆటో రిపేర్ వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉంది. లిటిల్ గ్రేస్ ముందు, వెనకాల రెండింటిలో హైడ్రాలిక్ సస్పెన్షన్, డ్రమ్ బ్రేక్ కలిగి ఉంటుంది.

జెలియో లిటిల్ గ్రేసీ ఎలక్ట్రిక్ స్కూటర్ 48 వోల్ట్ / 32 ఏహెచ్ లీడ్ యాసిడ్ బ్యాటరీ మోడల్ ధర రూ.49,500గా ఉండగా.. లిటిల్ గ్రేస్ 60 వోల్ట్/ 32 ఏహెచ్ లెడ్ యాసిట్ బ్యాటరీ స్కూటర్ ధర రూ. 52 వేల నుంచి మొదలవుతోంది. ఇక 60 వోల్ట్/ 30 ఏ హెచ్ లిథియం అయాన్ బ్యాటరీ ధర రూ.58 వేలుగా ఉంది. ఈ స్కూటర్ పింక్, బ్రౌన్ అండ్ క్రీమ్, వైట్ అండ్ బ్లూ, యెల్లో అండ్ గ్రీన్ అనే మూడు వేరియంట్లలో లభిస్తోంది.

## స్టార్టప్స్‌పై పీయూష్ గోయల్ కామెంట్స్.. తీవ్ర దుమారం.. ఆ కంపెనీ సీఈఓ వరుస ట్వీట్లు!



న్యూఢిల్లీ-నవభూమి:భారతీయ స్టార్టప్‌లు నిజమైన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని, కేవలం కన్జ్యూమర్ టెక్, డెలివరీ సేవలపై ఆధారపడకూడదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ 2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారత స్టార్టప్‌లు డీప్-టెక్ ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని, అప్పుడే గ్లోబల్ ఐడెంటిటీ సాధించగలమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. 'మన స్టార్టప్స్ ఐస్‌క్రీమ్స్, చిప్స్ తయారీ వద్దే ఆగిపోవద్దు. చైనా తరహాలో ఏఐ వంటి అంశాలపై దృష్టి సారించాలి. మనం ఎక్కువగా ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టిసారించాం. ఐస్‌క్రీమ్స్, కిరాణా సరకులు వేగం గా డెలివరీ చేయడం ఆవిష్కరణా?' అని ప్రశ్నించారు.ఈ వ్యాఖ్యలపైనే తీవ్ర దుమారం చెలరేగింది. గోయల్ వ్యాఖ్యల్ని పలువురు స్టార్టప్స్ ఫౌండర్స్ సహా దిగ్గజ వ్యాపారవేత్తలు కూడా తప్పుబట్టారు. ఉద్యోగాల సృష్టి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో జెప్టో విజయం సాధించిందని జెప్టో సీఈఓ అదిత్ పలిచా అన్నా రు. దేశీయ స్టార్టప్స్‌పై గోయల్ నమ్మకం ఉంచా లని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహ న్‌దాస్ పాయ్ అన్నారు. స్టార్టప్స్‌లో ఉన్న ఇబ్బం దుల్ని పరిష్కరిస్తే.. విజయం సాధిస్తామని అన్నారు. అయితే ఈ క్రమంలోనే గోయల్ వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌కు చెందిన ఓ స్టార్టప్ సీఈఓ ముర్తజా అమీన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్టార్టప్‌లకు ప్రభుత్వం తగిన మద్దతు ఇవ్వడం లేదని, విద్యుత్ సరఫరా, అవినీతి, అధికారుల అధిపత్యంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపించారు.

బుర్హాన్‌పూర్‌లో 100 మంది ఉద్యోగులతో సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతున్న అమీన్ కీలక అంశాల్ని లేవనెత్తారు. "నేను బుర్హాన్‌పూర్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతూ, సంవత్సరానికి మిలియన్ డాలర్ల ఆదాయాన్ని తెస్తున్నాను. నేను ఇక్కడ అతిపెద్ద వైట్-కాలర్ ఎంప్లాయర్‌ని. స్టార్టప్‌లు ఆవిష్కరణలు చేయడం లేదని మీరు అంటున్నారు, కానీ ఆవిష్కరణలు చేయడానికి మాకు తగిన వనరులు ఇస్తున్నారా?" అని ఆయన ప్రశ్నించారు.ముర్తజా తన ట్వీట్‌లలో బుర్హాన్‌పూర్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. "మాకు 24/7 విద్యుత్ సరఫరా లేదు. అధికారుల నుంచి ఇబ్బందులు ఉన్నాయి. మమ్మల్ని మూడవ తరగతి పౌరుల్లా చూస్తారు. ప్రతి పనికి లంచాలు ఇవ్వాల్సి వస్తోంది. కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో, 60 కిలోమీటర్ల దూరంలోని ఖండ్వాకు వెళ్లి అధికారులను కలవాలి. డిజిటల్ ఇండియా అని చెబుతున్నారు. ఇదెక్కడుంది?' అని ఆయన ఆరోపించారు.గత నెలలో ప్రధానమంత్రి కార్యాలయం, కొందరు %ఞూ% అధికారులు, పీయూష్ గోయల్ కార్యాలయానికి ఈ సమస్యలపై లేఖ రాసినట్లు ముర్తజా తెలిపారు. అయితే, ఎలాంటి స్పందన రాలేదని, పీఎంఓ తన ఫిర్యాదును మధ్యప్రదేశ్ లేబర్ కమిషనర్‌కు ఫార్వర్డ్ చేసినప్పటికీ, అక్కడి నుంచి కూడా సమాధానం రాలేదని ఆయన వాపోయారు. "నేను 2016లో అమెరికాలో సౌకర్యవంతమైన జీవితం గడిపాను. కానీ, కుటుంబానికి దగ్గరగా ఉండాలని, ఉపాధి కల్పించాలని భారత్‌కు తిరిగి వచ్చాను. ఇప్పుడు నా నిర్ణయానికి ప్రతిరోజూ చింతిస్తున్నాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తన ట్వీట్ల తర్వాత దాడులు లేదా చిత్రహింసలు ఎదుర్కొనే అవకాశం ఉందని ముర్తజా ఆందోళన వ్యక్తం చేశారు. "నేను నిజాయితీగా నా మనసులోని మాట చెప్పాను. రేపు నాపై దాడులు లేదా హింస జరిగితే, నేను దాన్ని ఎదుర్కోలేను. అలాంటి పరిస్థితి వస్తే, నా కంపెనీని మూసివేసి, దుబాయ్‌కు వెళ్లి ఉద్యోగం చేస్తాను" అని ఆయన ట్వీట్ చేశారు. తన కంపెనీ మూసివేయడం వల్ల ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ముర్తజా ట్వీట్‌లపై కొందరు హిందూ-ముస్లిం కోణంలో వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన ఆయన, "నా కంపెనీలో 50 శాతం మంది మహిళలు ఉన్నారు. వారిలో సగం మంది ముస్లిం మహిళలు. 2023, 2024లో దీపావళి, హోలీ వేడుకల ఫోటోలు ఇక్కడ షేర్ చేస్తున్నాను. మతం ఆధారంగా విమర్శలు చేస్తున్న వారు ఇది గమనించండి. అది నా రీచ్‌ను పెంచడానికి సహాయపడుతోంది" అని సమాధానమిచ్చారు.పీయూష్ గోయల్ వ్యాఖ్యలు భారత స్టార్టప్ ఈకోసిస్టమ్‌లో డీప్-టెక్ ఆవిష్కరణల అవసరాన్ని హైలైట్ చేసినప్పటికీ, ముర్తజా అమీన్ వంటి స్టార్టప్ ఎంటర్‌ప్రెన్యూర్లు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక సమస్యలు ప్రభుత్వం దృష్టికి రావాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. స్టార్టప్‌లకు తగిన మద్దతు, మౌలిక సదుపాయాలు, అవినీతి రహిత వాతావరణం కల్పించడం ద్వారా మాత్రమే భారత్ గ్లోబల్ స్టార్టప్ హబ్‌గా మారగలదని అంటున్నారు.

## హోండా సరికొత్త బైకులు

న్యూఢిల్లీ-నవభూమి: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి నయా బైకులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతేడాదికిగాను సీబీ350, సీబీ350 హెచ్‌నెస్, సీబీ350ఆర్ఎస్ మోటార్‌సైకిళ్లను పరిచయంచేసింది. మూడురకాల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.2.10 లక్షలుగా నిర్ణయించింది. వీటిలో సీబీ350ఆర్ఎస్ మాడల్ రూ.2.10 లక్షలు కాగా, డీఎల్ఎక్స్‌ప్రో రూ.2.15 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు మోటార్‌సైకిళ్లు నూతన ఉద్గార మార్గదర్శకాలకు లోబడి తయారు చేసింది. 348.36 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ఎయిర్ కూల్డ్, సింగిల్ సిలిండర్‌తో రూపొందించింది. ప్రస్తుతం మార్కెట్లో స్పోర్ట్స్ బైలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా బైకులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.బ్యాటరీ ఎలక్ట్రిక్‌తో ఈవీ91 జట్టు..నూఢిల్లీ, ఏప్రిల్ 5: ఎలక్ట్రిక్ వాహనాల అగ్రిగేటర్ ఈవీ91 టెక్నాలజీస్..ఈవీకి సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి 'బ్యాటరీ ఎలక్ట్రిక్'తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది.

## పర్సనల్ లోన్.. తనఖా రుణం ఏది బెటర్!



న్యూఢిల్లీ-నవభూమి:వ్యక్తిగత రుణానికి తాకట్టు అవసరం లేదు. రుణమూ త్వరగానే లభిస్తుంది. కానీ, వడ్డీయే కాస్త ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తనఖా రుణాలపై వడ్డీ తక్కువ. పెద్ద మొత్తంలో రుణం తీసుకోవచ్చు. కాకపోతే, ఏదైనా ఆస్తి తాకట్టు పెట్టాల్సిందే. పైగా ప్రహసనంతో కూడిన ప్రక్రియ. మరి ఏది సరైనది..? అంటే, మీ అవసరం, పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత రుణం తీసుకోవాలా..? తనఖా రుణం కోసం ప్రయత్నించాలా..? అనే సందిగ్ధ స్థితిలో ఉన్నవారు సరైన ఎంపిక చేసుకోవడానికి పరిగణనలోకి తీసుకో వాల్సిన అంశాల గురించి తెలుసుకుందాం..వ్యక్తిగత రుణాలతో పాటు తనఖా రుణాలకూ కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలూ ఉన్నాయి. దేనికదే ప్రత్యేకం కూడా. ఈ రెండింటి ప్రత్యేకతలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగితే, ఎంపిక సులభమవుతుంది. అలాగే, మీ ఆర్థిక అవసరాన్ని, క్రెడిట్ స్కోర్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

వ్యక్తిగత రుణం..ఇది తనఖారహిత రుణం. అంటే, ఈ రుణం కోసం ఏమీ తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. ఈ రుణాలను మీ క్రెడిట్ స్కోర్, హిస్టరీ ఆధారంగా మంజూరు చేస్తారు. ఇందులో రుణదాతకు రిస్క్ ఎక్కువ. అందుకే, అధిక వడ్డీ వసూలు చేస్తారు. తాకట్టు అవసరం అవసరం లేకపోవడం, త్వరితగతిన రుణ మంజూరు, తీసుకున్న సొమ్మును ఏ అవసరానికైనా ఉపయోగించుకోగలిగే వెసులుబాటు ఈ రుణ అనుకూలతలు. మిగతా రుణాలతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రతికూలమే. మీ ఆదాయం, పరపతి స్థాయి, క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మీకు ఎంత రుణం మంజూరు చేయవచ్చనే అంశాన్ని రుణదాత నిర్ణయిస్తారు. ఆదాయం తక్కువగా ఉంటే మీరు ఆశించినంత రుణం లభించకపోవచ్చు. క్రెడిట్ స్కోర్ అంత బాగా లేని పక్షంలోనూ అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైగా, రుణ మొత్తంలోనూ రాజీ పడాల్సిందే.

తనఖా రుణం..ఇది తాకట్టుపై లభించే రుణం. ఇందుకోసం రుణగ్రహీత తనకు చెందిన ఏ ఆస్తినైనా తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సాధారణంగా ఏదైనా స్థిరాస్తి కొనుగోలుకు లేదా ప్రస్తుత ప్రాపర్టీని తాకట్టు పెట్టి నిధులు సమీకరించేందుకు ఈ రుణాన్ని ఎంచుకుంటారు. దీని సానుకూలత విషయానికొస్తే, ఇందులో రుణదాతకు నష్ట భయం తక్కువ. కాబట్టి వ్యక్తిగత రుణంతో పోలిస్తే కాస్త తక్కువ వడ్డీకే లభిస్తుంది. ఆస్తి విలువ ఆధారంగా రుణమిస్తారు కాబట్టి, అధిక మొత్తంలో సొమ్ము లభించే అవకాశం ఉంటుంది. పైగా, తనఖా రుణాల తిరిగి చెల్లింపులకూ చాలా సంవత్సరాలు సమయం లభిస్తుంది. తద్వారా తక్కువ మొత్తంలో నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో సుదీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ప్రతికూలతల గురించి ప్రస్తావించాలంటే, రుణం కావాలంటే ఏదైనా ఆస్తిని తప్పనిసరిగా తాకట్టు పెట్టాల్సిందే. ఒకవేళ రుణాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో రుణదాత మీ ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రుణ దరఖాస్తు ప్రాసెసింగ్, మంజూరుకూ కొంత సమయం పడుతుంది. ప్రాసెసింగ్ చార్జీలూ అధికమే. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కూడా ప్రహసనంతో కూడిన ప్రక్రియ.

ఎంపిక ఎలా..?..ఉద్దేశం: ప్రాపర్టీ కొనుగోలుకైతే తనఖా రుణం మేలు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి లేదా ఏదైనా ఆర్థిక అత్యయిక పరిస్థితుల నుంచి బయటపడేందుకైతే వ్యక్తిగత రుణం మెరుగైన ప్రత్యామ్నాయం.సమయం: తక్షణమే నిధులు కావాలంటే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కాస్త సమయం పట్టినా ఫర్వాలేదు, పెద్ద మొత్తంలో నిధులు కావాలంటే తనఖా రుణం కోసం ప్రయత్నించవచ్చు.వడ్డీ రేటు: తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు అధిక వడ్డీ అయినా ఫర్వాలేదనుకుంటే వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. తక్కువ వడ్డీయే మీ ప్రాధాన్యమైతే, తక్షణ అవసరం కాని పక్షంలో తనఖా రుణాన్ని ఎంచుకోండి.క్రెడిట్ స్కోర్: ఈ రెండింటిలో మీ అవసరానికి సరిపోయే రుణాన్ని ఎంచుకోవడంలో క్రెడిట్ స్కోర్, హిస్టరీ చాలా కీలకం. ఎందుకంటే, రుణం ఇవ్వాలా..? వద్దా..? అనే విషయంలో క్రెడిట్ స్కోరే మీ అర్హతను నిర్ణయిస్తుంది. అంతేకాదు, మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే రుణ దాత ఎంత వడ్డీ వసూలు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తాడు. కాబట్టి, తీసుకున్న రుణాలను సక్రమంగా, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను మరింత పెంచుకోవచ్చు. తద్వారా భవిష్యత్‌లో తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశముంటుంది.

## ఐపీవో బాటలో మూడు కంపెనీలు..

న్యూఢిల్లీ-నవభూమి:భారతీయ స్టాక్ మార్కెట్‌లో మూడు కంపెనీలు తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) ప్రవేశించడానికి సిద్ధమవుతున్నాయి. ఈ సంస్థలు తమ ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించాయి.ఈ సంస్థ "పార్క్" బ్రాండ్‌తో 13 గుర్తింపు పొందిన మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఐపీఓ ద్వారా రూ. 1,260 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆఫర్‌లో కొత్త షేర్లతో పాటు ప్రస్తుత వాటాదారుల విక్రయానికి కూడా అవకాశం ఉంది. 2024 సెప్టెంబర్ 30 నాటి గణాంకాల ప్రకారం, 3,000 పడకల సామర్థ్యంతో పార్క్ మెడి వరల్డ్ ఉత్తర భారతదేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేట్ ఆసుపత్రుల గొలుసుగా ఉంది. హర్యానాలో 1,600 పడకలతో రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ చెయిన్‌గా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.





## దేశంలో సగటు పని గంటలు 7.5.. ఢిల్లీలో అత్యధికంగా 9.5 గంటలు

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో ఎక్కడా లేని విధంగా ఢిల్లీలో ప్రజలు అత్యధిక సమయాన్ని తమ ఉద్యోగ కార్యకలాపాల కోసం వెచ్చిస్తున్నట్టు ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో సగటున ఉద్యోగి రోజుకు 455 నిమిషాలు అంటే 7.5 గంటలు ఉద్యోగ నిర్వహణలో గడుపుతుండగా ఢిల్లీలో మాత్రం రోజుకు 571 నిమిషాలు లేదా 9.5 గంటలు పనిచేస్తున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు శాఖ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఈ పని గంటలలో ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లి తిరిగి రావడానికి ఖర్చవుతున్న సమయాన్ని కూడా కలిపినట్టు టైమ్ యూజ్ సర్వే నివేదిక పేర్కొంది.

యూపీలో పురుష ఉద్యోగులతో పోలిస్తే మహిళలు 72 శాతం తక్కువ సమయం పని చేస్తున్నారు. బీహార్‌లో ఇది 71.6 శాతంగా ఉంది.ఢిల్లీ, కేరళలో ఈ తేడా కేవలం 22 శాతం, గోవాలో ఈ తేడా కేవలం 8%.

గ్రామాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు రోజుకు ఉపాధి కోసం వెచ్చిస్తున్న సమయం %-% సుమారు 424 నిమిషాలు.

పట్టణాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు ఉపాధి కోసం రోజులో వెచ్చిస్తున్న సమయం- 494 నిమిషాలు

వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగుల పని గంటలు

ఢిల్లీ -9.5హర్యానా - 8.2..%తమిళనాడు -8,ఒడిశా, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ - 7,

## 16 ఏళ్ల బాలికపై అత్యాచారం.. బ్యాడ్మింటన్ కోచ్ అరెస్ట్..!




**బెంగళూరు-నవభూమి:**కర్ణాటక రాజధాని బెంగళూరు లో దారుణం జరిగింది. తన దగ్గర శిక్షణ పొందేందుకు వచ్చిన 16 ఏళ్ల బాలికపై బ్యాడ్మింటన్ కోచ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అమ్మమ్మ ఫోన్‌లో ఫొటో చూసి ఆమెను నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసిన బాలిక సెలవుల్లో తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ ఓ కోచ్ దగ్గర బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో ఓ రోజు బాలిక తన అమ్మమ్మ ఫోన్‌లోంచి తన నగ్న ఫొటోలకు కోచ్‌కు పంపింది. ఇది గమనించిన అమ్మమ్మ బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వాళ్లు నిలదీయడంతో విషయం చెప్పింది.కోచ్ తనను పలుమార్లు తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని, తాను చెప్పినట్టు వింటే అదనపు కోచింగ్ ఇస్తానని చెప్పాడని తెలిపింది. విషయం బయటికి చెప్పొద్దని బెదిరించాడని చెప్పింది. దాంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాడ్మింటన్ కోచ్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో కోచ్ తన నేరం ఒప్పుకున్నాడు.

## ఒక తల్లిగా గర్వపడుతున్నా.. భగవంతుడిని అదే కోరుకున్నా : నీతా అంబానీ



**ముంబై-నవభూమి:**తన చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లోని తమ పూర్వీకుల స్వస్థలమైన జామ్‌నగర్ నుంచి శ్రీకృష్ణుడి దివ్యక్షేత్రమైన ద్వారకకు పాదయాత్ర చేయడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్‌అధినేత ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ సంతోషం వ్యక్తంచేశారు. అనంత్ అంబానీ ఆదివారం ద్వారకకు చేరుకొని శ్రీ కృష్ణుడిని దర్శించుకోవడం ద్వారా తన పాదయాత్రను ముగించారు. అనంతరం శ్రీరామ నవమిని పురస్కరించుకొని తల్లి నీతా అంబానీ, భార్య రాధికా మర్చంట్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో తనకు తోడుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ విషయంపై నీతా అంబానీ మాట్లాడుతూ.. తన కుమారుడు పది రోజులపాటు పాదయాత్ర చేసి ద్వారకకు చేరుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఒక తల్లిగా తనకు ఇది గర్వించదగ్గ సందర్భమని వ్యాఖ్యానించారు. అనంత్ అంబానీతోపాటు పాదయాత్రలో పాల్గొన్న యువకులంతా దేశ సంస్కృతిని వ్యాప్తి చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా అనంత్‌కు మరింత బలాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు నీతా అంబానీ పేర్కొన్నారు.అనంత్ అంబానీ జామ్‌నగర్ నుంచి ద్వారకకు 170 కిలోమీటర్ల పాదయాత్రను మార్చి 29న ప్రారంభించారు. రోజుకు 20 కిలోమీటర్ల చొప్పున నడిచారు. ప్రతిరోజు రాత్రి వేళల్లో ఏడు గంటల చొప్పున నడుస్తూ మార్గమధ్యలో ఎదురయ్యే ప్రజలతో మాట్లాడుతూ ముందుకుసాగారు. ఈ యాత్రలో ఎక్కడికక్కడ స్థానికులు సైతం ఆయనకు సంఘీభావంగా నడిచారు. హనుమాన్ చాలిసా, సుందరకాండ, దేవీ స్తోత్రాలను వల్లె వేస్తూ ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను అనంత్ ముగించారు.

## సీతా మాత అగ్నిప్రవేశం చేసింది ఎక్కడో తెలుసా..?



**న్యూఢిల్లీ-నవభూమి:**రామాయణం అద్భుతమైన దృశ్య కావ్యం. కొందరు ఇది కేవలం పురాణమేనని.. నిజంగా జరిగింది కాదని వాదిస్తుంటారు. అయితే, పుక్కిటి పురాణం కాదని.. యథార్థమేనని హిందువులు నమ్మకం. భారతదేశంలో ఎక్కడ చూసినా పలు చోట్ల శ్రీరాముడికి సంబంధించిన ఆలయాలయాలతో పాటు త్రేతాయుగం నాటికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. ఆ ప్రాంతాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయితే, ఇందులో ఓ అరుదైన ప్రాంతం సైతం ఉన్నది. అదే జానకీమాత పుట్టిన స్థలం సీతామర్హి. సీతమ్మ వారు భూదేవికి ప్రతిరూపం. ఇంద్రుడి ప్రసన్నం చేసుకునే క్రతువులో భాగంగా జనకమహారాజు.. నాగలితో దున్నుతున్నప్పుడు ఒక పెట్టె అడ్డు తగిలిందని.. అందులోనే సీతమ్మ వారు ఉన్నట్లుగా రామాయణం చెబుతున్నది.అయితే, సీతమ్మ వారు జనకమహారాజుకు దొరికింది సీతామర్హిలోనేనని స్థానికులు పేర్కొంటారు. ఈ సీతామర్హి బిహార్ రాష్ట్రంలో ఉన్నది. ఇందుకు అనుగుణంగా ఎక్కడ ఎన్నో కట్టడాలు సైతం చూడొచ్చు. జానకీమాత దొరికిన చోట జనకమహారాజు ఓ పెద్ద చెరువును తవ్వించడాని.. వివాహ సందర్భంగా సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఆయనే స్వయంగా స్థాపించారని స్థల పురాణం చెబుతున్నది. ఇందుకే ఈ ప్రదేశాన్ని జానకీ కుండ్‌గా పిలుస్తుంటారు. ఆ సీతామర్హిలోనే సీతమ్మ జననానికి గుర్తుగా భవ్యమైన జానకీ మందిరం సైతం కనిపిస్తుంది. కాలక్రమేనా ఈ ప్రదేశమంతా అటవీ ప్రాంతంలా మారిందని.. ఈ సమయంలోనే బీర్బల్ దాస్ అనే స్వామీజీకి సీతామర్హి గురించి దివ్యదర్శనం కలిగిందని.. ఆయన పూనికతో నాటి విశేషాలన్నీ మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చాయని స్థానికులు చెబుతుంటారు.ఇక సీతామర్హికి మరో విశిష్టత సైతం ఉన్నది. రావణ సంహారం తర్వాత లంక నుంచి వచ్చిన సీతామాత స్వచ్ఛతను నిరూపించుకొమ్మని రాముడు ఆదేశిస్తాడు. దాంతో సీతామాత అగ్నిప్రవేశం చేస్తుంది. ఈ ఘట్టం జరిగింది కూడా సీతామర్హిలోనేని చెబుతుంటారు. దీనికి రుజువుగా ఇక్కడ వేడి నీటి బుగ్గలు దర్శనమిస్తాయి. సీతమ్మవారిని దహించలేకపోయిన అగ్ని, అక్కడి భూగర్భంలోని నీటిలోకి చేరి ఇలా ఉబికి వస్తోందని భక్తుల విశ్వాసం. మాఘపౌర్ణమి రోజున ఈ నీటి బుగ్గలో స్నానం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈ సీతామర్హికి వెళ్లాలంటే బిహార్‌లోని పాట్నా, ముజఫర్‌పూర్, దర్భంగా పట్టాల నుంచి చేరుకోవచ్చు. ఈ సీతామర్హి గురించి చాలామందికి తెలియదు. ఇప్పుడిప్పుడే సీతామర్హి గురించి తెలుస్తుండడంతో సందర్శించే వారి సంఖ్య పెరుగుతూ వస్తున్నది.

# మనీల్యాండరింగ్ ఆరోపణలు.. అమెరికాలో భారత సంతతి జడ్జ్ అరెస్ట్



**వాషింగ్టన్- నవభూమి:**మనీల్యాండరింగ్ ఆరోపణలపై భారతీయ అమెరికన్ న్యాయమూర్తి కే పీ జార్జ్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రచార నిధుల నివేదికను తప్పుగా చూపడం, మనీల్యాండరింగ్ పాల్పడ్డారనే ఆరోపణలపై ఆయన శుక్రవారం అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. డెమొక్రాట్ నేత జార్జ్.. 2018 నుంచి హ్యూస్టర్‌లోని ఫోర్ట్ బెండ్ కౌంటీ జడ్జిగా పనిచేస్తున్నారు. 2022లోనూ ఆయన రెండోసారి ఈ పదవికి ఎన్నికయ్యారు. అరెస్ట్ తర్వాత జైలుకు తరలించిన ఆయనకు 20 వేల డాలర్ల పూచికత్తుతో విడుదలయ్యారు. సమర్పించిన తర్వాత విడుదలయ్యారు. ఈ ఆరోపణలకు గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఇవి రాజకీయ ప్రేరేపితమైన అభియోగాలని పేర్కొన్నారు. ఫోర్ట్ బెండ్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం ప్రకారం.. కేపీ జార్జ్ 30,000-150,000 డాలర్ల మేర మనీల్యాండరింగ్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. 2023లో జార్జ్, మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తరల్ పటేల్‌లపై వచ్చిన వేరే అభియోగాలతో ఆరోపణలకు సంబంధం లేదని అధికారులు ధ్రువీకరించారు. 2022లో జార్జ్ మోసపూరిత సోషల్ మీడియా ఖాతాలతో నకిలీ జాతి వివక్ష దాడులను సృష్టించారని ఆ అభియోగాలలో పేర్కొన్నారు.'ఈ ఆరోపణలకు పెండింగ్‌లో ఉన్న గత కేసుతో సంబంధం లేదు' అని అటార్నీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కానీ, జార్జ్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు 'నాకు న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది.. నా నిర్దోషిత్వాన్ని గట్టిగా సమర్థించుకుంటాను.. అటార్నీ కార్యాలయం తీరు సరికాదు.. ప్రతీకారానికి పాల్పడుతోంది' అని ఆరోపించారు. అయితే, ఈ వాదనను డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం తిరస్కరించింది. దర్యాప్తు చట్టపరమైన, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా సాగుతోందని నొక్కి చెప్పింది.తాజా అరెస్ట్‌తో జార్జ్ రాజీనామాపై డిమాండ్ పెరుగుతోంది. నకిలీ జాతి వివక్ష కుంభకోణాలు, ఇప్పుడు మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోన్న జార్జ్ తక్షణమే రాజీనామా చేయాలని ఫోర్ట్ బెంట్ ట్రెజరర్ బిల్ రికెర్ట్ బహిరంగంగా పిలుపునిచ్చారు. అటు, 2022 జార్జ్‌పై పోటీచేసిన రిపబ్లికన్ ట్రెవర్ నెహ్ల్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఈ అభియోగం తనను ఆశ్చర్యానికి గురిచేయలేదని.... ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి అబద్ధాలు, ద్వేషం ఎలా ఉపయోగించారో ప్రచార సమయంలో తాను చూశాను'ని అన్నారు. అమెరికాలో టెక్సాస్‌లోని వేగంగా అభివృద్ధి చెందుతున్న,, జనాభా పరంగా అత్యంత వైవిధ్యమైన కౌంటీలలో ఒకటైన ఫోర్ట్ బెండ్‌లో ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## భారీగా పతనమైన ఇరాన్ కరెన్సీ.. డాలరుకు 10 లక్షల రియాల్




**వాషింగ్టన్- నవభూమి:**చరిత్రలో ఎన్నడూ లేనంగా ఇరాన్ కరెన్సీ రియాల్ పతనమైంది. అమెరికా డాలర్‌కు 1 మిలియన్ రియాల్‌ల కంటే ఎక్కువ వద్ద ట్రేడవుతోంది. పర్షియన్ నూతన సంవత్సరం నౌరూజ్ అనంతరం ప్రారంభమైన ఇరాన్ ట్రేడింగ్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. అనూహ్యంగా రియాల్ కుదేలయ్యింది. సెలవుల్లో పరిమిత ట్రేడింగ్ కారణంగా మారకం రేటు పెరిగింది. డాలర్‌కు 1,043,000 రియాల్‌లకు చేరుకుంది. దీంతో వ్యాపారుల్లో అనిశ్చిత నెలకుంది. టెహ్రాన్ ఫెర్దొసి స్ట్రీట్‌లో వ్యాపారులు తమ కార్యకలాపాలను నిలిపివేశారు. రియాల్ పతనం ఇంకెంత వరకూ ఉంటుందో తెలియక అయోమయంలో ఉన్నారు.'డాలర్ మారకపు రేటు వరుస మార్పుల గురించి మాకు ఖచ్చితంగా తెలియదు కాబట్టి మేము కార్యకలాపాలు నిలిపివేశాం' అని ఒక రేజా షరీఫ్ అనే వ్యాపారవేత్త అన్నారు. రియాల్ బలహీనపడటానికి ఏళ్ల తరబడి ఆర్థిక ఒత్తిడి ముఖ్యంగా 2018లో ఇరాన్ అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలగిన తరువాత విధించిన అంతర్జాతీయ ఆంక్షల ప్రభావం దీనికి ప్రధాన కారణం. 2015 ఒప్పందం సమయంలో ఇరాన్ కరెన్సీ డాలర్‌కు 32 వేల రియాల్ ఉండేది. ఒప్పందంలో భాగంగా తమపై ఆంక్షల ఎత్తివేతకు బదులుగా తన యురేనియం సమృద్ధీకరణను పరిమితం చేయడానికి ఇరాన్ అంగీకరించిందిఇక, ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇరాన్ ఇరాన్ చమురు ఎగుమతులను లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో అప్పటి నుంచి రియాల్ విలువ క్రమంగా క్షీణిస్తోంది. అంతర్జాతీయ ఆంక్షలతో చమురు ఎగుమతుల్లో నిరంతర తగ్గుదల, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు రియాల్ క్షీణతకు దోహదం చేశాయని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో తమ పొదుపులు ఆవిరవుతుండటంతో ఇరాన్ ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో బంగారం, కార్లు వంటి ఆస్తులు.. మరికొందరు క్రిప్టోకరెన్సీల వైపు మొగ్గు చూపుతున్నారు. దేశంలోని అస్థిర రాజకీయ వాతావరణం కూడా వారి ఆందోళనలను మరింత పెంచుతోంది. హిజాబ్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు, గ్యాసోలిన్ ధరల పెరుగుదల గురించిన పుకార్లు మరింత ఆర్థిక అశాంతిని రేకెత్తించాయి,పడిపోతున్న కరెన్సీ విలువ ఇరాన్ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెస్తోంది. రియాల్ విలువ క్షీణించడం, ఆర్థిక దుర్వినియోగ ఆరోపణలపై ఆర్థిక మంత్రి అబ్దుల్నాసర్ హేమ్మతిపై పార్లమెంట్ అభిశంసన తీర్మానం తీసుకొచ్చింది.దేశంలో పెరుగుతున్న అంతర్గత, బాహ్య ఒత్తిళ్ల మధ్య ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్.. అమెరికాతో పరోక్ష చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అయితే, అమెరికా బెదిరింపు ధోరణిలో అర్థం ఏంటి? అని.. కేవలం ఇరాన్‌ను మాత్రమే కాకుండా ప్రపంచాన్ని కూడా అవమానిస్తోందని మండిపడ్డారు.

## పెర్ఫార్మెన్స్ బాగులేదని.. ఉద్యోగులను మోకాళ్లపై నడిపించి.. నేల నాకించి..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఓ ప్రయివేట్ సంస్థ.. ఉద్యోగుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించింది. పనితీరు సరిగా లేని ఉద్యోగులను మోకాళ్లపై నడిపించి.. నేలను నాకించడం వంటి క్రూరమైన చర్యలకు పాల్పడింది. కేరళలో జరిగిన ఈ అనాగరిక ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానిక మీడియాలో ప్రసారం కావడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ప్రైవేట్ మార్కెటింగ్ సంస్థ అమానవనీయ వేధింపులపై కార్మిక శాఖ విచారణకు ఆదేశించింది. తక్షణమే విచారణ చేపట్టాలని జిల్లా అధికారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వి శివన్కుట్టిని ఆదేశించారు. తక్షణమే నివేదిక అందజేయాలని సూచించారు.

వైరల్ అవుతోన్న దృశ్యాలలో ఒకర్ని కుక్కలాగా నేలపై మోకాళ్లపై నడపాలని బలవంతం చేస్తూ ఒక తాడును ఉపయోగించినట్టు కనిపిస్తోంది. కొంతమంది ఉద్యోగులు ఒక టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. టార్గెట్‌లు చేరుకోలేని వారిని సంస్థ యాజమాన్యం ఇలాంటి శిక్షలకు గురిచేస్తోందని చెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సంఘటన కలూర్ సమీపంలోని పెరుంబూర్‌లోని ఒక ప్రైవేట్ మార్కెటింగ్ సంస్థలో చోటుచేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆ యజమాని ఆరోపణలను ఖండించారని పోలీసులు తెలిపారు. కలూర్‌లోని సంస్థ ఉత్పత్తులను విక్రయించే పెరుంబావూర్‌లోని ఒక సంస్థలో వేధింపులు జరిగి ఉండొచ్చని అన్నారు. 'ఇప్పటివరకు మేము ఎటువంటి కేసు నమోదు చేయలేదు.. దర్యాప్తు కొనసాగుతోంది' అని ఓ పోలీస్ అధికారి తెలిపారు.కాగా, టీవీ ఛానెల్‌లో ప్రసారమైన దృశ్యాలపై కార్మిక శాఖ మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత కలవరపరిచేవని, కేరళ వంటి రాష్ట్రంలో దీనిని ఏ మాత్రం అంగీకరించలేమని అన్నారు. 'ఈ ఘటనపై విచారణకు ఆదేశించాం.. విచారణ జరిపిన తర్వాత ఈ ఘటనకు సంబంధించి నివేదికను సమర్పించాలని జిల్లా కార్మిక అధికారిని ఆదేశించాం' అని ఆయన మీడియాతో అన్నారు.రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో దీనిపై హైకోర్టు న్యాయవాది కులత్తూర్ జైసింగ్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదయ్యింది. అలాగే, కేరళ రాష్ట్ర యువజన కమిషన్ కూడా సుమోటాగా కేసు నమోదు చేసింది. ఈ మేరకు నివేదిక సమర్పించాలని ప్యానెల్ జిల్లా పోలీసు చీఫ్‌ను ఆదేశించింది. కమిషన్ ఛైర్మన్ ఎం షాజార్ మాట్లాడుతూ.. 'నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో ఆమోదయోగ్యం కాని ఇలాంటి పద్ధతులపై చట్టపరమైన చర్య తీసుకోవాలి' అని అన్నారు. అంతేకాదు, ఒక నాగరిక సమాజంగా ఇలాంటి సంఘ విద్రోహ ధోరణులకు వ్యతిరేకంగా సమిష్టిగా స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# ట్రంప్, మస్క్‌లకు ఝలక్.. వేలాదిగా వీధుల్లోకి అమెరికన్లు.. రెండు నెలల్లోనే డమాల్



**వాషింగ్టన్- నవభూమి:**అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టి మూడు నెలలైనా కాలేదు. ఆయన తీసుకుంటోన్న నిర్ణయాలపై అంతర్జాతీయ సమాజంతో పాటు అమెరికన్లు మండిపడుతున్నారు. ఇక, అమెరికాలో ఆయనపై ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. కేవలం రెండు నెలల్లోనే ఆయన రేటింగ్ ఢమాల్ అంది. , వివాదాస్పద విధానాలపై అమెరికా అంతటా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికన్లు వీధుల్లోకి వచ్చారు. వేలాది మంది ఆందోళనలు చేపట్టారు. ఆయన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ప్రపంచదేశాలే కాదు.. అమెరికన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. డోజ్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు సహా ప్రతీకార సుంకాలు, పౌర స్వేచ్ఛపై నిర్బంధానికి వ్యతిరేకంగా వాషింగ్టన్, న్యూయార్క్, హ్యూస్టన్, ఫ్లోరిడా, కొలరాడో, లాస్ ఏంజిల్స్‌తో సహా ఇతర ప్రదేశాలలో భారీ ర్యాలీలు నిర్వహించారు.

న్యూయార్క్ ర్యాలీలో పాల్గొన్న ప్రముఖ పెయింటర్ షైనా కేస్నర్ మాట్లాడుతూ.. 'ట్రంప్ వైఖరి పట్ల చాలా ఆగ్రహంతో ఉన్నాం... అత్యాచారాలు చేసిన వ్యక్తులు మన దేశాన్ని నియంత్రిస్తున్నారు... ఇది గొప్పగా లేదు' అని మండిపడ్డారు. 'ట్రంప్ దారుణమైన పరిపాలన ప్రపంచవ్యాప్తంగా మన మిత్రులను కోల్పోయేలా చేస్తోంది.. దేశంలో ప్రజలకు వినాశనం కలిగిస్తోంది' అని బైక్ టూర్ గైడ్ డయాన్ కోలిఫ్రాత్ దుయ్యబట్టారు.'ది హ్యాండ్‌మెయిడ్స్ టేల్' అనే నవలలోని పాత్రలా దుస్తులు ధరించిన ఒక మహిళ.. ట్రంప్ అబార్షన్ నిర్ణయాలకు వ్యతిరేకంగా "నా గర్భాశయం నుంచి బయటకు పో' అనే సందేశంతో ఒక పెద్ద బ్యానర్‌ను చేతబట్టింది. అమెరికా రాజు వద్దు అనే ఫ్లకార్డులను డెన్వర్, కొలరాడోలో ప్రదర్శించారు. ఈ నిరసనలు కొన్ని ఐరోపా దేశాలకు కూడా విస్తరించాయి. ట్రంప్,ఆయన వాణిజ్య విధానాలను వ్యతిరేకిస్తూ ర్యాలీలు చేపట్టారు. 'అమెరికాలో ఏమి జరుగుతుందో అది అందరి సమస్య.. ఆయన ఆర్థిక వెర్రితనం.. మమ్మల్ని మాంద్యంలోకి నెడుతోంది' అని లండన్ ర్యాలీలో పాల్గొన్న బ్రిటిష్ సంతతి అమెరికా పౌరుడు లిజ్ చాంబర్లిన్ మండిపడ్డాడు.వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ ప్రతీకార సుంకాలు చాలా మంది అమెరికన్లను ఆగ్రహానికి గురిచేశాయి. శనివారం చేపట్టిన నిరసనలు ఎక్కువగా శాంతియుతంగా జరిగాయి. వాషింగ్టన్‌లో వృద్ధుల నుంచి చంటిబిడ్డల తల్లులు సైతం నిరసనల్లో పాల్గొన్నారు. వాషింగ్టన్ ర్యాలీ నిర్వాహకులు 20,000 మంది వస్తారని అంచనా వేశారు, కానీ శనివారం మధ్యాహ్నం నాటికి ఆ సంఖ్య చాలా ఎక్కువగా ఉందని చెప్పారు.అటు, ట్రంప్ పదవిలోకి వచ్చినప్పటి నుంచి ఆయన రేటింగ్ అత్యల్ప స్థాయికి పడిపోయింది. మరోవైపు, ప్రతీకార సుంకాలపై అమెరికన్లు ఆగ్రహిస్తున్నటికీ ఈ నిరసనలను వైట్‌హౌస్ కొట్టిపారేసింది. ప్రభుత్వ విధానాల్లో ఎలాన్ మస్క్ జోక్యంపై కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన షోరూమ్‌లపై దాడులకు పాల్పడుతోన్న విషయం తెలిసిందే. ట్రంప్-మస్క్ ద్వయం అమెరికాను పతనం దిశగా తీసుకెళ్తున్నారని ఆగ్రహిస్తు న్నారు. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతోన్న నిరసనల వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## పంబన్ రైల్వే వంతెనను జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ.. ఈ వంతెన విశేషాలేంటో తెలుసా..?



**న్యూఢిల్లీ-నవభూమి:**రైలు ప్రయాణం అంటేనే చాలామంది ఎంతో ఇష్టం. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే ప్రయాణం గురించి చెప్పాల్సిన అవసరం లేదు. చుట్టూ సముద్రం.. రైలును తాకే అలల మధ్య సాగే ప్రయాణం మరిచిపోలేని అనుభూతిని ఇస్తుంది. ఈ రైలు ప్రయాణం తమిళనాడు రామేశ్వరం దీవిని ప్రధాన భూభాగంతో కలిపే పంబన్ వంతెన మీదుగా ప్రయాణం చేయాల్సిందే తప్ప.. మాటల్లో వర్ణించలేని విధంగా ఉంటుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించి వంతెన శిథిలావస్థకు చేరుకోగా.. భారతీయ రైల్వే కొత్త వంతెన నిర్మించింది. శ్రీరామనవమి సందర్భంగా ఈ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు.రూ.550కోట్లతో కొత్త వంతెన నిర్మాణం..రామేశ్వరం ద్వీపాన్ని ప్రధాన భూభాగంతో కలిపే కొత్త పంబన్ వంతెనను రైల్వేశాఖ నిర్మించింది. పాత రైల్వే వంతెన శిథిలావస్థకు చేరడంతో దాన్ని మూసివేసింది. ఆ వంతెన స్థానంలో కొత్తగా వంతెనను నిర్మించింది. గతకొద్దిరోజుల కిందట నిర్మాణం పూర్తయ్యింది. ట్రయల్ రన్ సైతం విజయవంతం కావడంతో వంతెనను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. సముద్రం గుండా ఎలాంటి ఆటంకం లేకుండా నౌకలు వెళ్లేలా ఏర్పాటు చేసిన వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిని తొలిసారిగా సముద్రం మధ్యలో 17 మీటర్ల ఎత్తులో రూ.550 కోట్ల వ్యయంతో నిర్మించారు. తమిళనాడులోని రామేశ్వరం మండపం జిల్లా పట్టణం నుంచి బంగాళాఖాతంలోని రామేశ్వరం దీవికి వెళ్లాలంటే.. కేవలం సముద్ర మీదుగానే ప్రయాణం చేయాల్సిందే. రెండు ప్రాంతాలను సముద్ర మార్గాన్ని లింక్ చేసేలా పంబన్ రైల్వే వంతెనను నిర్మించారు. అవసరానికి అనుగుణంగా లిఫ్ట్ చేసేలా ఏర్పా టు చేసిన ఫ్లెక్సిబుల్ బ్రిడ్జి. దేశంలోనే తొలి వర్టికల్ బ్రిడ్జి కావడం విశేషం.

నాలుగేళ్లలో పూర్తి చేసిన వికాస్ నిగమ్ లిమిటెడ్..

ఈ రైలు వంతెన నిర్మాణ పనులను 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ వంతెన పనులు ప్రారంభించింది. నాలుగేళ్లలోనే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసింది. వంతెనపై 600 మీటర్ల పరిధిలో భారీ సైజు వర్టికల్ లిఫ్ట్‌ని ఏర్పాటు చేసింది. ఆ పనులు పూర్తికావడానికి ఐదు నెలల సమయం పట్టింది. ఈ లిఫ్ట్ బరువు 660 టన్నులు ఉటుంది. పొడువు 72.5 మీటర్లు. పంబన్ వంతెన సముద్రంలో 2.08 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. వంతెన కింద నుంచి ఓడలు ఎలాంటి ఆటంకాలు లేకుండా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. వంతెనకు రెండువైపులా భారీ స్తంభాలుంటాయి. వాటికి 320 టన్నుల బరువున్న దూలాలు వేలాడుతుంటాయి. 625 టన్నులు బరువు ఉంటాయి.

విద్యుత్ అవసరం లేదు..

పంబన్ వంతనపై ఉండే వర్టికల్ లిఫ్ట్‌లో సుమారు 35 టన్నుల బరువు ఎత్తడానికి మాత్రమే విద్యుత్ సరఫరా అవసరం. వంతెనను ఎత్తాల్సి వచ్చినప్పుడు కింద లిఫ్ట్‌లు, మోటార్లు పైకి లిఫ్ట్ చేస్తాయి. రిమోట్ కంట్రోల్ ద్వారానే ఆపరేట్ చేస్తారు. పంబన్ సముద్రం అడుగున గట్టి నేల తగిలే వరకూ 25-35 మీటర్ల లోతున పునాదులు నిర్మించారు. ప్రపంచంలోనే ఎక్కువగా తుప్పు పట్టే రెండో ప్రాంతంగా పంబన్ ప్రాంతానికి పేరుంది. సముద్రం అలలు పంబన్ వంతెనపైకి వరకు వస్తుంటాయి. ఇనుము పట్టాలు కావడంతో తప్పుపడుతుంటాయి. అయితే, దాదాపు 104 సంవత్సరాల కిందట నిర్మించిన పంబన్ వంతెన ఇనుము తుప్పు పట్టింది. దాని స్థానంలోనే కేంద్రం కొత్తగా వంతెనను నిర్మించింది. పత వంతెనను బ్రిటిష్ కాలంలో నిర్మించారు. ఈ వంతెన 1914లో ప్రారంభించారు. అప్పటి వరకు దాదాపు వందేళ్లకుపైగా సేవలందించింది.వందేళ్ల వరకు కొత్త వంతెన సేవలు..కొత్త వంతెనకు తుప్పు సమస్య రాకుండా మూడు పొరల పాలీసిలోక్సేన్ పెయింట్ వేశారు. దాంతో 58 సంవత్సరాల వరకు తుప్పు ముప్పు ఉండదు. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే వందేళ్ల వరకు ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించొచ్చు. సముద్రంలో వేసిన దిమ్మెలకు ఇబ్బంది కలుగకుండా కేసింగ్ విధానంలో ఐరన్ చట్రాలతో కాంక్రీట్ వేశారు. వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిలో ఒక బోల్టును వాకపోడం విశేషం. అన్నీ వెల్డింగ్‌తోనే జోడించారు. వంతెన మొత్తాన్ని స్కాడా సెన్సర్లతో లింక్ చేయగా.. గంటకు 58 కిలో మీట ర్ల వేగంతో గాలులు వీస్తే స్కాడా సెన్సార్లు ఆటోమేటిక్‌గా వంతెనను మూసివేస్తాయి. మత్స్యకారుల పడవలు, నేవీ, పోర్టుల నుంచి వచ్చే ఓడ లు వంతెనను దాటాల్సి వచ్చిన సమయంలో సిబ్బంది దిమ్మెల వద్ద ఏర్పాటు చేసిన గదుల్లోకి వెళ్లి రిమోట్ ద్వారా వంతెనను లిఫ్ట్ చేస్తారు. చాలా రోజుల తర్వాత పంబన్ రైలు వంతెన మీదుగా ప్రయాణం సాగించనుండడంతో రామేశ్వరానికి వెళ్లే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.65వేల కోట్లతో త్వరలో 26 రఫేల్-మారిటైమ్ యుద్ధ విమనాలు

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 26 రఫేల్-మ్యారిటైమ్ యుద్ధ విమానాల కొనుగోలుకు తాజాగా సిద్ధమైంది. 7.6 బిలియన్ డాలర్ల(సుమారు రూ.65వేల కోట్లు) విలువైన ఈ ఒప్పందం కేంద్రం ఆమోదం కోసం ఈ నెలాఖరులో భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ముందుకు రానున్నట్లు సమాచారం. ఆ తర్వాత మూడు అదనపు డీజిల్ ఎలక్ట్రిక్ జలాంతర్గాముల కొనుగోలుకు కూడా ప్రభుత్వం పచ్చజెండా ఊపే అవకాశం ఉందని తెలుస్తోంది.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

12 | హైదరాబాద్ | సోమవారం | 07 । ఏప్రిల్ । 2025




## శ్రీరామనవమి శుభాకాంక్షలతో.. స్టన్నింగ్‌గా రామం ఫస్ట్ లుక్

గోపీచంద్‌తో చిత్రాలయం స్టూడియోస్‌పై నిర్మాత వేణు దోనెపూడి విశ్వం సినిమాను తెరకెక్కించారని తెలిసిందే. తాజాగా ఈ బ్యానర్ నుంచి అదిరిపోయే అప్‌డేట్ అందించారు మేకర్స్. వేణు దోనెపూడి టీం నిర్మిస్తోన్న కొత్త చిత్రం రామం ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రామం ఫస్ట్ లుక్ విడుదల చేశారు.జై.శ్రీరామ్ నినాదంతో ఉన్న జెండాను పట్టుకొని గుర్రపుస్వారి చేస్తూ ఉన్న లుక్ స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. యోధుల గాథను ఆవిష్కరించే నేపథ్యంలో సినిమా ఉండబోతుందని ఫస్ట్ లుక్ ద్వారా తెలియజేశారు మేకర్స్. సమస్త మానవాళికి తారక మంత్రం శ్రీరామనామం.ధర్మ సంస్థాపనకు శ్రీరామచంద్రుడు చూపిన బాటే కాదు.. అధర్మాన్ని నిర్మూలించేందుకు ఆయన కోదండం చేపట్టి చూపిన వీరత్వం గురించి.. అలాంటి గొప్ప సమగ్ర మూర్తిమత్వాన్ని ఆధారంగా అలనాటి రామరాజ్యాన్ని నేటి కాలానికి కనెక్ట్ చేస్తూ ఇప్పటివరకు రానట్వంటి వైవిధ్యమైన కథతో ఈ సినిమా మీ ముందుకు రానుందని చెప్పుకొచ్చారు వేణు దోనెపూడి.ఈ సినిమాలో టాలీవుడ్‌కు చెందిన ఓ రైజింగ్ స్టార్ హీరోగా కనిపించబోతున్నాడని.. దేశవ్యాప్తంగా పాపులా రిటీ ఉన్న యాక్టర్లు, సాంకేతిక నిపుణులు ఈ సినిమాలో భాగం కానున్నారని తెలిపారు.



## బ్యాంకాక్ కొండలు కోనల్లో యువనటి గట్స్



పచ్చని ప్రకృతిని ఆస్వాధించే మనసుండాలే కానీ ఈ ప్రపంచంలో ఎగ్జోటిక్ లొకేషన్లకు కొదవేమీ లేదు. అందునా బ్యాంకాక్ అడవుల్లో సుదూర తీరాన పచ్చందాలను తనివి తీరా ఆస్వాధించి తీరాల్సిందే. అక్కడ కొండలు కోనలు గుట్టలు నదీ సముద్ర జలాల్లో విహరిస్తే కలిగే మజానే వేరు! ప్రస్తుతం అలాంటి అద్భుతమైన విహారయాత్రను ఆస్వాధిస్తోంది మెహ్రీన్ ఫీర్జదా.తాజాగా కొండల మధ్య పచ్చని జలాల్లో బోట్ షికార్ చేస్తూ కనిపించింది. ఎత్తైన పర్వతాల నడుమ పచ్చని నీడ ఆ నది నీటిలో ప్రతిబింబిస్తోంది. అలాంటి చోట మెహ్రీన్ తనను తాను మర్చిపోయి ఇదిగో ఇలా ఫోజులిచ్చింది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో థై అందాలను కూడా ప్రదర్శిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం మెహ్రీన్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. చేతిలో సినిమాల్లేవ్. కావాల్సినంత తీరిక సమయం ఉంది. దానిని ఇలా సద్వినియోగం చేస్తోందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఏదైనా ట్రావెల్ మ్యాగజైన్ షూట్ కోసం అక్కడికి వెళ్లిందా? అని కూడా సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు ఇలియానా ఫిజీ దీవికి ఇదే తరహాలో ప్రచారం కల్పించింది. ఇప్పుడు మెహ్రీన్ బ్యాంకాక్ అందాలను ప్రమోట్ చేయబోతోందా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ అన్నిటికీ మెహ్రీన్ స్వయంగా స్పందించాల్సి ఉంటుంది. ఎఫ్ 2 ఫ్రాంఛైజీ సినిమాల తర్వాత మెహ్రీన్ కి సరైన ఆఫర్ లేదు. మునుముందు ప్రయత్న లోపం లేకుండా ఏదైనా మాయాజాలం


## అలేఖ్య పికిల్స్ ఇష్యూ.. అత్తమ్మాస్ కిచెన్ రేట్స్ వైరల్..



గత వారం రోజులుగా సోషల్ మీడియాలో అలేఖ్య చిట్టి పికిల్స్ ఇష్యూ ఫుల్ వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. నెట్టింట ఎక్కడ చూసినా ఆ విషయంపై చర్చ నడుస్తోంది. అసభ్యకరమైన పదాలతో ఓ కస్టమర్ కు అలేఖ్య పెట్టిన వాయిస్ మెసేజ్ ఇప్పటికీ ట్రెండింగ్ లోనే ఉంది. దీంతో నెటిజన్లు, కస్టమర్లు ఫుల్ ఫైర్ అవుతున్నారు. రాజమండ్రికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు అలేఖ్య, సుమ, రమ్య.. నాన్ వెజ్ పికిల్స్ బిజినెస్ తో ఫుల్ ఫేమస్ అయ్యారు. పీతలు, రొయ్యలు, చేపల పచ్చళ్లకు ప్రసిద్ధి గాంచిన వారు.. ఇన్ స్టా, యూట్యూబ్ లో బిజినెస్ ప్రమోట్ చేసుకుని క్రేజ్ సంపాదించారు. కానీ రేట్స్ ఎక్కువ ఉన్నాయని అడిగిన వారిని తిట్టి ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డారు. దీంతో బూతులు విని ఒళ్ళు మండిన కస్టమర్.. సోషల్ మీడియాలో షేర్ చేయగా ఫుల్ వైర్ అయింది. అలా ట్రోల్స్, విమర్శలు భారీ స్థాయిలో రావడంతో తమ పికిల్స్ బిజినెస్ వెబ్ సైట్ ను క్లోజ్ చేసి.. వాట్సాప్ అకౌంట్ ని డిలీట్ చేశారు. అయినా నెటిజన్లు సైలెంట్ అవ్వలేదు. రీసెంట్ గా క్షమాపణలు కూడా చెప్పారు అలేఖ్య సిస్టర్స్. ఏదైనా రేట్ కోసం అడిగిన కస్టమర్ కు రెస్పెక్ట్ ఇవ్వకపోవడం వల్ల బిజినెస్ కు పెద్ద దెబ్బ పడిందని చెప్పాలి. అదే సమయంలో ఇప్పుడు అత్తమ్మాస్ కిచెన్ రేట్స్ వైరల్ అవుతున్నాయి. చిరంజీవి సతీమణి సురేఖ కొణిదెల వంటలను అందరికీ రుచి చూపించేలా అత్తమ్మాస్ కిచెన్ పేరుతో ఫుడ్ బిజినెస్ ను ఉపాసన గతేడాది స్టార్ట్ చేశారు. ఇంటి భోజనం మిస్ అవుతున్న ఫీలింగ్ రానివ్వకుండా బిజినెస్ మొదలుపెట్టినట్లు మెగా కోడలు ఇప్పటికే తెలిపారు. వ్యాపారంలో భాగంగా పొంగల్ మిక్స్, పులిహోర పేస్ట్, ఉప్మా మిక్స్ తో పాటుగా రసం పౌడర్ రెసిపీలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే నాలుగు ప్యాకెట్స్ ఒక్కొక్కటి చొప్పున కాంబోలో తీసుకుంటే వెయ్యి రూపాయలకు పైగా ధర ఉంటుంది. ప్రస్తుతం అత్తమ్మాస్ కిచెన్ వెబ్ సైట్ లో మూడు పులిహోర పేస్ట్ ప్యాకెట్లు రూ.1170కు.. ఐదు రసం పౌడర్ ప్యాకెట్స్ రూ.1185కు.. ఉప్మా మిక్స్ ప్యాకెట్స్ 5 కాంబో రూ.1175కు.. 5 పొంగల్ మిక్స్ ప్యాక్స్ రూ.1185కు విక్రయిస్తున్నారు. అందుకు సంబంధించిన స్క్రీన్ షాట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో నెటిజన్లు ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు.

## దివి.. ఇంత అందంగా కనిపిస్తే ఎలా..






తెలుగు ప్రేక్షకులకు 'బిగ్ బాస్' ద్వారా పరిచయమైన దివి వాధ్య సొగసుల తారగా ఎదుగుతున్న నటి. గ్లామర్‌కు తగ్గటే, తను ఎంచుకునే డ్రెస్‌లు, ఫోటోషూట్లు, స్టైలింగ్ అన్నీ ప్రత్యేకంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. తాజాగా ఆమె పంచుకున్న ట్రెడిషనల్ అవతార్‌లోని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీలి లెహంగా, మల్టీ కలర్ హ్యాండ్లూమ్ చోళితో డివి చేసిన ఈ ఫోటోషూట్ చాలా అందంగా ఉంది. చేతులను పైకి ఎత్తుతూ తీసుకున్న స్టిల్స్‌లో ఆమె స్టిల్, ఫీల్ చూసినవాళ్లను కట్టిపడేస్తోంది. 'నువ్వు చూసి వెళ్ళిపోతావు.. నీకు కనపడని దృశ్యాలా మేము మిగిలిపోతాం' అంటూ క్యాప్షన్ కూడా వైరల్ అవుతుండడం విశేషం. దివి కెరీర్‌పై ఓ లుక్కేస్తే.. 'మహర్షి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన తర్వాత బిగ్ బాస్-4లో భాగమైంది. అక్కడ తన అందం, స్వభావంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. %ూశ్రీంశీ =ము౧% - పుష్ప 3 కోసం ఇద్దరు యువ హీరోలా.. సెట్టయితే డబుల్ కిక్! ఆ తర్వాత 'లంబసింగి' అనే సినిమాతో హీరోయిన్‌గా మారిన డివి, ప్రస్తుతం పలు ప్రాజెక్ట్స్‌లో కూడా భాగమైందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె సోషల్ మీడియా యాక్టివిటీ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ అయితే ఉంది. ట్రెడిషనల్ లుక్స్, మోడ్రన్ ఫోటోషూట్లు.. ఇలా విభిన్నంగా కనిపిస్తూ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తాజాగా ఆమె చేసిన ఈ లెహంగా ఫోటోషూట్‌లోని ఫొటోలే ఇందుకు నిదర్శనం. ప్రతి ఫ్రేమ్‌లోనూ దివి ఒక నెమలి అందంతో మెరిసిపోతోంది. %మధ్యలో మిరాయ్ పరీక్ష! ఈ ఫోటోలు చూసిన అభిమానులు 'ఫొటో కాదు.. కవితలా ఉంది', 'సాంప్రదాయానికి గ్లామర్ టచ్ ఇచ్చావు' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. దివి ప్రస్తుతం వెబ్ సిరీస్‌లను కూడా ఎంచుకుంటూ తన పరిధిని పెంచుకుంటోంది. ఇక ఆమె కెరీర్ మరింత మెరుగైన స్థాయికి ఎలా చేరుకుంటుందో చూడాలి. కానీ ఈ ఫోటోలు మాత్రం ఆమె ఫ్యాషన్ సెన్స్‌కు అద్దం పడుతున్నాయనడం మాత్రం నిజం.

## పాన్ ఇండియా స్టార్ నేల విడిచి సాము?



డార్లింగ్ ప్రభాస్ నెక్స్ట్ ఏంటి? అనేది సందిగ్ధంలో ఉంది. మారుతి దర్శకత్వం వహించిన 'రాజా సాబ్' త్వరలో విడుదలకు రావాల్సి ఉన్నా ఆలస్యమైంది. ఈ సినిమాకి సంబంధించిన తదుపరి అప్ డేట్ ఎప్పుడొస్తుందో సరైన స్పష్టత లేదు. ఈ సినిమాతో పాటు హను రాఘవపూడితో ఫౌజీ చిత్రీకరణను వేగంగా పూర్తి చేస్తున్నాడు. అలాగే 'సలార్ 2' పైనా ప్రభాస్ ఫోకస్ చేసాడు. 'సలార్ 2'ని హొంబలే సంస్థ అధికారికంగా ప్రకటించినా, ఆ తర్వాత యాక్షన్ సీక్వెన్సులు తెరకెక్కించారని కథనాలొచ్చాయి. కానీ లేటెస్ట్ అప్ డేట్ లేక అభిమానులు నిరాశగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' సీక్వెల్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కనుందని హొంబలే సంస్థ వెల్లడించింది. ఇప్పుడు ఈ రెండు సినిమాల రిలీజ్ తేదీలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏప్రిల్ లో రావాల్సిన 'రాజాసాబ్' అంతకంతకు ఆలస్యమవ్వడంపై అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు. సందీప్ వంగాతో 'స్పిరిట్' ఈ ఏడాది చివరిలో ప్రారంభమవుతుందని ఇంతకుముందే కథనాలొచ్చాయి. అయితే ఇది 'కల్కి 2' కంటే ముందే సెట్స్ పైకి వెళుతుందా? లేదా! అన్నది ఇప్పటికి సస్పెన్స్. తాజాగా తిరుమలేశుని దర్శనం అనంతరం దర్శకుడు నాగ్ అశ్విన్ కల్కి 2898ఏడి సీక్వెల్ గురించి వ్యాఖ్యానించారు. కల్కి 2 ఇప్పుడే ప్రారంభం కాదు. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు సాగుతున్నాయి. బౌండ్ స్క్రిప్ట్ సిద్ధమవ్వడానికి ఎంత సమయం పడుతుంది? అనేదానిని బట్టి ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళుతుందని తెలిపారు. ఏడాది చివరి నాటికి ప్రారంభించే ఆలోచన ఉందని అన్నారు. అయితే సందీప్ వంగా స్పిరిట్ బౌండ్ స్క్రిప్ట్ ని రెడీ చేసాడా లేదా? అతడి తదుపరి ప్రాజెక్ట్ కి సంబంధించిన పని ఎంతవరకూ వచ్చింది? అనేదానిపైనా సరైన స్పష్టత రావాల్సి ఉంది. రేసులో సందీప్ వంగా ముందున్నాడా? నాగ్ అశ్విన్ ముందున్నాడా? అన్నది తేలాల్సి ఉంది. ఈ మధ్యలో ఫౌజీ చిత్రీకరణను వేగంగా పూర్తి చేసేందుకు హను రాఘవపూడి ప్రయత్నిస్తున్నాడు. ఈ సినిమా తర్వాత కూడా ప్రభాస్ ని లాక్ చేయాలని అతడు గట్టి ప్లాన్ తో ఉన్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజాసాబ్, ఫౌజీ, సలార్ 2, కల్కి 2898 ఏడి, స్పిరిట్, కన్నప్పలో అతిథి పాత్ర, హనుతో మరో మూవీ.. ఈ లైనప్ చూస్తుంటే ప్రభాస్ ఐదేళ్లు బ్లాక్ అయిపోయాడని అర్థమవుతోంది. కానీ అతడి నుంచి ఒక్కో సినిమా రిలీజ్ కావడానికి ఏళ్ల తరబడి సమయం పడుతోంది. దీంతో అభిమానులు చాలా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

## నటికి చేదు అనుభవం.. శ్రీలీల చేయి పట్టుకుని లాగిన ఆకతాయిలు



టాలీవుడ్ నటికి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ఒక సినిమా ఈవెంట్‌లో భాగంగా బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో కలిసి వెళుతుండగా.. గుంపులో ఉన్న ఆకతాయిలు ఆమె చేయి పట్టుకుని లాగారు. దీంతో అప్రమత్తమైన ఆమె బాడీగార్డ్‌లు వారి నుంచి శ్రీలీలను కాపాడారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.కార్తిక్ ఆర్యన్, శ్రీలీల జంటగా ఒక బాలీవుడ్ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. సంగీత నేపథ్యంలో రాబోతున్న సినిమాతోనే శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ సినిమాకు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తుండగా.. గుల్షన్ కుమార్ టి-సిరీస్ ప్రెజెంటేషన్, ఎ టి-సిరీస్ ఫిల్మ్స్ అనురాగ్ బసు ప్రొడక్షన్ బ్యానర్‌లపై భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంగీత దిగ్గజం ప్రీతమ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

## అషూ రెడ్డికి బ్రెయిన్ ట్యూమర్.. సగం జుట్టు కూడా తొలగించారా..!



జూనియర్ సమంతగా పేరు తెచ్చుకున్న అషూ రెడ్డి బిగ్ బాస్ షోతో మంచి పాపులారిటీ తెచ్చుకుంది. మొదట్లో టిక్ టాక్ వీడియోలు, రీల్స్ చేసుకుంటూ వచ్చిన ఈ అమ్మడు ఛల్ మోహన్ రంగా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఇందులో అషూ నటనకి ఇంప్రెస్ అయిన బిగ్ బాస్ నిర్వాహకులు ఆమెకి షోలో పాల్గొనే ఛాన్స్ ఇచ్చారు. బిగ్ బాస్ తర్వాత అషూ రేంజ్ పెరిగిపోయింది. అషురెడ్డి రెండు సార్లు బిగ్‌బాస్‌లో అడుగుపెట్టింది. కానీ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయింది. చూడ్డానికి అచ్చం సమంత లాగే ఉండే ఆమెకు జూనియర్ సామ్ అనే బిరుదు రాగా, అది తనకు ఇష్టం లేదని చెప్పుకొచ్చింది. తనని అషురెడ్డిగానే ప్రేక్షకులు గుర్తించాలని కోరకుంటున్నట్లు తెలిపింది.అయితేఎంతో చలాకీగా సరదాగా ఉండే అషురెడ్డికి బ్రెయిన్ ట్యూమర్ వచ్చిందట. హెయిర్ తీసేసి సర్జరీ కూడా చేసినట్టు తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 2024లో కామాఖ్య టెంపుల్‌కి వెళ్లినప్పుడు తనకి విపరీతమైన తలనొప్పి వచ్చిందట. ఐదు రోజుల పాటు డోలో వేసుకున్నా కూడా నొప్పి తగ్గలేదు. తల అంతా బరువుగా ఉండేది. తల కూడా లేపలేని పరిస్థితి వస్తే.. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి టెస్టులు చేయించుకన్నాను. అప్పుడు బ్రెయిన్ లో టమాటా సైజ్ అంతా ట్యూమర్ ఉందట. అది చూసి డాక్టర్స్ షాక్ అయ్యారు. ఎలాంటి లక్షణాలు లేకుండా ట్యూమర్ ఉండటం అందరిని ఆశ్చర్యపరిచింది. అయితే అపోలో ఆసుపత్రిలో ఆపరేషన్‌కి రెడీ చేశారు.డబ్బులు ముందు ఏమి అడగకుండానే సర్జరీ చేశారు. ఆసుపత్రిలో 10 రోజులు ఉన్నాను. సర్జరీ టైమ్‌లో సగం జుట్టు తీసారు. అయితే ట్యూమర్ తీసేటప్పుడు నరాలు డిస్ట్రబ్ అయితే మెమోరీ లాస్ అవ్వొచ్చు లేదంటే ఏదైన జరగొచ్చు అని ముందే నన్ను ప్రిపేర్ చేశారు. కాని ఆపరేషన్ బాగానే అయింది. గట్టిగా మాట్లాడలేకపోయాను. ఆరు నెలలు రెస్ట్ తీసుకోవాలని చెప్పారు కాని ఖాళీగా కూర్చోలేక రెండు నెలలకే షూట్‌కి వెళ్లాను. హెయిర్ స్టయిలిస్ట్ విగ్స్ తో సెట్ చేయడానికి ఎంతో కష్టపడ్డారు. పనిలో పడడం వల్లనే త్వరగా రికవరీ అయ్యాను అని అషూ పేర్కొంది. అయితే ఎంతో సరదా సరదాగా ఉండే అషూ ఇన్ని బాధలు పడిందా అని అందరు ఆశ్చర్యపోతున్నారు.

## ఐపీఎల్ పాయింట్ల పట్టికలో అట్టడుగున మాజీ చాంపియన్స్..! ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో డీసీ..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో భాగంగా శనివారం రెండు మ్యాచులు జరిగాయి. ఈ రెండు మ్యాచులు దాదాపు ఏకపక్షంగానే సాగాయి. తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఓడించింది. ఇక రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను రాజస్థాన్ రాయల్స్ మట్టికరిపించింది. రెండు మ్యాచుల తర్వాత పాయింట్ల పట్టికలో భారీగానే మార్పులు జరిగాయి. రాజస్థాన్‌పై ఓటమితో పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో మూడు స్థానాలు దిగజారింది. మాజీ చాంపియన్స్ జట్లు పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరాయి. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌పై ఓసారి లుక్కేద్దాం రండి..!ఢిల్లీపై చెన్నై 25 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇది ఢిల్లీకి వరుసగా మూడో విజయం. ఆరు పాయింట్లు, ం1.257 నికర రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా చెన్నై జట్టు రెండు పాయింట్లతో టేబుల్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్నది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో రెండు పాయింట్లు, రన్‌రేట్ -0.891గా ఉన్నది. పంజాబ్‌పై విజయంతో రాజస్థాన్ సైతం పాయింట్ల పట్టికలో పైకి చేరింది. ఇప్పటి వరకు నాలుగు మ్యాచులు ఆడిన ఆ జట్టు రెండు విజయాలు, రెండు ఓటములతో ఏడో స్థానంలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో నాలుగు పాయింట్లు, -0.185 రన్‌రేట్ ఉన్నది. ఇక పంజాబ్ జట్టు మూడు స్థానాలు కోల్పోయింది. ఢిల్లీ-చెన్నై మ్యాచ్ తర్వాత, పంజాబ్ కింగ్స్ మొదటి స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. పంజాబ్ మూడు మ్యాచులు ఉండగా.. రెండు విజయాలతో నాలుగు పాయింట్లు, ం0.074 రన్‌రేట్‌గా ఉన్నది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, నాలుగు పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఆ జట్టు రన్‌రేట్ ం1.149గా ఉన్నది.

## కింగ్స్‌కు చెక్.. రాణించిన జైస్వాల్, పరాగ్



**ముల్లాన్‌పూర్-నవభూమి:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాల పరంపరకు రాజస్థాన్ రాయల్స్ చెక్ పెట్టింది. శనివారం డబుల్ ధమాకాలో భాగంగా జరిగిన రెండో పోరులో పంజాబ్‌పై రాజస్థాన్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో సొంత ఇలాఖాలో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుందామనుకున్న పంజాబ్ ఆశలపై రాజస్థాన్ నీళ్లు గుమ్మరించింది. తొలుత యశస్వి జైస్వాల్(45 బంతుల్లో 67, 3ఫోర్లు, 5సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు రియాన్ పరాగ్(25 బంతుల్లో 43 నాటౌట్, 3ఫోర్లు, 3సిక్స్‌లు) రాణించడంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 205/4 స్కోరు చేసింది. ఆఖర్లో హెట్‌మైర్(12 బంతుల్లో 20, 2ఫోర్లు, సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ 200ల మార్క్ అందుకుంది. నిలకడలేమితో సతమతమవుతున్న జైస్వాల్..పంజాబ్‌తో మ్యాచ్‌లో అదరగొట్టాడు.కెప్టెన్ సంజూ శాంసన్(38) సహకారంతో జైస్వాల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఓవైపు చూడచక్కని షాట్లతో అలరిస్తూ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. తన ఇన్నింగ్స్‌లో 3ఫోర్లు, 5 భారీ సిక్స్‌లతో దుమ్మురేపాడు. శాంసన్‌తో కలిసి తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన జైస్వాల్..పరాగ్‌తోనూ అదే దూకుడు కొనసాగించాడు. తానేం తక్కువ కాదన్నట్లు పరాగ్ కూడా చెలరేగడంతో పరుగుల రాక జోరందుకుంది.

## పేస్ పిచ్చోడు వస్తున్నాడు.. బ్యాటర్లూ బ్యాగులు సర్దుకోండి



**న్యూఢిల్లీ-నవ భూమి:** ఐపీఎల్ తాజా ఎడిషన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రయాణం సాఫీగా సాగడం లేదు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి స్టార్లతో నిండిన జట్టుకు ఈ సీజన్‌లో సరైన స్టార్ట్ దొరకలేదు. ఇప్పటిదాకా ఆడిన 4 మ్యాచుల్లో కేవలం ఒకే విజయం సాధించింది పాండ్యా సేన. కోల్‌కతా నైట్ రైడర్స్ మీద నెగ్గిన ఎంఐ.. తర్వాతి మ్యాచ్‌లో లక్నో చేతుల్లో ఓడింది. ఆర్సీబీతో మండే ఫైట్‌లో తలపడేందుకు సిద్ధమవుతోంది ముంబై. పడుతూ లేస్తూ పోతున్న ఆ టీమ్‌లో జోష్ నింపేందుకు పేస్ పిచ్చోడు వచ్చేస్తున్నాడు. అతడు గనుక చెలరేగితే బ్యాటర్లు తమ బ్యాగులు సర్దుకోవాల్సిందే. మరి.. ఎవరా స్పీడ్‌స్టర్ అనేది ఇప్పుడు చూద్దాం..

ఆ మ్యాచ్‌తో బరిలోకి..ముంబై ఇండియన్స్ ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వచ్చేశాడు. ఐపీఎల్-2025లో తొలి మ్యాచ్ ఆడేందుకు పేసుగుర్రం రెడీ అవుతున్నాడు. ఎంఐ ఫ్రాంచైజీ ఓ పోస్ట్ ద్వారా బుమ్రా రాక గురించి తెలిపింది. బ్యాట్లతో తయారు చేసిన కుర్చీపై బుమ్రా కూర్చున్న ఫొటోను పోస్ట్ చేసింది. అతడ్ని రారాజుగా చూపిస్తూ.. గర్జించడానికి సింహం సిద్ధమవుతోందంటూ ఆ పోస్ట్‌కు క్యాప్షన్ రాసుకొచ్చింది. కాగా, వెన్ను గాయంతో కొన్నాళ్లుగా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉంటూ కోలుకున్నాడు బుమ్రా. ఫిట్‌నెస్ టెస్ట్ పాస్ అవడంతో తాజాగా ముంబై శిబిరంలో జాయిన్ అయ్యాడతను. ఆర్సీబీతో ఏప్రిల్ 7వ తేదీన జరిగే మ్యాచ్‌లో అతడు ఆడనున్నాడని తెలుస్తోంది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**